


www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




శుక్రవారం | 8-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 153 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి మ.2.12 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: ఉత్తరాషాఢ మ.2.28 తదుపరి శ్రవణం, వర్జ్యం: సా.6.27-8.03, దుర్ముహూర్తం: ఉ.8.32-9.23, మ.12.46-1.36, అమృతఘడియలు: ఉ.7.56-9.34, తె.4.01-5.37, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.41 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# నేతన్న భరోసా ₹25 వేలు ఏడాదికి

## చేనేత కార్మికులకు 546 కోట్లతో పింఛన్లు

- నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పవర్ మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం
- 5శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తాం
- ఓఎన్‌డీసీ ద్వారా ఉత్పత్తుల మార్కెటింగ్
- చేనేతల సంక్షేమానికి యాక్షన్ ప్లాన్
- 93 వేల కుటుంబాలకు ప్రయోజనం
- రాష్ట్రమంతటా వీవర్ శాలల ఏర్పాటు
- అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం
- అధికారికంగా ప్రగడ కోటయ్య జయంతి
- ఆదరణ-3 కింద ఆధునిక మగ్గాలు
- చేనేత దినోత్సవ సభలో సీఎం హామీలు


మంగళగిరి వీవర్‌శాలలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో రాట్నంపై నూలు వడుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మంగళగిరి/గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'చేనేత కార్మికులకు చేయూత అందించడానికి 'నేతన్న భరోసా' కింద ప్రతి ఏటా రూ.25వేలు ఇచ్చే బాధ్యత నాది' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్ శాల వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ఇంట్లో మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తాం. తద్వారా ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ.15వేల భారం తగ్గుతుంది. అది కూడా తక్షణం అమలు చేయడం ప్రారంభిస్తున్నాం. పవర్‌లూమ్ మగ్గాలు ఉన్నవారికి నెలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తాం. అందుకోసం ఏటా రూ.190 కోట్లు ఖర్చవుతుంది. త్రిఫ్ట్ ఫండ్‌ను పునరుద్ధరించి 5,386 మందికి

మిగతా 13వ పేజీలో...

## సంపాదనతో కాదు.. సాయంతోనే తృప్తి!

- పీ4లో కో-స్పాన్సర్ విధానం: చంద్రబాబు
- బెజవాడలో పారిశ్రామికవేత్తలతో సమావేశం
- డబ్బు సాయం చేసేవారు చేస్తారు..
- చదువు చెప్పడానికి ముందుకు రావడమూ మేలే
- చిన్నసాయమే అయినా పేదలకు పెద్ద ఆలంబన
- మాటలు కాదు.. చేతల్లో చూపిస్తున్నా
- నేనూ 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా

నాడు పెట్టుబడులడిగా

నేడు పేదలకు చేయూత కోరుతున్నా: సీఎం

కుటుంబాల దత్తతకు ముందుకొచ్చిన పారిశ్రామికవేత్తలు

13


ఆఫీసులో లంచం సొమ్ముతో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన 'గిరిజన' ఈఎన్‌సీ శ్రీనివాస్

## ఏసీబీ చరిత్రలోనే అవినీతి రికార్డు

- ఆఫీసులోనే 25 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన 'గిరిజన' ఈఎన్‌సీ శ్రీనివాస్
- ఇంత భారీ సొమ్ముతో దొరకడం తొలిసారి
- బిల్లుల మంజూరుకు ఏకంగా 5 కోట్ల డిమాండ్.. ఇవ్వనందుకు కాంట్రాక్టరుకు 35 కోట్లు పెండింగ్
- గతంలోనూ రెండుసార్లు చిక్కిన వైనం
- రిటైర్మెంట్‌కు 3 వారాల ముందు మళ్లీ జైలుకు

అమరావతి/విజయవాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ రూ.4 లక్షలు, రూ.6 లక్షలు లంచాలు డిమాండ్ చేసి స్వల్ప మొత్తంలో నగదు తీసుకుంటున్న వారిని ఏసీబీ పట్టుకుంది. తాజాగా ఏకంగా 5 కోట్ల రూపాయల లంచాన్ని డిమాండ్ చేసి రూ.25 లక్షలు టోకెన్ నగదు తీసుకుంటున్న అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గిరిజన

మిగతా 13వ పేజీలో...

## రోస్టర్ అధికారం హైకోర్టు సీజేదే



- ఒక జడ్జికి క్రిమినల్ కేసులు కేటాయించొద్దని ఆదేశించడం
- ఆ అధికారాల్లో జోక్యం చేసుకోవడమే: సుప్రీం సీనియర్ జడ్జిలు
- జస్టిస్ పార్డీవాలా, జస్టిస్ మహదేవన్ బెంచ్ తీర్పుపై అసంతృప్తి
- అలహాబాద్ హైకోర్టు జడ్జిపై సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యల కేసు
- సర్వోన్నత న్యాయస్థానంలో నేడు మళ్లీ విచారణకు
- సుప్రీం ఆదేశాలు అమలుచేయకుండా ఉండేందుకు ఫుల్‌కోర్టును సమావేశపరచండి: అలహాబాద్ సీజేకు 13 మంది జడ్జిల లేఖ

అలహాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 7: సివిల్ కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను.. సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది. సర్వోన్నత న్యాయస్థానంలో శుక్రవారం విచారణకు వచ్చే కేసుల జాబితాలో ఈ కేసు కూడా ఉంది. గతంలో ఈ వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనమే దీన్ని విచారించనుంది. ఆగస్టు 4న ఈ కేసు విచారణ సందర్భంగా.. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. "హైకోర్టుల్లో ఏం జరుగుతోంది.. ఇది సుప్రీం

మిగతా 2వ పేజీలో...

### విచారణే లేకుండా శిక్ష!

- ఏళ్లుగా జైల్లో ఉంచుతున్న ఈడీ
- బీపీసీఎల్ కేసులో సీజేఐ వ్యాఖ్య
- ఈడీ బాగా పనిచేస్తోంది: ఎస్జీ



### జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు

పిటిషన్ కొట్టేసిన సుప్రీం



### 20 వేల డాలర్లకు గ్రీన్‌కార్డు!

- పదేళ్లకుపైగా నిరీక్షిస్తున్నవారికి అవకాశం
- ఫీజు చెల్లిస్తే ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కారం
- అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు

2

### మైనింగ్ కేసుల్లో ఓటీఎస్

- పెండింగ్‌లో ఉన్న రివిజన్, అప్పీల్ కేసుల పరిష్కారానికి ఏడాది పాటు అమలు
- వాటి విలువ 1,800 కోట్లు
- వెంటనే చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులు

3

### ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి పంపాల్సిందే

- ఆదేశాలను అమలు చేయకపోతే డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశిస్తాం
- ఉత్తర్వులు అమలవ్వకపోవడంపై క్యాట్ ఆగ్రహం

2




## ఇంకెన్నాళ్లు పోరాడాలి?

### నేరస్థులంతా బయటే ఉన్నారు.. ఇది న్యాయమా?



- వివేకా కుమార్తె సునీతారెడ్డి ఆవేదన.. భర్తతో కలిసి కడప ఎస్పీతో భేటీ
- ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నాం.. ఇలాంటి అన్యాయం ఎవరికీ జరక్కూడదనే!
- పులివెందులలో ప్రస్తుత ఘటనలు నాన్న హత్యను గుర్తుకు తెస్తున్నాయి
- గొడ్డలితో నరికిన బాడీ అక్కడుంటే గుండెపోటన్నారు.. నారాసుర చరిత్ర అని రాశారు.. ఆ ముగ్గురూ హత్య చేయించారని లెటర్‌పై సంతకం పెట్టమన్నారు
- కానీ నేను పెట్టలేదు!.. ఇప్పుడు మేమే చంపామని ప్రచారం దారుణం: సునీత

12

## కిడ్నీలు అమ్మేసి.. శవాన్ని పార్సిల్ చేస్తాం


ఫైబర్ లాఠీతో పవన్‌కుమార్‌ను కొడుతున్న దినేశ్

- దళితుడిపై భూమన అనుచరుల పాశవిక దాడి
- గదిలో బంధించి.. ఫైబర్ లాఠీతో చిత్రహింసలు
- వీడియో రికార్డు చేసి తల్లిదండ్రుల ఫోన్‌కు
- 5 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపు
- బైక్ తీసుకుని అద్దె చెల్లించ లేదని దారుణం
- తిరుపతిలో రెచ్చిపోయిన వైసీపీ మూకలు
- భూమన ఇంట్లో దాక్కున్న నిందితులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

14

## పకడ్బందీగా ఓట్ల చోరీ!

### ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై భారీగా అక్రమాలకు పాల్పడ్డాయి

- ఐదు రకాల అవకతవకలతో మోసం
- ఒక్క సెగ్మెంట్‌ను పరిశీలిస్తేనే.. 1,00,250 తప్పుడు ఓట్లు తేలాయి
- ప్రజాస్వామ్యంపై ఇదో అణు బాంబు
- డిజిటల్ ఓటర్ల జాబితాలు ఇస్తే.. దేశవ్యాప్త అక్రమాలు బయటికొస్తాయ్

2




- న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలి: రాహుల్ గాంధీ
- బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ లెక్కలతో పీపీటీ

## ..ఇంకా ఉంది!

### సుంకాలు అమల్లోకి వచ్చి కొన్ని గంటలే అయింది

- చైనా సహా మరిన్ని దేశాలపైనా 'రష్యా చమురు' టారిఫ్‌లు
- భారత్‌పై సుంకాలు పెంచాం.. రష్యాతో చర్చల్లో పురోగతి వచ్చింది
- ట్రంప్ వ్యాఖ్యలు.. వచ్చే వారం ట్రంప్-పుతిన్ భేటీ?.. ఈ ఏడాది చివర్లో భారత్‌కు పుతిన్.. మా రైతుల ప్రయోజనాలపై రాజీ లేదు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందం అంశంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

2



ట్రంప్ సుంకాలతో రూ.12,000 కోట్ల నష్టం

తిరుప్పూర్ వస్త్ర ఎగుమతిదార్ల సంఘం



## యూరియా ఎక్కడ?

12

- జూలైలో 28,696 టన్నుల లోటు.. ఆగస్టులో 2 లక్షల టన్నులు కోరగా కేంద్రం ఇచ్చింది 1.65 లక్షల టన్నులే.. తగ్గిన సరఫరా.. పెరిగిన వినియోగం
- పక్క రాష్ట్రాలకూ తరలిపోతున్నట్టు అంచనా.. రేటు పెంచేసిన డీలర్లు

## విశాఖ భూ అక్రమాలపై విచారణ

- సీసీఎల్‌ఏను నివేదిక కోరిన రెవెన్యూ మంత్రి
- కలెక్టర్ నుంచి వాస్తవిక నివేదిక కోరిన రెవెన్యూ శాఖ
- స్పీకర్ రాసిన లేఖ నేపథ్యంలో చర్యలు.. తొలుత కూటమి నుంచే ఆరోపణలు
- విచారణ కోరుతూ తాజాగా బొత్స ఎంట్రీ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ



12

## మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ రెడీ


మహిళలకు బస్సుల్లో ఉచిత టికెట్ ఎలా ఇస్తారో వివరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ. చిత్రంలో ఎండీ ద్వారకా తిరుమలరావు, విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర, ఇతర ఉన్నతాధికారులు

- అదనపు బస్సులు, సిబ్బందిని సమకూర్చుకున్నాం
- కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణ వెల్లడి
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు
- పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో అవకాశం
- త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు: ఎండీ

13

## పుస్తకంలో పరీక్షలు!

- విడిగా పేపర్లపై రాసే విధానానికి స్వస్తి
- 11న ఎఫ్ఏ-1 నుంచి వినూత్న విధానం అమలు
- ఒకే బుక్‌లెట్‌లో అన్ని పరీక్షలకూ సమాధానాలు
- సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వేర్వేరుగా..
- ఓఎంఆర్, గ్రాఫ్, మ్యాప్‌లూ ఆ బుక్‌లెట్లలోనే

12

## జుట్టు మొలిపిస్తామని.. ముంచేశారు!

- కాకినాడలోని ఓ సంస్థ మోసంపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- రూ.90 వేలు కట్టించుకోవడంతో పాటు టెస్టులతో తొమ్మిది నెలలుగా తాత్సారం
- ఉన్న జుట్టు కూడా కట్ చేయించిన వైనం

14

# 20 వేల డాలర్లకు గ్రీన్‌కార్డు..!

**అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అమెరికాలో శాశ్వత నివాసానికి జారీ చేసే గ్రీన్ కార్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణకు చెక్ పెట్టేందుకు ఓ ప్రతిపాదన ముందుకువచ్చింది. గ్రీన్‌కార్డు కోసం పదేళ్లకు పైగా ఎదురుచూస్తున్న వారు 20 వేల డాలర్లు (రూ.17.5 లక్షలు) చెల్లిస్తే వారి దరఖాస్తును త్వరగా పరిష్కరించేందుకు అవకాశాన్నిచ్చే బిల్లును యూఎస్ ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. 2035లోగా చట్టబద్ధమైన వీసా బ్యాక్‌లాగ్‌లు గణనీయంగా తగ్గించేందుకు డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరుతో సభ్యులు మారియా ఎల్విరా సలాజర్, వెరోనికా ఎస్కోబార్ ఆ బిల్లును ప్రతిపాదించారు. దశాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారానికి ఈ బిల్లును తెచ్చినట్లు సలాజర్ చెప్పారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం.. కుటుంబం లేదా ఉద్యోగాల విభాగాల్లో గ్రీన్‌కార్డు కోసం దశాబ్దానికి పైగా నిరీక్షిస్తున్న వారు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు కింద 20 వేల డాలర్లు చెల్లించే అవకాశం ఉంటుంది. ఫీజు చెల్లించిన వారికి ప్రామాణిక క్యూ కంటే ముందు వీసా పొందే అర్హత వస్తుంది. ఉద్యోగ ఆధారిత, ఫ్యామిలీ స్పాన్సర్డ్ గ్రీన్‌కార్డుల్లో ఒక్కో దేశానికి గరిష్ఠంగా ఉన్న 7% పరిమితిని 15 శాతానికి పెంచాలని బిల్లులో ప్రతిపాదించారు. అలాగే డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ శాశ్వత నివాసానికి ఓ మార్గాన్ని బిల్లు సూచించింది. వర్క్ వీసాపై అమెరికాకు వచ్చిన వారి పిల్లలు పదేళ్ల పాటు స్థిరంగా ఇక్కడే నివాసం ఉన్నట్లయితే వారికి చట్టబద్ధ శాశ్వత నివాస (ఎల్‌పీఆర్) హోదాను కల్పించనున్నారు. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ ఆధునికీకరణకు ఉన్న అవకాశాలను కాంగ్రెస్ పరిశీలిస్తున్నందున ఈ బిల్లు త్వరలోనే చర్చకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబరు 9న ఎన్నికలు నిర్వహిస్తామని.. అదేరోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రకటించింది. నామినేషన్లను గురువారం నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపింది. ఈనెల 21 వరకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అని, 22న వాటిని పరిశీలిస్తామని పేర్కొంది. ఈనెల 25 వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని వివరించింది. ఆరోగ్య కారణాలతో జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి జూలై 21న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాగా, గురువారం నిర్వహించిన ఎన్డీయే కూటమి సమావేశంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక బాధ్యతను ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డాలకు కట్టబెడుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈనెల 12న అభ్యర్థిని ప్రకటించే అవకాశముందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

## ఫ్రెంచ్ ఫ్రైస్‌తో మధుమేహం ముప్పు..!

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వారానికి మూడు సార్లు బంగాళాదుంపలతో చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 20% పెరుగుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఉడికించిన లేదా కాల్చిన బంగాళాదుంపలతో అంత ప్రమాదం ఉండదని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. హార్వర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీల పరిశోధకులు ప్రారంభంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ లేని దాదాపు 2 లక్షల మంది నుంచి 40 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈ క్రమంలో 40 ఏళ్ల తర్వాత వారిలో 22,300 మంది డయాబెటిస్ బారినపడినట్టు గుర్తించారు. వారానికి మూడుసార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తీసుకున్న వారిలో మధుమేహం ప్రమాదం 20% పెరిగిందని గుర్తించినట్టు వెల్లడించారు. అయితే కాల్చిన లేదా ఉడికించిన బంగాళాదుంపలు తీసుకున్న వారికి ఎలాంటి సమస్యా ఎదురు కాలేదని పేర్కొన్నారు.

## ఆదేశాలను అమలు చేయకపోతే.. డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశిస్తాం

**ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి పంపాలన్న.. ఉత్తర్వులు అమలవ్వకపోవడంపై క్యాట్ ఆగ్రహం**

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు ఐఏఎస్ శివశంకర్‌ను రెండు వారాల్లో ఆంధ్రప్రదేశ్‌కు పంపాలని, లేనిపక్షంలో డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశాలిస్తామని కేంద్రపరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) హెచ్చరించింది. శివశంకర్‌ను ఏపీకి పంపాలన్న తమ ఆదేశాలను అమలు చేయకపోవడంపై డీవోపీటీ(కేంద్రం)పై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లిపోవాలనే డీవోపీటీ ఆదేశాల నేపథ్యంలో శివశంకర్ తెలంగాణకు వచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ ఫిబ్రవరి 28న అనుమతించింది. ఆయనను తిరిగి ఏపీకే పంపాలని ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులు అమలు కాకపోవడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేశారు. మరోవైపు ఫిబ్రవరిలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్రం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో.. క్యాట్ ఎదుట గురువారం కోర్టు ధిక్కరణ కేసు మరోసారి విచారణకు వచ్చింది. తమ ఆదేశాల అమలుకు చివరి అవకాశంగా రెండు వారాల గడువిస్తున్నామని.. శివశంకర్‌ను ఏపీకి పంపకుంటే డీవోపీటీ సెక్రటరీ జీతం నిలుపుదలకు ఆదేశాలిలిచ్చి.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఇద్దరు విశాఖ వైద్యులు అరెస్టు

విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న 'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ కేసులో హైదరాబాద్ పోలీసులు విశాఖకు చెందిన ఇద్దరు వైద్యులను అరెస్టు చేశారు. డాక్టర్ నమ్రత స్నేహితులుగా ప్రచారంలో ఉన్న డాక్టర్ రవి, డాక్టర్ రమ్యలను అరెస్ట్ చేశారు. డాక్టర్ రవి కేజీహెచ్ అనస్థీషియా విభాగంలో పనిచేస్తున్నట్టు తెలిసింది. డాక్టర్ రమ్య కూడా కేజీహెచ్‌లో పనిచేస్తున్నారా?, లేక ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అడ్డగోలు వ్యవహారాల్లో వీరి పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మూడు రోజులుగా డాక్టర్ రవి సెలవులో ఉన్నారు. తాజా అరెస్టులు విశాఖ వైద్య వర్గాల్లో కలకలం రేపాయి.

## జస్టిస్ వర్మ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు

**ఆయన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తన నివాసంలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడిన కేసులో అంతర్గత దర్యాప్తు నిర్వహించిన కమిటీ.. ఆయన్ను దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ నివేదికను సవాలు చేస్తూ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఆయన ప్రవర్తన నమ్మశక్యంగా లేదని, పిటిషన్‌ను విచారించలేమని తెలిపింది. ఈ కేసు దర్యాప్తులో చట్టప్రకారమే వ్యవహరించారని పేర్కొంది. భారీ మొత్తంలో నగదు బయటపడడంతో వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించాలని దర్యాప్తు నివేదికలో సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ వర్మ పక్షాన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫారసు చేశారు. తాజాగా వర్మ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం.. జస్టిస్ వర్మ పిటిషన్‌ను సమర్థించలేమని తేల్చిచెప్పింది. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది.

# పకడ్బందీగా ఓట్ల చోరీ!

బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం. అక్కడ గట్టి పట్టున్న కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనా ఉంది. కానీ 32,707 ఓట్ల మెజారిటీతో బీజేపీ గెలిచింది. ఈ లోక్‌సభ స్థానంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకుగాను ఆరింటిలో లీడ్‌లో నిలిచిన కాంగ్రెస్‌కు సుమారు 82 వేల మెజారిటీ వచ్చింది. మిగిలిన మహదేవపుర ఒక్క సెగ్మెంట్‌లో మాత్రం బీజేపీకి ఏకంగా 1,14,046 ఓట్ల మెజారిటీ వచ్చింది.

ఈ సెగ్మెంట్‌లోని ఓ సింగిల్ బెడ్రూమ్ ఇంటి చిరునామాపై 80 మంది, కేవలం ఒకే గది ఉన్న మరో ఇంట్లో 46 మంది ఓటర్లు ఉన్నారు. ఇలాంటి 'బల్క్ ఓటర్లు'.. 10,452 మంది.

ఇక 0, -, %.. ఇలా ఎలాంటి గుర్తింపులేని ఇంటి చిరునామాలు ఉన్న ఓటర్లు 40,009 మంది.. రెండు, మూడు, నాలుగు ఓట్లున్న 'డూప్లికేట్' ఓటర్లు 11,965 మంది.. ఫొటో గుర్తించేలా లేని ఓటర్లు 4,132 మంది.

... దేశంలో ఎన్నికల అక్రమాలకు, ఎన్నికల కమిషన్-బీజేపీ కుమ్మక్కుకు సాక్ష్యమిదిగో అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పిన లెక్కలివి.

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అవకతవకలపై అణుబాంబు ప్రయోగిస్తానని ఇటీవల ప్రకటించిన రాహుల్ గాంధీ.. దీనికి సంబంధించి గురువారం ఢిల్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్(పీపీటీ) ఇచ్చారు. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఒక్కచోట పరిశీలిస్తేనే ఇన్ని అక్రమాలు బయటపడ్డాయని చెప్పారు. దేశవ్యాప్తంగా చాలా చోట్ల ఇలా 'ఓట్ల చోరీ'కి పాల్పడి.. లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నారని ఆరోపించారు. ఇవన్నీ బయటపడతాయనే తాము ఎన్నిసార్లు అడిగినా ఎన్నికల సంఘం డిజిటల్ ఓటర్ల జాబితాలను, సీసీ కెమెరా ఫుటేజీలను ఇవ్వడం లేదని.. పైగా ఆ ఆధారాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. డిజిటల్ ఓటర్ల జాబితాలను ఇస్తే దేశవ్యాప్తంగా జరిగిన ఓట్ల చోరీ బహిర్గతం అవుతుందన్నారు.

### పక్కా అనుకున్న చోట్ల ఓటమితో సందేహం

2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలో 16 లోక్‌సభ సీట్లు గెలుస్తామని తమ అంతర్గత సర్వేలో తేలిందని, కానీ 9 సీట్లే వచ్చాయని రాహుల్ చెప్పారు. తాము పక్కాగా గెలుస్తామనుకున్న స్థానాల్లో ఓటమితో సందేహం వచ్చి బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలో పరిశీలన జరిపామన్నారు. "బెంగళూరు సెంట్రల్‌లో బీజేపీ 32,707 ఓట్ల ఆధిక్యతతో గెలిచింది. కానీ ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క మహదేవపురలో తప్ప మిగతా ఆరింటిలో కాంగ్రెస్‌కే ఆధిక్యం వచ్చింది. 82వేలకుపైగా మెజారిటీ కాంగ్రెస్‌కే ఉంది. ఒక్క మహదేవపురలో మాత్రం బీజేపీకి ఏకంగా 1,14,046 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. దీనిపై సందేహంతో లోతుగా పరిశీలన జరిపాం. అక్కడి 6.5 లక్షల ఓట్లలో 1,00,250 తప్పుడు ఓట్లు ఉన్నట్టు గుర్తించాం. ఇందులో 11,965 డూప్లికేట్ ఓట్లు, 40,009 నకిలీ, గుర్తించలేని చిరునామాల్లో ఉన్న ఓట్లు, ఒకే ఇంటి నంబర్‌తో పదుల కొద్దీ ఓటర్లుగా నమోదైన 10,452 ఓట్లు, చెల్లని ఫోటోలతో 4,132 ఓట్లు, ఫారమ్-6 (మొదటిసారి ఓటరుగా నమోదు)ను దుర్వినియోగపర్చి నమోదైనవి 33,692 ఓట్లు ఉన్నాయి" అని రాహుల్ చెప్పారు.

### ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే కుట్ర

దేశంలో ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే ప్రక్రియలో ఎన్నికల కమిషన్ భాగమైందని రాహుల్ ఆరోపించారు. ఒక్క అసెంబ్లీ స్థానంలోనే ఇన్ని అక్రమాలు జరిగితే.. దేశమంతటా ఎంతగా అవకతవకలు చోటు చేసుకున్నాయో తెలిసిపోతోందని పేర్కొన్నారు. ఈ అక్రమాలకు ఓటర్ల జాబితాలు, సీసీ కెమెరా ఫుటేజీలే పక్కా సాక్ష్యాలని చెప్పారు. కానీ ఎన్నికల సంఘం ఈ ఆధారాలను ధ్వంసం చేయడంలో నిమగ్నమైందని ఆరోపించారు. సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టకుండా కావాలనే నిబంధనలను కూడా మార్చారని విమర్శించారు. "ఎన్నికల సంఘం, కేంద్రంలో అధికారంలో ఉన్నపార్టీ కలసి చేసిన ఈ నేరపూరిత మోసం దేశ ప్రజలకు తెలియాలి. ఇది మన రాజ్యాంగానికి, జాతీయ జెండాకు వ్యతిరేకంగా జరిగిన నేరపూరిత కుట్ర. స్వాతంత్ర్యం అనంతరం పడిన ప్రజాస్వామ్య పునాదిని వారు ధ్వంసం చేశారు" అని రాహుల్ మండిపడ్డారు. ఈ వ్యవహారంలో న్యాయ వ్యవస్థ కల్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతా పక్కాప్రణాళిక ప్రకారం ఓట్ల చోరీ జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. "సాధారణంగా పాలక పక్షాలపై ప్రజా వ్యతిరేకత ఉంటుంది. మీడియాలో అది కనిపిస్తుంది. కానీ బీజేపీ విషయంలో అలా జరగదు. ప్రజావ్యతిరేకతే లేనట్టుగా మెజారిటీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తుంది. లాడ్లీ బెహనా, పుల్వామా ఘటన వంటివి చూపి బీజేపీ గెలిచిందంటూ ప్రచారం చేస్తారు. ఎన్నికలు నెలల తరబడి జరుగుతాయి. షెడ్యూల్ ను ఇష్టారాజ్యంగా నిర్ణయిస్తారు. భారీ ఓట్ల చోరీ జరుగుతుంది" అని ఆరోపించారు. హరియాణా, మహారాష్ట్రలో ఇలాగే ఫలితాలు తారుమారు అయ్యాయన్నారు. మహారాష్ట్రలో ఐదేళ్లలో నమోదైన ఓటర్ల కంటే ఎక్కువగా.. 5 నెలల్లో కోటి మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారని గుర్తు చేశారు.

### సంతకంతో సాక్ష్యాలు ఇవ్వండి: ఈసీ

ఓట్ల చోరీ ఆరోపణలపై సంతకంతో కూడిన డిక్లరేషన్, సాక్ష్యాలను తమకు అందజేయాలని కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాహుల్ గాంధీకి లేఖ రాశారు. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తాను బహిరంగంగానే వివరాలు వెల్లడించానని, దానిని తాను ప్రమాణం చేసి చెప్పినట్టుగానే తీసుకోవాలని రాహుల్ ప్రకటించారు.

### రాహుల్ ఇంటిలో ఇండి కూటమి విందు భేటీ

రాహుల్‌గాంధీ నివాసంలో గురువారం సాయంత్రం ఇండి కూటమి నేతలతో విందు భేటీ జరిగింది. 25 పార్టీలకు చెందిన సుమారు 50 మంది నేతలు ఇందులో పాల్గొన్నారు. బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష', ఎన్నికల సంఘంపై 'ఓట్ల చోరీ' ప్రజెంటేషన్‌పై చర్చించారు.

### రాహుల్‌ది మోసం: బీజేపీ

ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న పెద్ద కుట్రలో ఇది భాగం అని విమర్శించింది. రాహుల్‌ది పక్కా స్కెచ్ వేసి సాగిస్తున్న ప్రణాళికాబద్ధమైన, కుటిలమైన మోసమని ఆరోపించింది. బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మోదీజీపై విశ్వాసంతో ప్రజలు ఓట్లు వేస్తున్న విషయాన్ని గౌరవించలేకే.. రాహుల్ ఈ విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు.

### నేడు బెంగళూరులో నిరసన ప్రదర్శన

'ఓట్ల చోరీ'కి సంబంధించి శుక్రవారం బెంగళూరులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఇతర నేతలతో కలసి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని రాహుల్ తెలిపారు. 'ఓట్ అధికార్ ర్యాలీ' పేరిట ఈ సభను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సభ ముగిశాక స్థానిక ఎన్నికల కమిషన్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించనున్నారు.

### డిజిటల్ జాబితాలు ఎందుకు ఇవ్వట్లేదు?

కంప్యూటర్లలో సులువుగా విశ్లేషించేందుకు వీలుగా డిజిటల్ ఓటర్ల జాబితాలను ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరితే నిరాకరించిందని రాహుల్ తెలిపారు. అందులో మతలబు ఏమిటని నిలదీశారు. వేల కొద్దీ పేజీలతో కూడిన జాబితాలను ఈసీ ఇచ్చిందని.. దీనితో 30, 40 మంది ఆరు నెలల పాటు రాత్రింబవళ్లు కష్టపడి.. ఒక్కో ఓటర్ పేరు, చిరునామా, ఫొటోలను పరిశీలించారని చెప్పారు. అదే డిజిటల్ జాబితాలను ఇచ్చి ఉంటే నిమిషాల్లోనే పరిశీలన పూర్తయ్యేదన్నారు. భౌతికంగా పరిశీలిస్తేనే ఇన్ని అక్రమాలు బయటపడ్డాయని.. డిజిటల్ జాబితాలను ఇస్తే దేశవ్యాప్తంగా జరిగిన 'ఓట్ల చోరీ' అంతా బహిర్గతం అవుతుందని పేర్కొన్నారు. బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు కాకుంటే.. తాము అడిగి డేటా అంతా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## లోకం తీరు




## అబద్ధాల 'నిజలింగ'

**వెలుగులోకి నిజలింగస్వామీజీ మోసాలు**

**బసవదీక్ష స్వీకరించినా ఇస్లాంపై మమకారం**



బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట మఠాధిపతిగా వ్యవహరించిన నిజలింగస్వామి అలియాస్ మహమ్మద్ నిసార్ గురించి కలకలం రేపే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. గుండ్లుపేట తాలూకా చౌడహళ్లి గ్రామంలోని గురుమల్లేశ్వర విరక్తమఠం మఠాధిపతిగా నిజలింగస్వామీజీ వ్యవహరించారు. ఆయన ముస్లిం మతస్థుడని తెలియడంతో గ్రామస్థులు మఠం నుంచి బహిష్కరించారు. యాదగిరి జిల్లా శహపుర తాలూకాకు చెందిన ఆయన పూర్వనామం మహమ్మద్ నిసార్. బాల్యంలోనే సన్యాసం స్వీకరించారు. బసవణ్ణ వచనాలు, మానవతా బోధనలు చేసేశారు. 2020లో బసవదీక్ష స్వీకరించారు. బసవకల్యాణలో బసవ మహామని బసవ ప్రభుస్వామీజీ నుంచి లింగదీక్ష పొందారు. 2020 ఆగస్టు 15న బసవ లింగస్వామీజీగా మారారు. గుండ్లుపేట మఠం శాఖకు ఆయనను మఠాధిపతిగా నియమించారు. ఆయన ఎస్ఎస్ఎల్‌సీ మార్కుల జాబితా ఇటీవల వెలుగులోకి రాగా, అందులో మహమ్మద్ నిసార్ అని పేరు ఉండటం కలకలం రేపింది. అతడి మూలం ఇస్లాం మతం కావడంతో భక్తుల నుంచి వ్యతిరేకత వచ్చింది. భక్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో ఆయన సోమవారం పీఠాన్ని వదిలి వెళ్లిపోయారు. కాగా, మఠాధిపతిగా ఉంటూనే ఆయన ముస్లింలు ధరించే టోపీలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు గ్రామస్థులు గుర్తించారు. స్వామీజీగా ఉంటూనే మద్యం సేవించేవారని, మాంసాహారాన్ని భుజించేవారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రైతు ప్రయోజనాలపై

## రాజీపడే ప్రసక్తే లేదు

**అమెరికాతో వాణిజ్య ఒప్పందం అంశంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: భారత రైతులు, మత్స్యకారులు, పాడి పరిశ్రమ ప్రయోజనాల అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అవసరమైతే వ్యక్తిగతంగా కూడా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా తమ దేశ వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలంటూ అమెరికా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై మోదీ స్పష్టతనిచ్చారు. దేశంలో వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. కరువు, తీవ్ర ఎండలు, వరదలను తట్టుకునే వంగడాలను రూపొందించాలని శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. కాగా, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా గురువారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, సాంకేతిక, రక్షణ భాగస్వామ్యంపై వారు చర్చించారని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. బ్రెజిల్‌పై వాణిజ్య సుంకాల నేపథ్యంలో తాను ట్రంప్‌తో మాట్లాడబోనని, అవసరమైతే మోదీతో మాట్లాడుతానని పేర్కొన్న మర్నాడే ఆయన మోదీకి ఫోన్ చేశారు.

# ..ఇంకా ఉంది!

**భారత్‌పై సుంకాలు పెంచాం..**

**రష్యాతో చర్చల్లో పురోగతి వచ్చింది: ట్రంప్**

వాషింగ్టన్/మాస్కో/న్యూఢిల్లీ, ఆగస్టు 7: రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న తన మాట వినడం లేదంటూ భారత్‌పై ఒంటికాలిపై లేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ముున్ముందు ఇంకా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచామని.. ఇదే సమయంలో ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంలో రష్యాతో చర్చల్లో పురోగతి నెలకొందని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేయవద్దంటూ భారత్‌పై విధించిన ఆంక్షలు ప్రభావం చూపిస్తున్నట్టు పరోక్షంగా వ్యాఖ్యానించారు. రష్యా-ఉక్రెయిన్‌లతో సంధి ఒప్పందం కుదిరితే భారత్‌పై వేసిన అదనపు సుంకాలను తగ్గిస్తారా అని మీడియా ప్రశ్నించగా.. "దాని గురించి తర్వాత ఆలోచిస్తాం. ప్రస్తుతానికైతే భారత్ 50 శాతం సుంకాలు చెల్లిస్తోంది.." అని ట్రంప్ బదులిచ్చారు. రష్యా నుంచి చైనాతోపాటు ఇతర దేశాలు కూడా చమురు కొనుగోలు చేస్తున్న అంశాన్ని ప్రస్తావిస్తూ.. "టారిఫ్‌లు అమల్లోకి వచ్చి కొన్ని గంటలే అయింది. చైనా సహా మరికొన్ని దేశాలపైనా సుంకాలు విధించే అవకాశం ఉంది. ఇప్పటికైతే కచ్చితంగా చెప్పలేం.." అని పేర్కొన్నారు. కాగా, యాపిల్ కంపెనీ అమెరికాలో వచ్చే నాలుగేళ్లలో మరో వంద బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.7 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఇప్పటికే నిర్ణయించిన 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.43.5 లక్షల కోట్లు) పెట్టుబడులకు ఇది అదనం. యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో వైట్‌హౌజ్‌లో భేటీ అయిన తర్వాత ట్రంప్ స్వయంగా ఈ ప్రకటన చేశారు. అమెరికాకు దిగుమతి అయ్యే కంప్యూటర్ చిప్‌లు, సెమీకండక్టర్లపై 100% దిగుమతి సుంకం విధించనున్నట్టు తెలిపారు.

### ఇంటెల్ సీఈవో రాజీనామా చేయాలి..

ప్రఖ్యాత చిప్‌లు, సెమీకండక్టర్ల తయారీ సంస్థ ఇంటెల్ సీఈవో లిప్-బు టాన్ రాజీనామా చేయాలని ట్రంప్ డిమాండ్ చేశారు. చైనా కంపెనీలతో ఆయన సన్నిహిత సంబంధాలు నెరుపుతున్నారని, ఇది ఇంటెల్ సంస్థకు, అమెరికా జాతీయ భద్రతకు ప్రమాదకరమని ఇటీవలే అమెరికా సెనేటర్ కాటన్ ఆరోపించారు. సీఈవోను తొలగించాలంటూ ఇంటెల్ సంస్థకు లేఖ రాశారు.

### ప్రతీకార సుంకాలు విధించాలి: శశిథరూర్

భారత్‌పై ఏకపక్షంగా అమెరికా విధిస్తున్న సుంకాలకు బదులుగా భారత్ కూడా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించాలని సీనియర్ కాంగ్రెస్ నేత శశిథరూర్ పేర్కొన్నారు. గురువారం పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీరు ఎలా చేస్తే, మేమూ అలాగే బదులిస్తామని అమెరికాకు స్పష్టం చేయాలని, 50 శాతం ప్రతీకార సుంకాలను విధించాలని ఆయన అన్నారు.

### రష్యాలో అజిత్ దోవల్

రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒత్తిడి, అదనపు సుంకాల ప్రకటన నేపథ్యంలో.. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా పర్యటనకు వెళ్లారు. గురువారం మాస్కోలో రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగుతో భేటీ అయ్యారు. ఇంధనం, రక్షణ బంధాలపై చర్చించారు. భారత్‌లో పుతిన్ పర్యటించనున్న నేపథ్యంలో.. ప్రధాని మోదీ, పుతిన్ చర్చలు జరపబోయే అంశాలు, తేదీలు, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది చివరిలో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. ఇంకోవైపు.. ఉక్రెయిన్‌తో యుద్ధం నిలిపివేత, రష్యాపై ఆంక్షల తొలగింపు అంశాలపై ట్రంప్, పుతిన్ భేటీ కానున్నారు. మాస్కోలో పుతిన్‌తో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ చర్చల సందర్భంగా దీనిపై అంగీకారం కుదిరింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఈ భేటీలో పాల్గొనే అవకాశం ఉన్నట్టు తెలిసింది. వచ్చే వారంలోనే యూఏఈలో భేటీ జరగవచ్చని పుతిన్ గురువారం పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ఉక్రెయిన్, రష్యా యుద్ధం ఓ కొలిక్కిరావొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పుతిన్‌తో భేటీ అయిన అజిత్ దోవల్

### ట్రంప్ సుంకాలతో రూ.12 వేల కోట్ల నష్టం

**తిరుప్పూర్ వస్త్ర ఎగుమతిదారుల సంఘం**

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాదిన సుంకాల మోత కారణంగా వస్త్ర ఎగుమతుల నిలిచిపోయి, తక్షణం రూ.12వేల కోట్ల మేరకు నష్టం వాటిల్లే అవకాశముందని తమిళనాడులోని తిరుప్పూరు వస్త్ర ఎగుమతి దారుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణియన్ పేర్కొన్నారు. గురువారం ఆయన తిరుప్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు అసమంజసంగా ఉన్నాయని, పెంపు ద్వారా వినియోగదారులే తీవ్రంగా నష్టపోతారన్నారు. తిరుప్పూరులో రూ.100కు లభించే దుస్తుల ధర రూ.150కు పెరుగుతుందని ఉదహరించారు. అమెరికా సుంకాల కారణంగా తిరుప్పూరు దుస్తుల ఎగుమతి కేంద్రాల్లో పనిచేస్తున్నవారి ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బ్రిటన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఆ దేశానికే దుస్తులను అధికంగా ఎగుమతి చేస్తామని వివరించారు.

# రోస్టర్ అధికారం హైకోర్టు సీజేదే

(మొదటిపేజీ తరువాయి)

జడ్జిలుగా మేం చూసిన అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటి" అంటూ సుప్రీంకోర్టు తన తీర్పులో మండిపడింది. అంతేకాదు.. ఆ జడ్జికి (జస్టిస్ ప్రశాంత్‌కుమార్) రిటైరయ్యే దాకా క్రిమినల్ కేసుల విచారణ అప్పగించొద్దని, ఆయన్ను వేరే సీనియర్ జడ్జి ఉన్న ధర్మాసనంలో కూర్చోబెట్టాలని.. అలహాబాద్ హైకోర్టు సీజేకు సూచించింది. అయితే ఆ తీర్పుపై సుప్రీంకోర్టులోని ఇతర సీనియర్ న్యాయమూర్తులు అసంతృప్తి వ్యక్తం చేశారని, దీనిపై సుప్రీం సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా సుప్రీం సీనియర్ జడ్జిలతో సంప్రదించారని సమాచారం. ఒక జడ్జి రిటైరయ్యే దాకా క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆదేశించడం.. హైకోర్టు సీజేకున్న రోస్టర్ అధికారాల్లో జోక్యం చేసుకోవడమేనని వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ కేసును మళ్లీ విచారించనున్నట్టు తెలిసింది.

### ఫుల్‌కోర్టును సమావేశపరచండి..

మునుపెన్నడూ లేని విధంగా.. సుప్రీం తీర్పులో కొన్ని ఆదేశాలను అమలు చేయకూడదంటూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు ఆ హైకోర్టు సీజేకు ఒక లేఖ రాశారు. జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌కు క్రిమినల్ కేసులు అప్పగించొద్దని సుప్రీం ఇచ్చిన తీర్పుపై చర్చించేందుకు ఫుల్‌కోర్టును సమావేశపరచాల్సిందిగా ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. "సుప్రీంకోర్టుకు హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం లేదు. కాబట్టి.. సర్వోన్నత న్యాయస్థానం ఆగస్టు 4న ఇచ్చిన తీర్పులోని 24, 25, 26 పారాల్లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకూడదని మా ఫుల్‌కోర్టు తీర్మానం చేసింది. ఆ ఆదేశాలపైన, తీర్పులో వాడిన భాష, మాటల ధోరణిపై ఫుల్‌కోర్టు విచారం వ్యక్తం చేసింది" అనే తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో కోరారు. ఈ కేసు విషయంలో జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు ఎలాంటి నోటీసులూ జారీచేయకుండా, వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా.. సుప్రీంకోర్టు ఆయనపై తీవ్ర వ్యాఖ్యలు చేసిందని పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు.. అమర్‌పాల్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ, 2012 కేసులో సుప్రీంకోర్టు ప్రతిపాదించిన సూత్రాలనే ఉల్లంఘించే విధంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. జస్టిస్ ప్రశాంత్ కుమార్ తీర్పు.. ఎలాంటి ముందస్తు ఉదాహరణా లేకుండా ఇచ్చింది, విపరీతమైనది కాదని.. సుప్రీంకోర్టు గతంలో లీకున్‌హీ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ, సయ్యద్ అస్కారీ హదీ అలీ ఆగస్టీన్ ఇమామ్ వర్సెస్ స్టేట్ (ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్) కేసుల్లో ఇచ్చిన తీర్పుల ఆధారంగా ఇచ్చిందని గుర్తుచేశారు. కాబట్టి ఆయనపై అంత తీవ్ర వ్యాఖ్యలు చేసి ఉండాల్సింది కాదన్నారు. అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ అరిందమ్ సిన్హా పేరిట రాసిన ఈ లేఖలో మరో 12 మంది జడ్జిలులు సంతకం చేశారు.

# విచారణే లేకుండా శిక్ష!

**ఏళ్ల తరబడి జైల్లో ఉంచుతున్న ఈడీ**

**బీపీసీఎల్ కేసులో సీజేఐ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో శిక్షపడిన సందర్భాలు అతి తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిందితులకు శిక్ష పడేలా చేయలేకపోయినా వాళ్లను ఏళ్ల తరబడి విచారణ లేకుండా జైళ్లలో ఉంచడం ద్వారా శిక్షించడంలో ఈడీ విజయం సాధించిందని వ్యాఖ్యానించింది. ఈడీ చేపట్టిన కేసుల్లో నేర నిరూపణ జరిగిన వాటి శాతం ఎంతని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ప్రశ్నించింది. భూషన్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్ఎల్) కంపెనీని జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు అప్పగించే ప్రతిపాదనను ఇటీవల సుప్రీంకోర్టు నిలువరించింది. దివాలా చట్టంలోని పలు నిబంధనలకు విరుద్ధంగా ఈ అప్పగింత ప్రయత్నం ఉందని వ్యాఖ్యానించింది. ఈ తీర్పుపై పునస్సమీక్షించాలని అప్పులు ఇచ్చిన బ్యాంకులు, బీపీఎస్ఎల్‌ను కొనాలనుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ సుప్రీంకోర్టును కోరాయి. గురువారం విచారణ సందర్భంగా బీపీఎస్ఎల్ కుంభకోణం విచారణ కొలిక్కిరాని విషయం ప్రస్తావనకు వచ్చింది. ఇన్నేళ్లయినా ఈడీ కుంభకోణం విచారణను కొలిక్కి తీసుకు రాలేక పోయిందని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. బ్యాంకుల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, ఈడీ చాలా బాగా పనిచేస్తోందన్నారు. ఈడీ ఇప్పటిదాకా వివిధ కుంభకోణాలకు సంబంధించి నిందితుల నుంచి రూ.23,000 కోట్లు వసూలు చేసి బాధితులకు అప్పగించిందని తెలిపారు. తమకు ప్రచారం చేసుకునే అవకాశం లేకుండాపోయిందన్నారు. ఈ సందర్భంగా, సీజేఐ స్పందిస్తూ, ఈడీ కేసుల్లో శిక్షలు పడటమే చాలా తక్కువగా ఉందని, విచారణ లేకుండా జైళ్లలో ఉంచడం ద్వారా ఈడీ నిందితులకు శిక్షలు విధిస్తోందని వ్యాఖ్యానించారు.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి విరాళం చెక్ అందజేస్తున్న దాత చిరాగ్ పురుషోత్తం

## టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళం అందింది. నీకే పీసీ ప్రాపర్టీస్ ఎండీ చిరాగ్ పురుషోత్తం, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి అందజేశారు.

### ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుమలలో గురువారం పవిత్ర పూర్ణాహుతితో మూడురోజుల పవిత్రోత్సవాలు ముగిశాయి. గురువారం ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విశేష సమర్పణ, 4 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగాయి. రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

### శ్రీవాణి టికెట్లకు ముందే టోకెన్లు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి టికెట్ల జారీలో నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టోకెన్ విధానాన్ని టీటీడీ ప్రారంభించింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటలకు టికెట్లు కేటాయించేదాకా క్యూలైన్‌లో ఉండే అవసరం లేకుండా వచ్చినవారికి వచ్చినట్టుగా అన్నమయ్య భవనం ఎదురుగా ఉండే శ్రీవాణి కౌంటర్ వద్ద టోకెన్లు ఇస్తున్నారు. ఈ సమయంలోనే భక్తుల ఆధార్ జిరాక్స్‌పై సంతకం చేసి స్టాంప్ వేస్తారు. టోకెన్లు పొందినవారు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30లోగా ఎప్పుడైనా కౌంటర్ వద్దకు వచ్చి టికెట్ కొనుగోలు చేయచ్చు. సాయంత్రం 4.30కి వీరిని దర్శనానికి అనుమతిస్తారు. ఇందువల్ల క్యూలో వేచి వుండే అవసరం లేకుండా పోయింది.



# వెల్డింగ్ షాప్‌లో భారీ విస్ఫోటం

## విశాఖలో ముగ్గురి దుర్మరణం

- తునాతునకలైన మరో రెండు దుకాణాలు
- ముగ్గురికి తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- సముద్రంలో దొరికిన వస్తువు కట్ చేస్తుండగా పేలుడు జరిగినట్లు అనుమానాలు



మృతులు గణేష్‌కుమార్, ముత్యాలు



పేలుడు ధాటికి తునాతునకలైన వెల్డింగ్ దుకాణం

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ దుకాణంలో గురువారం సాయంత్రం భారీపేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. దుకాణంలో పనిచేస్తున్న మరో ఇద్దరితోపాటు పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని తీవ్రంగా గాయపడ్డారు. హార్బర్ సమీపంలోని బుక్కా వీధిలో బీచ్‌రోడ్డును ఆనుకుని హిమాలయా బార్ పక్కన చల్లా గణేష్‌కుమార్ (40) వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి వచ్చే బోట్ల విడిభాగాలు దెబ్బతింటే వాటిని వెల్డింగ్ చేసి మరమ్మతులు చేస్తుంటారు. ఆ దుకాణంలో గణేష్‌తో పాటు ఒడిశాకు చెందిన శ్రీను, మధురవాడకు చెందిన కె.ఎల్లాజీ, బుక్కావీధికి చెందిన చింతకాయల ముత్యాలు (27), వన్‌టౌన్‌కు చెందిన డి.సన్యాసిరావుతో పాటు మరో ముగ్గురు పనిచేస్తున్నారు. సరిగ్గా సాయంత్రం 4.30 గంటల సమయంలో దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ ధాటికి చెక్క, రేకులతో కూడిన వెల్డింగ్ షాప్ తునాతునకలైపోగా, పక్కనున్న అలాంటివే మరో రెండు దుకాణాలు సైతం దెబ్బతిని చెల్లాచెదురైపోయాయి. షాప్ యజమాని గణేష్‌కుమార్, శ్రీను శరీరాలు పూర్తిగా కాలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ముత్యాలు కాలు విరిగిపోయి వేరొకచోట పడింది. ముఖం, ఛాతీ, చేతులు కాలిపోయాయి. ఎల్లాజీకి 95 శాతం శరీరం కాలిపోగా, సన్యాసిరావు పొట్ట, శరీరంలోకి ఇనుపముక్కలు దూసుకుపోయాయి. పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని చెంగలరావుపేట, తెలకల వీధికి చెందిన ఇప్పిలి రంగారావుకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. ముత్యాలుకు చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచారు. క్షతగాత్రులకు నిపుణులైన వైద్య బృందాలతో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. ఘటనా స్థలాన్ని సీపీ శంఖబ్రతబాగ్చి, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్ పరిశీలించి, ప్రమాదానికి కారణాలను ఆరా తీశారు. తర్వాత కేజీహెచ్‌కు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### గ్యాస్ సిలిండర్ కాదా?!

మరోవైపు, ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడు కారణం కాదని, సముద్రంలో మత్స్యకారులకు దొరికిన ఏదో వస్తువును కట్ చేస్తుండగా పేలుడు సంభవించిందని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. పేలుడు జరిగినప్పుడు భారీ శబ్దం వినిపించిందని, గ్యాస్ సిలిండర్ పేలితే అంతపెద్ద శబ్దం రాదని చెబుతున్నారు. కేజీహెచ్ పరిసరాల వరకు పేలుడు శబ్దం వినిపించిందని ఏదో పిడుగు పడిందని భావించామని కొందరు స్థానికులు చెప్పారు.



కేంద్ర మంత్రి కుమార స్వామికి వినతిపత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ ఎంపీలు

## ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు అనుమతులు మంజూరు చేయండి

- కేంద్ర ఉక్కు మంత్రికి టీడీపీ ఎంపీల వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఆర్సెలార్-మిట్టల్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ ఎంపీలు కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎన్ఎండీసీ నుంచి ఇనుప ఖనిజం కేటాయింపు, స్లర్రీ పైప్‌లైన్‌కు సంబంధించిన అనుమతులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్లాంట్ పారిశ్రామికాభివృద్ధితో పాటు భారీఎత్తున ఉపాధి కల్పిస్తుందని, విశాఖ-చెన్నై కారిడార్‌కు ప్రధాన కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం

- ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఏలూరులో గురువారం జరిగిన రెవెన్యూ ఉద్యోగుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశామని, ఈలోగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయలేదని, మూడేళ్లుగా కమిటీలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గత వైసీపీ హయాంలో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, టీడీపీ కూటమి ప్రభుత్వం వస్తే సమస్యలు తీరుతాయని ఆశిస్తే...నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఒక్కసారైనా సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. విజయవాడలో అన్ని జిల్లాల సంఘాల నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## రెండ్రోజుల్లో బంగారు కుటుంబాల అవసరాల సర్వే పూర్తవ్వాలి

- దత్తత కోసం ఎవర్నీ బలవంతం చేయొద్దు
- కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ ఆదేశం

అమరావతి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి దత్తత తీసుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఈ విషయంలో ఎవర్నీ బలవంతం చేయొద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. బంగారు కుటుంబాల అవసరాలకు సంబంధించిన నీడ్ అసెస్మెంట్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్ర పీ4, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, ముఖ్యమైన ప్రాజెక్టులకు భూసేకరణ, జిల్లా స్థాయిలో లాజిస్టిక్ ప్రణాళికలు, పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, తదితర అంశాలపై కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునే లక్ష్యంలో ఇప్పటికి 10.10 లక్షల కుటుంబాలను లక్షా 12 వేల మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని చెప్పారు. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టులకు ప్రాధాన్యత క్రమంలో భూమిని గుర్తించాలని ఆదేశించారు. 2027-28 నాటికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు చొప్పున 175 పార్కుల ఏర్పాటుకు భూసంబంధ విషయాలు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళికలపై పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇప్పటికే 98 చోట్ల భూములను గుర్తించగా, 54 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగినట్లు ఆయన వివరించారు.

### జిల్లా కేంద్రాల్లో టెక్నాలజీ సర్వీసెస్ ఆఫీసులు

- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ

తిరుమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయాలను ఏర్పాటు చేయబోతున్నట్టు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. వీటి ద్వారా ఐటీ స్టార్టప్స్‌తో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అలాగే దేశంలోనే తొలిసారిగా ఏపీలో 2026 జనవరి 1 నుంచి క్వాంటమ్ వ్యాలీ ప్రారంభం కాబోతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన స్వల్ప కాలంలోనే అనేక ఐటీ సంస్థలు రాష్ట్రానికి రావడంతో ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు.

### మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు: డీజీపీ

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో గంజాయి, డ్రగ్స్, సిగరెట్లు, గుట్కా, కాఫ్ సిరప్‌లు విక్రయించరాదన్న టోఫెల్ మార్గదర్శకాలను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో గత నెల 8 నుంచి 12 వరకూ 26 జిల్లాల్లో చేపట్టిన దాడుల్లో.. 16,806 దుకాణాలను తనిఖీ చేశామని, 25,807 కేసులు నమోదు చేసి రూ.40.62 లక్షల మేర జరిమానా విధించినట్లు వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదు కాగా.. పశ్చిమ గోదావరి, కడప, అన్నమయ్య జిల్లాల్లో తక్కువ నమోదైనట్లు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం శుభ పరిణామమన్నారు. విద్యార్థులు ఎవ్వరూ మత్తు బారిన పడకుండా జిల్లాల ఎస్పీలతో ఈగల్ విభాగం సమన్వయం చేసుకుని చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని తెలియజేయాలని ప్రజలను డీజీపీ కోరారు.

## 'సెర్ప్'కు 25 ఏళ్లు...

- వేడుకలు నిర్వహించాలని మంత్రి సూచన

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. గురువారం సెర్ప్ కార్యాలయంలో ఆ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బ్యాంకులు ఆమోదించిన సూక్ష్మ రుణ ప్రణాళికకు సంబంధించి రూ.14369 కోట్లు మొత్తాన్ని త్వరితగతిన ఎస్‌హెచ్‌జీలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 1,71,264 స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ ప్రణాళిక ద్వారా నిధులు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, అందుకనుగుణంగా ఆయా రుణాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ప్రక్రియ చేపట్టాలని, అందుకున అనుభవం ఉన్న సంస్థల సేవలను ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

# మైనింగ్ కేసుల్లో ఓటీఎస్

## పెండింగ్‌లో ఉన్న రివిజన్, అప్పీల్ కేసుల పరిష్కారానికి ఏడాది పాటు అమలు

- వాటి విలువ రూ.1,800 కోట్లు
- వెంటనే చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గనుల శాఖలో సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న రివిజన్, అప్పీల్ కేసుల పరిష్కారానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్(ఓటీఎ్‌స)ను ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది కాలం పాటు ఈ స్కీమ్ అమల్లో ఉంటుందని, దీని అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు(జీఓ-131) జారీ చేశారు. గనుల శాఖ వద్ద ప్రస్తుతం రివిజన్, అప్పీల్, డిమాండ్ నోటీసు, షోకాజ్ నోటీసులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ కనీసం 1800 కోట్ల మేర ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే వాటిని పరిష్కరించుకునేందుకు గనుల లీజుదారులు ఆసక్తిచూపడం లేదు. పెనాల్టీలు, డిమాండ్ నోటీసులు చాలా ఎక్కువగా ఉండటంతో ముందుకు రావడంలేదని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇలాంటి కేసులను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలనుకుంటోంది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు, విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకే ఓటీఎస్‌ను అమలు చేయాలని గనుల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

### మార్గదర్శకాల్లోని కీలకాంశాలు

- రివిజన్, అప్పీల్ కేసు సెటిల్ అయితే ఓటీఎస్‌లో 25 శాతం ఫీజు చెల్లించాలి. ఆ తర్వాత లీజుపై ఉన్న నిషేధం ఎత్తివేస్తారు. లీజుదారు మైనింగ్ చేసుకోవడానికి అనుమతి ఇస్తారు. మిగతా 75 శాతం ఫీజును 10 నెలల్లో వాయిదా పద్ధతిలో చెల్లించాలి.
- 10 రెట్ల పెనాల్టీ విధించిన కేసుల్లో సాధారణ సీనరేజీతో పాటు ఓటీఎస్‌ను చెల్లించాలి. ఇలాంటి కేసుల్లో ఓటీఎస్‌ను నిర్దిష్టంగా నిర్దేశించారు. సాధారణ సీనరేజీ ఫీజు, కన్సిడరేషన్ ఫీజు, డీఎమ్ఎఫ్, మెరిట్‌తో పాటు రెండు రెట్ల సీనరేజీని కలిపి చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల 10 రెట్ల పెనాల్టీ భారం తగ్గిపోతుంది. 5 రెట్ల పెనాల్టీ ఉన్న కేసుల్లో సాధారణ సీనరేజీ ఫీజు, కన్సిడరేషన్, డీఎమ్ఎఫ్, మెరిట్‌తో పాటు వన్‌టైమ్ సీనరేజీని చెల్లించేలా సెటిల్ చేయనున్నారు. ఖనిజంపైనే పెనాల్టీ విధించిన కేసుల్లో డిమాండ్ నోటీసులో పేర్కొన్న డబ్బులో 20 శాతంతో పాటు సాధారణ ఫీజులు చెల్లించేలా సెటిల్‌మెంట్ ఖరారు చేశారు.
- డిమాండ్ నోటీసు ఇచ్చే నాటికి ఉన్న సీనరేజీ ఫీజులే సెటిల్‌మెంట్‌కు వర్తిస్తాయి.
- ఓటీఎస్‌కు అంగీకరించాక వాయిదాలు చెల్లించడంలో లీజుదారు విఫలమైతే వడ్డీతో సహా వసూలు చేయనున్నారు.
- ఓటీఎస్ గడువు తీరిన తర్వాత కూడా పెండింగ్ కేసులు ఉంటే, నిబంధనల ప్రకారం లీజుదారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గనుల శాఖను ఆదేశించింది. ఓటీఎస్ ఏడాదికాలం పాటు అమలు కానుంది. గడువులోగా లీజుదారులు ఆన్‌లైన్‌లో ఓటీఎస్‌కు దరఖాస్తు చేసుకొని సెటిల్ చేసుకోవాల్సి ఉంటుంది.

## పరిహారంలో రైతులందరికీ న్యాయం చేయాలి

- రహదారికి భూములిచ్చే వారికి మార్కెట్ ధర ఇవ్వాలి
- జాతీయ రహదారుల సీజీఎంకు ఎమ్మెల్యే సోమిరెడ్డి విన్నపం



నేషనల్ హైవేస్ చీఫ్ జనరల్ మేనేజర్, రీజినల్ ఆఫీసర్ ఆర్కే సింగ్‌కు లేఖ ఇస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాగరమాలతో పాటు నెల్లూరు జిల్లాలో బద్వేలు రహదారి నిర్మాణం కోసం సేకరించే భూములకు పరిహారం విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని నేషనల్ హైవేస్ చీఫ్ జనరల్ మేనేజర్, రీజినల్ ఆఫీసర్ ఆర్కే సింగ్‌తో గురువారం ఆయన భేటీ అయ్యారు. ముత్తుకూరు మండలం ఈపూరు, వెంకన్నపాలెం, పంటపాలెం, వెంకటాచలం మండలం కురిచెర్లపాడు రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం సేకరించనున్న భూముల్లోని పంట చేతికందే దశలో ఉందని, అది పూర్తయ్యే వరకు రైతులకు అవకాశం ఇవ్వాలన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో వ్యత్యాసాలు లేకుండా అందరికీ ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా చెల్లించాలని చెప్పారు. అనంతరం సీఎస్ విజయానంద్‌తో సోమిరెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ముత్తుకూరు మండలం నేలటూరు పంచాయతీకి సంబంధించి పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టాలని కోరారు. మాదరాజు గూడూరు వద్ద చేపట్టిన ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వావిలేటుపాడు వద్ద నేలటూరుపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణ పనులు, నేలటూరు ఎస్సీ కాలనీకి స్థల కేటాయింపు తదితర అంశాలపై సీఎస్‌తో ఎమ్మెల్యే చర్చించారు.

### ఎస్టీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ యువతకు ఉద్యోగావకాశాల కోసం పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు అనుమతి ఇస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నంలోని వేపగుంట, విజయవాడ,/గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపడంతో ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడాదికి రూ.4.22 కోట్లు మంజూరుచేయనున్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డైరక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### విద్యార్థిని ఫొటోలు అడ్డుపెట్టుకుని వేధింపులు

- నన్నయ వర్సిటీ సహాయప్రొఫెసర్, నలుగురు విద్యార్థులపై కేసు నమోదు

దివాన్‌చెరువు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఫొటోలు అడ్డుపెట్టుకుని విద్యార్థినిని వేధిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అడహక్ సహాయ ప్రొఫెసర్ కె.యామినీ జ్యోత్స్న, మరో నలుగురు విద్యార్థులపై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం. తాను మరో వ్యక్తితో సాన్నిహిత్యంగా ఉండడాన్ని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తనను వేధిస్తున్నారంటూ యామినీ జ్యోత్స్నతో పాటు మరో నలుగురు విద్యార్థులపై బయోటెక్నాలజీ విద్యార్థిని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నన్నయ వర్సిటీలో పనిచేస్తున్న ఇద్దరు తాత్కాలిక అధ్యాపకుల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో తనను టార్గెట్ చేసి మానసికంగా వేధిస్తున్నారంటూ ఆ విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొంద న్నారు. ఈ మేరకు వివిధ సెక్షన్ల కింద యామినీ జ్యోత్స్నతో బాటు మరో నలుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# బంగ్లా పయనమెటు?

బంగ్లాదేశ్‌ను సుదీర్ఘకాలం ఏలిన షేక్‌హసీనాను దేశం నుంచి వెళ్ళగొట్టి ఏడాది అయింది. ప్రాణానికే ప్రమాదం వాటిల్లే పరిస్థితుల మధ్య, తట్టాబుట్టా సర్దుకొని, ఢాకాలో ఒక సైనిక హెలికాప్టర్‌లో బయలుదేరి, ఢిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో గత ఏడాది ఆగస్టు 5న ఆమె దిగారు. ప్రజాస్వామ్యం పట్ల వీసమెత్తు గౌరవం లేని ఒక నియంతను ఇలా ప్రాణభయంతో పరుగులెత్తించినందుకు బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమకారులు సంతోషించారు. పదిహేనేళ్ళు ఏకధాటిగా ఏలిన, అవధులులేని అధికార వాంఛ గల క్రూరురాలిని దేశం నుంచి తరిమికొట్టినందుకు గర్వించారు. ఆమెలేని దేశం ఇక విలువలతో వెలిగిపోతుందనీ, ప్రజాస్వామ్యం వేళ్ళూనుకుంటుందని బలంగా విశ్వసించారు, భవిష్యత్తుకోసం కలలు కన్నారు. మరి, అంతటి తిరుగుబాటు తరువాత, అన్ని వందల మంది ప్రాణత్యాగాల అనంతరం ఆశించిన దిశలోనే ఆ దేశం ప్రయాణం సాగుతోందా? ఒక తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంటూ, ఇంకా ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో ఈ ప్రశ్న బేసబబుగా కనిపించవచ్చును. కానీ, ఏడాది కాలంగా బంగ్లాదేశ్ నడుస్తున్న దారిని గమనించినప్పుడు, ప్రశ్నలూ అనుమానాలే కాదు, తీవ్రమైన భయాలు కూడా కలుగుతున్నాయి.

బంగ్లాదేశ్‌ను విస్ఫోటనానికి సిద్ధంగా ఉన్న దేశంగా ఒక సుప్రసిద్ధ మేధావి అభివర్ణించాడు. హసీనా దేశం విడిచిపోగానే, నేటికి సరిగ్గా ఏడాది క్రితం పారిస్ నుంచి మహ్మద్ యూనిస్ దేశరక్షకుడిగా తరలివచ్చారు. ఈ నోబెల్ విజేత రాకడ యావత్ ప్రపంచానికి బంగ్లాదేశ్ భవితవ్యంమీద నమ్మకాన్ని కలిగించింది. జూలై విప్లవం ఏ లక్ష్యం కోసం సాగిందో, ఆ ఆశయాలు, ఆదర్శాలకు అనుగుణంగా దేశాన్ని యూనిస్ నడిపిస్తారని అంతా నమ్మారు. కానీ, ఆ తిరుగుబాటుకు కొనసాగింపుగా చాలా దుర్మార్గాలు సాగాయి. తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలను గాలికొదిలేసి, మూకదాడులను అనుమతించింది. అవామీలీగ్ ఓటర్లు, అభిమానులు అన్న ఆరోపణతో హిందువులమీద మతఛాందసులు విరుచుకుపడ్డారు. అవామీలీగ్ నాయకులందరినీ జైళ్ళలోకి నెట్టివేయడమే కాక, హసీనా రాజకీయ ప్రత్యర్థి, బీఎన్‌పీ అధినేత ఖలీదాజియా మీద ఉన్న కేసులన్నీ రద్దుపరిచి జైలు నుంచి విడుదల చేయడం కూడా జరిగిపోయింది. హసీనా జైళ్ళలోకి నెట్టిన మత తీవ్రవాదులు తిరిగి రోడ్లమీదకు వచ్చేశారు. బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజబూర్ రహ్మాన్ మూలాలూ గుర్తింపులను తుడిచిపెట్టడం లక్ష్యంగా ఆయన విగ్రహం నుంచి నివాసభవనం కూల్చివేతవరకూ ప్రతీదాన్నీ ప్రభుత్వమే అనుమతించింది. ఆయన చరిత్ర చెరిపివేయాలన్న కసిలో భాగంగా, బంగ్లా విముక్తిలో భారతదేశం పాత్ర కూడా పాఠ్యపుస్తకాలనుంచి చెరిగిపోయింది. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నొప్పి కలగనిరీతిలో, ఏ పోరాటమూ, ఎవరి ప్రమేయమూ లేకుండానే బంగ్లాదేశ్ ఆవిర్భవించినట్టుగా చరిత్ర రచన సాగుతోంది. పాకిస్థాన్‌తో ఎన్నడూ లేనంత సాన్నిహిత్యమే కాక, సమస్త రంగాల్లోనూ సహకారం పెరిగింది. ఈ ఏడాదికాలంలో బంగ్లాదేశ్ ఆర్థికంగా బాగా దెబ్బతిన్నది. యూనిస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఆలోచనా విధానాన్ని ప్రశ్నిస్తున్న వందలాదిమంది పాత్రికేయులు జైళ్ళకుపోయారు. నేరాలూ ఘోరాల పెరుగుదలతో పాటు, హసీనా వ్యతిరేక ఉద్యమంలో ముందువరుసలో ఉన్న విద్యార్థి నాయకులు దోపిడీలకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న ఘటనలూ హెచ్చాయి. మతఛాందసత్వంతో మహిళలను కట్టిపడేసే కృషి జరుగుతోంది. హసీనామీద ఆగ్రహంతో ప్రభుత్వమే ప్రోత్సహించిన మూకదాడులకు ఇటీవల మాజీ ఎన్నికల ప్రధానాధికారి సైతం గురి కావలసివచ్చింది.

ఫిబ్రవరిలో ఎన్నికలు జరగబోతున్నట్టుగా యూనిస్ మంగళవారం చేసిన ప్రకటన, బంగ్లాదేశ్ తిరిగి గాడిన పడటానికి ఉపకరించవచ్చు. తాత్కాలిక ప్రభుత్వం కన్నా, ప్రజలు ఎన్నుకున్నవారు, ఎవరైనా కావచ్చు, అధికారంలో ఉండటంవల్ల కాస్తంత జవాబుదారీతనం ఉంటుంది. హసీనా పార్టీకి గుర్తింపు తొలగించి, ఎన్నికల బరిలో నిలవనివ్వకుండా ఇప్పటికే జాగ్రత్తలు తీసుకున్న నేపథ్యంలో అక్కడ జరగబోయే ఎన్నికలు ప్రజాభీష్టాన్ని సంపూర్ణంగా ప్రతిఫలించవు. అయినప్పటికీ, తాము ఏ ఆశయాల కోసం హసీనాను గద్దెదింపామన్నది విద్యార్థి ఉద్యమకారులు విస్మరించకుండా, దేశం మతఛాందస శక్తులు, పార్టీల చేతిలోకిపోకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యం.

# ఆటలో గెలవాలంటే ఆడితీరాలి

ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలలో పాల్గొనడమనేది పౌరుల హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజలు ఆ హక్కును సద్వినియోగపరిచి, తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చేలా చూడడమనేది రాజకీయ పార్టీల, ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీల విద్యుక్త ధర్మం. అయినా కొన్ని రాజకీయ పార్టీలు లేదా ప్రజా వర్గాలు అప్పుడప్పుడూ ఎన్నికలలో పాల్గొనేందుకు నిరాకరించడం, ఆ ప్రజాస్వామిక ప్రక్రియను బహిష్కరించడం జరుగుతోంది. తద్వారా, ఎన్నికలలో పాల్గొనడం కంటే పాల్గొనకపోవడం ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి తమ వైఖరి ఏమిటో స్పష్టాతి స్పష్టంగా చెప్పడమవుతుందని పార్టీలు లేదా ప్రజా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలు లేదా ప్రజావర్గాలు ఎన్నికలను బహిష్కరించడమనే ఎత్తుగడ పాత, కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పునరావృతమవుతున్న లక్షణంగా ఉన్నది. అయితే చరిత్ర ఈ పరిణామం గురించి ఒక సత్యాన్ని చెప్పుతోంది: ఎన్నికల బహిష్కరణలు అరుదుగా విజయవంతమయ్యాయి. అవి చాలావరకు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలను బలహీనపరిచాయని, అధికారంలో ఉన్న పార్టీలు లేదా నాయకులకే మరింత అనుకూల పరిస్థితులు సృష్టించాయని కూడా చరిత్ర స్పష్టం చేసింది.




ఈ సంవత్సరాంతంలో బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్షాలు గట్టిగా పిలుపునిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్) పట్ల సందేహాలు, సంకోచాలతో విపక్షాలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల పేర్లను భారీ ఎత్తున జాబితా నుంచి తొలగించే లక్ష్యంతోనే 'సర్'ను చేట్టారని, దీనివల్ల పేదలు, మైనారిటీలు, వలసపోయినవారు తీవ్రంగా నష్టపోనున్నారని 'సర్' విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో సర్ నిష్పాక్షికతను ప్రజలు విశ్వసించలేకపోతున్నారు. ఎన్నికల సంఘం పట్ల బిహార్ ప్రజల్లో అపనమ్మకం నెలకొన్నది. ఓటర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం తక్షణమే ఎటువంటి సందేహాలకు తావివ్వని రీతిలో సమాధానాలు ఇవ్వవలసిన అవసరమున్నది. అయితే ఇదే సమయంలో సర్ పట్ల ఆక్షేపణతో ఎన్నికలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది.

ఎన్నికల బహిష్కరణ విషయమై చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని దక్షిణాసియా అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 2014లో పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. అధికారంలో ఉన్న అవామీలీగ్ రాజీనామా చేసి, ఎన్నికల నిర్వహణకు ఒక తటస్థ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. అవామీలీగ్ నిష్పాక్షికత పట్ల బీఎన్‌పీ అనుమానాలు

**బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పారదర్శకంగా లేదన్న ఆక్షేపణతో అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణకు ప్రతిపక్షాలు పిలుపునిస్తున్నాయి. ఇలా ఎన్నికల క్షేత్రానికి దూరంగా ఉండిపోవడం రాజకీయ పార్టీలు తమ బాధ్యతను వదిలివేయడమే అవుతుంది. అంతేకాకుండా అదొక రాజకీయ అనర్థానికీ దారితీస్తుంది.**

నిరాధారమైనవి కావు. అయితే బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడం ద్వారా అధికార పార్టీకి చెప్పుకోదగ్గ పోటీ లేకుండా చేసింది. ఫలితంగా 153 నియోజకవర్గాలలో అవామీలీగ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల అనంతరం నేను ఢాకాకు వెళ్లాను. బీఎన్‌పీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే తప్పకుండా గెలిచేదని చాలా మంది నాకు స్పష్టంగా చెప్పారు అధికార అవామీలీగ్‌కు విజయాన్ని బీఎన్‌పీ స్వయంగా సమకూర్చిందని వారు అభిప్రాయపడ్డారు.

భారత్‌లో కూడా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పంజాబ్‌లో 1992 అసెంబ్లీ ఎన్నికలు ఇందుకొక ఉదాహరణ. శిరోమణి అకాలీదళ్ ఆ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించింది. ఫలితంగా ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదయింది. కొన్ని జిల్లాల్లో కేవలం 13 శాతం ఓటర్లు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. అకాలీదళ్ బాయ్‌కాట్ కాంగ్రెస్ పార్టీకి సులభ విజయాన్ని సమకూర్చింది. పోటీ రహితంగా ఎన్నికలు జరగడం, శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో పంజాబ్‌లో ప్రజాస్వామ్యం సార్థకత కోల్పోయింది. ఇంకా పలు బహిష్కరణల ఉదంతాలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా భాగం ప్రధానస్రవంతిలో లేని వేర్పాటువాద పార్టీలు ఇచ్చినవే. జమ్మూ–కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులు మొదటి నుంచీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూనే ఉన్నాయి. ఎన్నికలలో తాము పాల్గొనడం జరిగితే కశ్మీర్‌లో భారత పరిపాలనకు న్యాయసమ్మతి కల్పించడమే అవుతుందని వేర్పాటువాదులు తమ నిర్ణయాన్ని సమర్థించుకునేవారు.

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో కూడా ఎన్నికల బహిష్కరణ పిలుపులు విజయవంతమవలేదు. వెనిజులా ఇందుకొక ఉదాహరణ. 2005లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. ఫలితంగా జాతీయ అసెంబ్లీలో ప్రతి సీటునూ పాలక కూటమి గెలుచుకున్నది. 2018లో పాక్షికంగా బహిష్కరించాయి. నికోలస్ మదురో మళ్లీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు ఈ బహిష్కరణ తోడ్పడింది. 2020లో కూడా ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనకపోవడంతో 31 శాతం ఓటర్లే పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ తక్కువ శాతం పోలింగ్‌తో అధికార పార్టీకి భారీ మెజారిటీ లభించింది. జింబాబ్వేలో మోర్గాన్ స్వాన్‌గిరాయి 2008 అధ్యక్ష ఎన్నికల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రాబర్ట్ ముగాబే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికల బహిష్కరణ వల్ల గానీ లేదా ఓటర్లు చాలా తక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న కారణాన గానీ సంబంధిత ఎన్నికను రద్దు చేసే సౌలభ్యాన్ని భారత రాజ్యాంగం కల్పించలేదు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల సంఘం విధిగా ఎన్నికలు నిర్వహించి, పోలయిన ఓట్ల ప్రాతిపదికన విజేతలు ఎవరో ప్రకటిస్తుంది. కనుక ఎన్నికల బహిష్కరణ పిలుపు ఎన్నికల ప్రక్రియను నిరోధించలేదు, నిరోధించజాలదు. పార్టీలు లేదా అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగిన పక్షంలో అది బరిలో ఉన్న అభ్యర్థికి సులభ విజయం సమకూర్చడానికి మాత్రమే దోహదం చేస్తుంది.

ఈ కారణంగానే బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదానికి ప్రతిస్పందనగా ఎన్నికలను బహిష్కరించాలన్న తమ పిలుపుపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు పునరాలోచన చేయవలసిన అవసరమున్నది. అయితే 'సర్' ప్రక్రియను నిశితంగా పరీక్షించాలి. ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం వ్యక్తం చేస్తున్న అనుమానాలను తొలగించాలి. ఆ సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉన్నది. ఓటర్ల ఫిర్యాదులను శీఘ్రగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు అన్నీ చేపట్టాలి. పౌర సమాజం, మీడియా, న్యాయస్థానాలు అన్నీ 'సర్' విషయంలో జాగరూకతతో ఉండాలి. ఎన్నికలలో పాల్గొనే బాధ్యతను రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితులలోను వదిలివేయకూడదు. ఎన్నికల బరి నుంచి వైదొలగడమంటే ఎన్నికల పోరులో ఓడిపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలలో పాల్గొనకపోవడం నిరసన ఎంత మాత్రంకాదు, అది బాధ్యతను పరిత్యజించడమే అవుతుందన్న సత్యాన్ని విస్మరించకూడదు.

ఎన్నికల బహిష్కరణే కాదు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం కూడా ప్రతిపక్షాలు తమను తాము ఓడించుకోవడమే అవుతుంది. వాకౌట్‌లు, సభా కార్యక్రమాలకు ఎగతెగకుండా అంతరాయం కలిగించడం కొన్ని సందర్భాలలో ప్రతీకాత్మక నిరసన కావచ్చునేమో కానీ, వాటి ఆచరణాత్మక ప్రభావం వల్ల కీలక బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించే స్వేచ్ఛ పాలక పక్షానికి లభిస్తుంది. అనేక కీలక బిల్లులు–2020లో మూడు కొత్త సాగు చట్టాలు, అంతకు ముందు సంవత్సరాలలో కీలక రాజ్యాంగ సవరణలు– ప్రతిపక్ష ఎంపీల వాకౌట్ల వల్లే ఆమోదించడం అధికార పార్టీకి వీలయింది.

ఎన్నికలలో గానీ, పార్లమెంటులో గానీ ప్రతిపక్షం పాత్ర ప్రభుత్వాన్ని సవాల్ చేయడం, ప్రశ్నించడం, పాలనాపరమైన నిర్ణయాలు, చర్యలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయడమే. ఆగ్రహాన్ని, అసంతృప్తినీ వ్యక్తం చేసేందుకు బహిష్కరణలు ఉపయోగపడవచ్చుగానీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వేదికల నుంచి వైదొలగడం, పాలకులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయాల్సిన పోరాటాలను వదిలివేయడమే అవుతుంది. అత్యంత ప్రభావశీల ప్రతిపక్ష నాయకులు అందరూ అత్యంత ప్రతికూల పరిస్థితులలోను తమ బాధ్యతలను విడనాడనివారేనని చరిత్ర చెప్పుతోంది. ప్రజాస్వామిక పద్ధతులలో ప్రభుత్వ తప్పులను బహిర్గతం చేసి, ప్రజాభిప్రాయాన్ని సమీకరించి, ప్రజల విశ్వాసాన్ని పొందినవారేనని స్పష్టం చేస్తోంది. ఎన్నికలు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం వల్ల ప్రతిపక్షాలు తమ ప్రత్యర్థులకే అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇది చాలా పెద్ద తప్పు. దీనివల్ల సంభవించే అనర్థాల నుంచి కోలుకోవడానికి దశాబ్దాలు కాకపోయినా సంవత్సరాలు పడుతుంది. చట్టసభలలో ప్రతిపక్షాల స్థానాలు ఖాళీగా ఉండడం అధికారపక్షం స్వప్నం, ప్రజాస్వామ్యానికి దుస్స్వప్నం అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి.



■ ఎస్‌వై ఖురేషి
భారత ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యం)

# నాన్నా, నిన్ను చివరిచూపు చూస్తానా!?

నేను క్షేమం. యుద్ధంలో ఉన్న నీ క్షేమాన్ని కోరటం అత్యాశే అవుతుంది. నిన్ను చూసే, నీతో మనసారా మాట్లాడే అవకాశం నాకెలాగూ లేదు. కనీసం నిన్ను చివరిచూపు చూస్తానో లేదోననే ఆందోళనతో ఈ బహిరంగలేఖ రాస్తున్నాను. మొన్న నంబాల కేశవరావు అంకుల్‌ను అనాథగా దహనం చేసిన తర్వాత కనీసం నీ పార్థివదేహాన్ని చూడగలననే ఆశ కూడా కోల్పోయాను. నీతో ఇలా సంభాషించవలసి రావటమే అతి పెద్ద విషాదం.

గత సంవత్సరం జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో నీవే మరణించావని వార్త పొక్కింది. అది నిజమో, కాదో తేల్చుకోలేక వారం పాటు బాధాతప్త హృదయంతో ఉండిపోయాం. ఎన్‌కౌంటర్ వార్త విన్నప్పుడల్లా మా ఇద్దరు పిల్లలు 'తాత ఎలా ఉంటాడమ్మా' అని అడుగుతున్నారు. సరిగ్గా నలభై ఏళ్ల కిందట 'నాన్న ఎలా ఉంటాడమ్మా' అని నేను మా అమ్మని అడిగిన రోజులు నా స్మృతిపథంలోకి వచ్చాయి. కాలం చూడు ఎలా గడిచిపోయిందో.

నీవు అజ్ఞాతంలోకి వెళ్లి యాభై ఏళ్లు గడిచాయి. మొన్న ఎవరో అంటే విన్నాను నీవు, మల్లోజుల కోటేశ్వరరావు, గణపతి అంకుల్ మొదటితరం నాయకులని. మీ జీవితంలో మూడోవంతు ప్రజలకు అంకితం చేసారు. ఏ మనిషికైనా ఇలాంటి జీవితం అరుదుగా లభిస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో వీరుల గాథలను పుస్తకాలలో చదివాను. ఇప్పుడు స్వయంగా నా తండ్రే అలాంటి చరిత్రలో భాగమైనందుకు గర్వంగా ఉంది.



**డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే' అని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే.**

నేను పుట్టేనాటికే నీవు విప్లవాన్ని ప్రేమించావని అమ్మ చెప్పింది. అంతకు మునుపే నీవు అమ్మను ప్రేమించావు. ఆమె నిన్ను, నీవు కోరుకున్న విప్లవాన్ని ప్రేమించి, పొత్తిళ్లలో ఉన్న నన్ను వదిలివేసి నీతో వచ్చింది. తల్లీ తండ్రీ ఉండి కూడా అనాథలా బతికాను. నిరాదరణ, ఈసడింపులు జీవితాన్ని వెక్కిరించాయి. దుఃఖం కట్టలు తెంచుకొని నిద్ర లేని రాత్రులు నాతో సహవాసం చేశాయి.

బంధువులకు భారమైనప్పుడల్లా నేను గూడులేని పక్షినే. ఆరేళ్ల వయసులో అనుకుంటాను నేనున్న చోటుకు సంవత్సరం తర్వాత ఒకరోజు అమ్మ వచ్చింది. నేను అమ్మను గుర్తుపట్టలేదు. యథాలాపంగా నా ఆటలో నేను మునిగిపోయాను. ఆమె నా దరి చేరి అక్కున చేర్చుకొని 'నేను మీ అమ్మనని' చెప్పింది. ఈ ప్రపంచంలో ఏ తల్లికి అలాంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాను. ఇక ఆ తర్వాత అమ్మ కూడా నా దగ్గరకు రావటం తగ్గిపోయింది.

నేను అక్షరాలు నేర్చుకుంటున్న సమయంలోనే నా బాగోగులు చూసుకుంటున్న వారిని వదిలి మరో చోటుకు పంపించారు. హాయిగా అమ్మ ఒడిలో నిద్రించవలసిన వయసు, చందమామ కథలు వినవలసిన సమయం, గోరుముద్దలు తినవలసిన కాలంలో బతుకు చితికి, కన్నీళ్లు మింగాల్సి వచ్చింది. బాలకార్మికురాలి పాత్రలోకి జీవితం తర్జుమా అయింది. ఉదయాన్నే నిద్రలేచి, నా వయసుకు తగని పనులు చేసి, అప్పటికే అలసిపోయి బడికి వెళ్లేదాన్ని. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర నాకు చాలా దూరంగా ఉండిపోయాయి. పారిపోవాలని ఉండేది కానీ గమ్యం తెలియదు. చనిపోవాలని అనిపించేది కానీ మార్గం తెలియదు. అప్పుడప్పుడు ఊళ్లోకి వచ్చే నీ సహచరులు కనుక్కునే యోగక్షేమాలే నాకు లభించే ఊరట.

ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో డాక్టర్ కావాలని ఉండేది కానీ, నాకు సరైన దారి దొరకలేదు సరికదా దారిచూపేవాళ్లూ లేరు. అప్పుడనిపించింది. అందరిలాగా నాకు అమ్మా నాన్న ఉంటే ఇష్టమైన చదువు దొరికేది కదా! అని. అంతిమంగా నావి అస్థిరమైన వానాకాలం చదువులయ్యాయి. నా ప్రమేయం లేకుండానే నేను ఉండే స్థలం, చదువు నిర్ణయం జరిగి మారుతుండేవి. అలా హైదరాబాద్ నగరానికి మారిపోయాను. లక్షలాది మంది అనాథలను, వలస కార్మికులను తన ఒడిలో చేర్చుకున్న ఈ నగరం నాకింత చోటిచ్చింది. కాస్త జీవితాన్నిచ్చింది. కొంత జ్ఞానానిచ్చింది. కొత్త స్నేహాలు, రాజకీయాలు, సామాజిక చలనాలు, ఆచరణ, అధ్యయనం నాకింత మనోధైర్యాన్ని ఇచ్చాయి. ప్రపంచం అర్థమయ్యేకొద్దీ సాంత్వన లభించింది.

సరిగ్గా ఈ సమయంలోనే నా జీవితాన్ని అల్లకల్లోలం చేసిన పిడుగులాంటి వార్త విన్నాను. చంటి పిల్లగా నన్ను వదిలేసిపోయిన మా అమ్మ ఎన్‌కౌంటర్ అయింది (ఆగస్టు 13, 1998). అది జరిగిన నెల రోజులకు నాకు ఆ విషయం తెలిసింది. అనాథ శవంగా మా అమ్మ మిగిలిపోయింది. ఆమెను ఎవరో ఖననం చేసారు. పిచ్చిదానిలా హైదరాబాద్ రోడ్లు పట్టి తిరిగాను. రాత్రి, పగలని తేడా లేకుండా సంచరించాను. నిద్రాహారాలు మాని దుఃఖాన్ని ఆశ్రయించాను. ఒంటరిదాన్ని అయిపోయాను. కనిపించని శత్రువుతో మౌనంగా యుద్ధం చేసాను. తండ్రి ఉండీ రాలేదు. తల్లి మరణించింది. ఈ జీవితం ఎందుకని ఎన్నిసార్లు అన్పించిందో!

ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో సీటురావటం నా జీవితానికి చుక్కానిలా అన్పించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావటం వలన మామూలు మనిషిని కాగలిగాను. కానీ నేను పెళ్లి చేసుకున్న రోజు నీవు నా పక్కన ఉంటే ఎంత బాగుండునో కదా! నీ మనుమరాలు నా కడుపులో పడినప్పుడు ఈ వార్త నీతో చెప్పాలని ఎంత ఆశపడ్డానో. అందరు స్త్రీల వలె తల్లిదండ్రుల చేతుల మీదుగా నాకు సీమంతం జరగాలని ఎన్నిసార్లు అన్పించిందో. బాలింత వాసన తీరకముందే నా బిడ్డకు నేనే స్నానం చేయించుకోవలసి వచ్చింది. నీ చేతుల్లో ఆడుకోవాలని, నీ భుజాల మీద కూర్చోవాలని, నీ వేలు పట్టి నడవాలని ఎన్నోసార్లు కోరుకున్నాను. కనీసం నా పిల్లలనైనా నీవు ఎత్తుకుంటే చూసి మురిసిపోవాలని భావించాను.

డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు, జరుగుతాయనే నమ్మకం లేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా, విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే'నని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే.

ప్రేమతో
● స్నేహలత మల్ల



బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు, ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త, విద్యావేత్త, సాంస్కృతిక చరిత్రకారుడు లార్డ్ మేఘనాథ్ దేశాయ్ తన 85వ ఏట ఇటీవల కన్నుమూశారు. 1988–1994 మధ్యకాలంలో **డాక్టర్ యలమంచిలి శివాజీ** రాజ్యసభ ప్రసంగాల సంకలనం 'ఎగైనెస్ట్ ఆడ్స్' (ఎదురీత)కు **మేఘనాథ్ దేశాయ్** రాసిన ముందుమాట ఇది.

# ....రాజకీయవేత్తల్లో చాలా అరుదు!

భారతదేశపు ఆర్థిక సంస్కరణలు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. మనం గనుక అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అత్యంత గరిష్ఠ మొత్తాన్ని అత్యవసర సమయాల్లో వినియోగార్థం రుణంగా స్వీకరించాలని ఇందిరాగాంధీ నిర్ణయించిన నాటి నుంచి లెక్కించేట్లయితే పదిహేనేళ్లుగా కొనసాగుతున్నట్లు. అంతేగాకుండా ఆర్థిక అంశాలపై చర్చలు భారతదేశంలో ఇంకా ప్రబల విశ్వాసాలతో; సుస్పష్టంగా, సుదీర్ఘంగా దట్టించిన కుతర్కాలతో; ప్రజానురంజక బాధ్యతారాహిత్యంతో ముసురుకుని ఉంటాయి. (అయితే ఈ విషయంలో బ్రిటిషు రాజకీయవేత్తలు ఏ మాత్రం మెరుగ్గా ఉండరనేది వారి పార్లమెంటులో కూడా ఐరోపా వ్యవహారాలపై ఏ చర్చను గమనించినా ఇట్టే అవగతమవుతుంది.) వాస్తవాలను అధ్యయనం చేసి, సిద్ధాంతాలను జీర్ణించుకుని నిష్పాక్షికంగా చర్చించగలిగేది రాజకీయవేత్తల్లో చాలా అరుదు. ఆర్థికశాస్త్రంలో నిష్ణాతులు కావటం కష్టమే; అయితే జాతి ఆర్థిక స్థితిగతుల గురించి అయోమయంలో పయనించడం కూడా అభిలషణీయం కాదు. మన రాజకీయవేత్తలు అలా మబ్బులో ఉండటమూ అంతే ముఖ్యం.







లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో వేసవి శిబిరంలో ఆర్థిక శాస్త్రాధ్యయనానికి వచ్చినప్పుడు డా. శివాజీని కలిశాను. ఆయన వంటి ఒక అవిశ్రాంత రాజకీయవేత్త... ఇతర రాజకీయవేత్తల వలె తన సమయాన్ని రాజకీయ కుతంత్రాలతో గడపక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థిక శాస్త్ర అధ్యయనపు కాఠిన్యాన్ని కోరుకోవడం నన్నెంతగానో ఆకట్టుకుంది. నేను రాజ్యసభలో ఆయన ప్రసంగాల సంకలనాన్ని చూచినప్పుడు ఆయన ఆర్థిక అంశాలపై ఎడతెగని ఉత్సుకతను చూపటాన్ని, వివిధ విషయాలపై వర్ణ విన్యాసాన్ని గమనించాను. ఇతర విషయాల్లో కూడ ఆయన విమర్శనాత్మక ధోరణిని కనబర్చగలడు కాని, నన్ను ఆకట్టుకునేవి మాత్రం ఆర్థిక అంశాలే.

బడ్జెట్లను, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల చర్యల్ని పరిశీలించటం, వాటిని డా. శివాజీ మాదిరిగా క్షుణ్ణంగా విశ్లేషణకు గురిచేసే ప్రయత్నాలు చేయడం మన రాజకీయ జీవితాల్లో ఆర్థిక అంశాలపై చర్చల స్థాయిని పెంచగలవు. డా. శివాజీ మాదిరిగా ఆర్థికాంశాలకు తగిన ప్రాధాన్యతను సమకూర్చే వాళ్ల ప్రపంచానికి చాలా అవసరం. ముందు ముందు ఆర్థిక అంశాలపై చర్చను కొనసాగించే ఆయన కృషిలో విజయాన్ని ఆకాంక్షిస్తూ...

22-12-1995 — ప్రొఫెసర్ ది లార్డ్ దేశాయ్

# టెక్నాలజీ కాదు... ఓటర్ల వెనక పడాలి!

2004కు ముందు రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు టెక్నాలజీ, ఐటీ అంటూ దేశాలు పట్టుకు తిరుగుతూ, తమను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని గ్రామీణ ఓటర్లు బలంగా భావించారు. గ్రామీణ ఓటర్లు– అంటే రైతులు, రైతు కూలీలు, చేతి వృత్తుల వారు, నిరుపేద మహిళలు. వీరిలో అత్యధికులు డ్వాక్రా సంఘాల సభ్యులు. గ్రామీణ దళితులు. సమాజంలో వీరే అరవై శాతం వరకూ ఉంటారని గణాంక వివరాలు చెబుతాయి. నిజానికి వీరే ఓటర్లు. కడుపునిండిన వర్గాలకు (కులాలకు అతీతంగా) చెందినవారు పోలింగ్ కేంద్రాల మొహాలు పెద్దగా చూడరు.

ఈ గ్రామీణ పేదలలో అత్యధికులు 2004 ఎన్నికలలో టీడీపీకి ప్రత్యామ్నాయంగా కనపడుతున్న వైఎస్ రాజశేఖర రెడ్డి వైపు తిరిగారు. ఆ ఎన్నికలకు ముందు అలిపిరిలో జరిగిన బాంబు దాడిలో బయటపడిన చంద్రబాబుపై పెల్లుబికిన సానుభూతి కూడా చంద్రబాబును ఎన్నికల వైతరణిని దాటించలేదు. "సానుభూతి దారి సానుభూతిదే. ఓటు దారి ఓటుదే" అని ఓటర్లు ఆ ఎన్నికల్లో తేల్చి చెప్పారు. ఇది చంద్రబాబు 'టెక్నాలజీ పాలనపై' ఉమ్మడి రాష్ట్ర ఓటర్లు ఇచ్చిన తీర్పు ఇది. ఫలితంగా టీడీపీకి మొత్తం 294 స్థానాలకు గాను, 47 సీట్లు మాత్రమే వచ్చాయి. అదే 1999లో 180 అసెంబ్లీ స్థానాలు లభించాయి.

2014 వచ్చే సరికి రాష్ట్రం విడిపోయింది. రాజధాని హైదరాబాద్‌ను తెలంగాణకు ఇచ్చేసి, ఆంధ్ర వారిని కొత్తగా కట్టుకోమన్నారు. దాంతో ఆంధ్రుల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. ఆ ఎన్నికల్లో తెలుగు వారు రెండు తీర్పులు ఇచ్చారు. 1. రాష్ట్రాన్ని అన్యాయంగా, అరాచకంగా, అడ్డగోలుగా విభజించి పారేసిన కాంగ్రెస్ పార్టీని నిలువునా గోతిలో పాతి పెట్టారు. 175 నియోజకవర్గాలలో ఏ ఒక్క స్థానంలోనూ కనీసం డిపాజిట్ కూడా రాలేదు. 2. విభజితమై, అనాథగా కనపడుతున్న 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌ను పునరుజ్జీవింపచేయడానికి చంద్రబాబు నాయుడే తగిన పరిపాలనానుభవం కలిగిన నేత అనే బలమైన భావనతోను 2014లో ఓటర్లు టీడీపీకి ఓటు వేశారు. ఆయన ముఖ్యమంత్రి కావడం అది మూడోసారి.

అయితే, 1999–2004 మధ్య ఆయన ఏమి చేశారో... 2014–2019 మధ్య కూడా ఆయన అదే చేశారనేది పలువురి విశ్లేషకుల భావన. రోజుకు 18 గంటలు పని చేశారనేది వాస్తవం. పనిచేయడం అనేది ఆయనకు ఓ వ్యసనం. ప్రజా జీవితంలో పనిచేయకుండా ఆయనను నిలువరించడం... ఆ బ్రహ్మ తరం కూడా కాదు. అయినప్పటికీ, ఆయన నేల విడిచి సాము గరిడీలు చేశారనే భావం జనంలో బలంగా నాటుకుపోయింది.

2019 ఎన్నికల్లో ఆయన ఓటమికి 'సింగపూర్' కూడా ఓ ముఖ్య కారణం. "అమరావతిని సింగపూర్ చేస్తా" అంటూ చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందూ చెప్పారు. గెలిచాకా చెప్పడం నిర్విరామంగా కొనసాగించారు. 'సింగపూర్ ఎలా ఉంటుందో చూసి రండి' అంటూ కొంత మంది రాజధాని రైతులను సింగపూర్‌కు కూడా పంపించారు. నిజానికి సింగపూర్‌కు, మన రాష్ట్రానికి లేదా మనకు అస్సలు పోలికే లేదు. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. అక్కడ చట్టాన్ని ఎవరూ అతిక్రమించరు. రాజకీయ, అధికార అవినీతిని అక్కడి పౌర సమాజం క్షమించదు. చట్టాలను ఏ మాత్రం ఉల్లంఘించినా జైలే. చివరకు మంత్రులు అయినా సరే. ఉదాహరణకు– సుబ్రహ్మణియన్ ఈశ్వరన్ అనే క్యాబినెట్ మంత్రి పరిమితులకు మించి కొన్ని ఫేవర్స్ పొందారని జైల్లో పడేశారు. అదికూడా ఫుట్‌బాల్ మ్యాచ్‌కి టిక్కెట్లు, హోటల్స్‌లో రూములు వంటి ఫేవర్స్ అక్రమంగా పొందారనే అభియోగంపై ఏడాది ఖైదు విధించారు. మరి, మన దగ్గర!? అలాగే, అధికార యంత్రాంగం. అక్కడ లంచగొండితనం అనే ప్రశ్నే లేదు. మరి ఇక్కడ!? మన సమాజం అవినీతికి ఆలవాలం. రాజకీయం అనేది ఒక లాభసాటి వ్యాపారం. అటువంటి సమాజాన్ని సింగపూర్‌గా మార్చుతాం అంటే... మన సమాజానికి డయాలసిస్ చేయాలి. ఆ పని చేయకుండా డెవలప్‌మెంట్... డెవలప్‌మెంట్.... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సంపద సృష్టి అంటూ ప్రజలిచ్చిన అవకాశాన్ని చంద్రబాబు నాయుడు వృథా చేస్తున్నారేమో అని తెలుగుదేశం శ్రేయోభిలాషులు పలువురు ఆందోళన చెందుతున్నారు.

2024 ఎన్నికల్లో చంద్రబాబు (కూటమి)ని ప్రజలు గెలిపించింది ఇందుకు కాదు. వారి ఎజెండా చాలా సింపుల్. 1. బకాసురుల బారి నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయండి. 2. మా బతుకులు మమ్మల్ని సగౌరవంగా, స్వేచ్ఛగా బతకనీయండి. 3. మళ్ళీ అటువంటి పీడకల పునరావృతం కాకుండా, మమ్మల్ని నరక యాతనలకు గురి చేసిన మొత్తం కాలకేయులందరినీ జైళ్లకు పరిమితం చేసి, నిరంకుశ పాలనలోకి అడుగు పెట్టకుండా కాపాడండి.

నిజానికి, చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఈ మేరకు ఎన్నికలకు ముందు తమ పర్యటనలలో ఇవే అంశాలపై పదే పదే హామీలు ఇచ్చారు. అవి విని పులకించిపోయిన ప్రజలు చంద్రబాబుకి సంపూర్ణాధికారం అప్పగించి అప్పుడే ఓ ఏడాది గడిచిపోయింది. చివరి ఏడాది ఎన్నికల వాతావరణంలో రాష్ట్రం మునిగిపోయి ఉంటుంది అనుకుంటే... చంద్రబాబు బృందానికి ఇక మిగిలింది నికరంగా మూడేళ్ల వ్యవధి మాత్రమే. ఇప్పుడు ఆయన చెబుతున్న క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బనకచర్ల ప్రాజెక్ట్, అమరావతికి అదనపు భూ సమీకరణ, సింగపూర్ అనుకరణ మొదలైనవి ఏవీ కూడా వచ్చే మూడేళ్ళల్లో ఫలితాలు ఇచ్చేవి కావు. ప్రజా బాహుళ్యపు వినియోగంలోకి వచ్చేవి కావు. ఇవి ఓట్లు రాల్చవు.

**ఎన్ని బలహీనతలు ఉన్నా, చంద్రబాబు పాలనలో ప్రజలు డెమోక్రసీ ఫలాలను ఆస్వాదిస్తున్నారు. ఆయన అధికారంలోకి రాక ముందు, రాష్ట్రంలో నడిచింది డెమోక్రసీ కాదు, క్లెప్టోక్రసీ. అంటే సామాజిక ద్రోహాలకు పాల్పడే కొంతమంది దొంగలు, హంతకులు లాంటి వ్యక్తులు మాయ మాటలతో అధికారం చేజిక్కించుకుని, వనరులన్నింటినీ నిలువునా దోచేసే వ్యవస్థ.**





ఎన్ని బలహీనతలు ఉన్నప్పటికీ, చంద్రబాబు పాలనలో ప్రజలు డెమోక్రసీ ఫలాలను ఆస్వాదిస్తున్నారు. కానీ, ఆయన ఇప్పుడు అధికారంలోకి రాక ముందు, రాష్ట్రంలో నడిచింది డెమోక్రసీ కాదు, క్లెప్టోక్రసీ. అంటే సామాజిక ద్రోహాలకు పాల్పడే కొంతమంది దొంగలు, హంతకులు లాంటి వ్యక్తులు మాయ మాటలతో అధికారం చేజిక్కించుకుని, వనరులన్నింటినీ నిలువునా దోచేసే వ్యవస్థ. మళ్ళీ అటువంటి వ్యవస్థను రుచి చూడాలని ప్రజలు కోరుకోవడం లేదు. ఆ ప్రజాభీష్టాన్ని చంద్రబాబు మనసా.. వాచా.. కర్మణా.. నెరవేర్చి, తెలుగు ప్రజలకు క్లెప్టోక్రసీ నుంచి విముక్తి కలిగించిన మహానేతగా చరిత్రలో నిలిచిపోతారా లేదా అనే ప్రశ్న రాష్ట్ర శ్రేయోభిలాషుల మనసులను తొలిచి వేస్తున్నది.

చంద్రబాబు బృందం పడవలసింది సింగపూర్ వెనుక కాదు. ఎందుకంటే ఆ మోడల్ మనకు నప్పదు. ఆయన బృందం పడవలసింది... తనకు 164 సీట్లు బంగారం పళ్లెంలో పెట్టి అధికారం అప్పగించిన ఓటర్ల వెనకాల. తెలుగుదేశం పార్టీకి వాళ్ళే 'బ్రెడ్ విన్నర్స్'.

○ భోగాది వేంకటరాయుడు



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారా లోకేశ్




పట్టు, నూలు దారాలతో వివిధ సంస్కృతుల కలబోతగా నేత కళాకారులు రూపొందించిన ఆంధ్రప్రదేశ్ చిత్రపటాన్ని చేనేత కుటుంబాల తరపున సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న మంత్రి లోకేశ్



సీఎం చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న చేనేతలు

# చేనేతకు చేయూత

## నేతన్నలకు రూ.25 వేలు భరోసా



సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి

మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'చేనేత కార్మికులకు చేయూత అందిస్తాం. ఏటా నేతన్న భరోసా కింద రూ.25 వేలు ఇచ్చే బాధ్యత నాది. రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు విద్యుత్ భారం తగ్గేలా నెలకు 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇస్తాం. చేనేత కార్మికులకు ఎంత ఇచ్చినా అది తక్కువే. చేనేత ఉత్పత్తులపై వేసే జీఎస్టీని 5 శాతం రాష్ట్ర ప్రభుత్వం తరపున రీయింబర్స్ చేస్తాం. త్రిఫ్ట్ ఫండును పునరుద్ధరించి 5,386 మందికి రూ.5 కోట్లు విడుదల చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత కార్మికులపై వరాల జల్లు కురిపించారు. పదకొండో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీవర్‌శాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో చేనేత వస్త్ర ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ నైపుణ్యం, సృజనాత్మకతల కలబోత చేనేత అన్నారు. 1905లో ఆగస్టు 7న మొదలైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తి తో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం కుదేలైపోయిందన్నారు. ఆప్కో ద్వారా

(మిగతా 6లో)

### చేనేత వైభవానికి పుట్టినిల్లు

భారతీయ శక్తికి, సంస్కృతికి, సంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచ వ్యాప్తంగా మన చేనేత ఖ్యాతి తెచ్చింది. అటు నైపుణ్యం, ఇటు సృజనాత్మక శక్తి కలబోతే చేనేత. అందులో మన తెలుగు నేల చేనేత వైభవానికి పుట్టినిల్లు. నాగరికతకు మూలం నేతన్న. హరప్పా నాగరికత నుంచి చేనేత అభివృద్ధి చెందింది. కాకతీయుల కాలంలో నాణేలపైన నేతన్నల ముద్ర ఉండేది. బ్రిటీషు వారు చేనేత వస్త్రాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి ఇతర దేశాలలో విక్రయించుకున్నారు.



- నైపుణ్య శిక్షణ.. ఉత్పత్తుల మార్కెటింగ్
- రాజధానిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు
- చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, చిత్రంలో సీఎం చంద్రబాబు

## చేనేతలు.. నా కుటుంబసభ్యులు

### మంత్రి నారా లోకేశ్

'2019 ఎన్నికల్లో 5300 ఓట్ల తేడాతో ఓడిపోగా దాని పక్కన ఓ సున్నా కలుపుకుని 53 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిపించాలని మంగళగిరి ఓటర్లను 2024 ఎన్నికల్లో అభ్యర్థించాను అయితే ఏకంగా 91,413 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిపించిన విషయాన్ని మరువలేను. అందుకే ఇక్కడి చేనేత సోదరులను తన కుటుంబసభ్యులుగా భావించి వారి సంక్షేమం శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నాను..' అని స్థానిక ఎమ్మెల్యే మంత్రి లోకేశ్ తెలిపారు. అంచనాలకు మించి అందించిన మెజారిటీతో వచ్చిన బలంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో పోరాడి మరీ మంగళగిరిలో 200కు పైగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. మంగళగిరిలో దశాబ్దాల నాటి నివేశన పట్టాల సమస్యను కేబినెట్‌లో పెట్టి పరిష్కరించడంతో పాటు మొత్తం రాష్ట్రానికి కూడా దానినో దిక్సూచిగా మలిచామన్నారు. మొదటి విడతలో రూ.వేయి కోట్ల భూమిపై 3 వేల కుటుంబాలకు హక్కులను కల్పిస్తూ వస్త్రాలు పెట్టి పట్టాల పంపిణీని అవినీతిరహితంగా పారదర్శకంగా నిర్వహించామని చెప్పడానికి తానెంతో గర్విస్తున్నానన్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలను తాను చేయగలుగుతున్నానంటే తనపైన, తమ కుటుంబంపైన మంగళగిరి ప్రజలు చూపిన ప్రేమాభిమానాలే కారణన్నారు. మంగళగిరికి చెందిన పద్మశాలీ నాయకులకు రాష్ట్రస్థాయి గుర్తింపునిచ్చేలా వారికి ఉన్నత పదవులనిచ్చి గౌరవించామన్నారు. గతంలో తాను ఓటమిపాలై ప్రతిపక్షంలో ఉన్నా మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం 26 రకాల పథకాలను సొంత ఖర్చులతో నిర్వహించానని గుర్తుచేశారు. మంగళగిరిలో వీవర్‌శాలను ఏర్పాటు చేయించి డిజైన్లు, లేటెస్ట్ మగ్గాలను చేనేత కళాకారులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో చేనేత సలహాదారు సుచిత్ర ఎల్లా, మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనూరాధ, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పూజా సామగ్రి కొనుగోళ్ల కోలాహలం

## మూర మల్లె.. రూ.60

- వరలక్ష్మీవ్రతంతో పూల ధరలకు రెక్కలు
- మార్కెట్లో శ్రావణ శుక్రవారం కొనుగోళ్ల సందడి

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూర మల్లె పూలు రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయం. బంతిపూలు రూ.20పై మాటే. శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో పూలు, పూజాసామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. పూజా సామగ్రి, పూలు, పండ్లతో పాటు అరటి మొద్దులు, మామిడి ఆకుల కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో నగర పరిధిలోని ఆయా విక్రయ కేంద్రాల వద్ద శ్రావణ మాస సందడి నెలకొన్నది. ప్రజలు పెద్దఎత్తున పూజా సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం నెలకొన్నది.



## రేపటి నుంచి శంకర్‌విలాస్ బ్రిడ్జి కూల్చివేత

### వివిధ మార్గాల్లో వాహన రాకపోకలు దారిమళ్లింపు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నూతనంగా ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత పనులు శనివారం నుంచి ప్రారంభించనున్నారు. దీంతో నగరంలోని పలు మార్గాల్లో వాహన రాకపోకలు దారి మళ్లిస్తున్నట్లు ఎస్పీ సతీష్‌కు మార్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ నివారణ కోసం తాత్కాలికంగా కొన్ని మార్గాలను ఎంపిక చేసి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు తెలిపారు. ఈ మళ్లింపులు శనివారం నుంచి అమలు చేస్తామన్నారు. ఈ క్రమంలో వాహన చోదకులు ముందుగానే తమ ప్రయాణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజల సౌకర్యార్థం తాత్కాలిక మార్గాలు రూపొందించినట్లు తెలిపారు.

**వాహనాల మళ్లింపు మార్గాలు..**

- అమరావతి రోడ్డు నుంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్ సెంటర్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డులో వెళ్లాలి.
- లాడ్జి సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వైపు వెళ్లే వాహనదారులు మూడు వంతెనలు లేదంటే కంకరగుంట ఫ్లైఓవర్ మార్గంలో ప్రయాణించాలి.
- మార్కెట్ సెంటర్ వైపు నుంచి లాడ్జి సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు, బస్సులు కంకరగుంట ఫ్లైఓవర్ మార్గాన్ని వినియోగించుకోవాలి.
- చంద్రమౌళినగర్, గార్డెన్స్ ప్రాంతాల నుంచి మార్కెట్ వైపు వెళ్లే వారు కంకరగుంట అండర్‌పాస్ నుంచి వెళ్లాలి.
- పట్టాభిపురం నుంచి జీజీహెచ్ వైపు వెళ్లే వారు కంకరగుంట ఫ్లైఓవర్, రమేష్ ఆస్పత్రి సెంటర్ మీదగా మహిళా కళాశాల, పల్లవి థియేటర్ మార్గాన్ని వినియోగించుకోవాలి.



## రూ.కోట్ల రోడ్డుకు మర్రిచెట్లు తూట్లు

- పెదరావూరు-తెనాలి రోడ్డు గోడలకు పగుళ్లు
- మంత్రి మనోహర్ చొరవ తీసుకోవాలంటోన్న ప్రజలు

తెనాలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గోడపై మొక్క మొలిచినప్పుడే తొలగిస్తే గోటితో పోయేది. కానీ ఆర్అండ్‌బీ నిర్లక్ష్యం మొక్క కాస్తా మానయింది. ఇలా ఒకటి, రెండు కాదు.. పదుల సంఖ్యలో చెట్లు పెరిగిపోయాయి. అవి నేలపై పెరిగితే సంతోషం. కానీ రూ.కోట్లు ఖర్చుపెట్టి రెండు కాల్వల మధ్య నిర్మించిన రోడ్డు గోడలపై పెరిగి, ఆ గోడలనే బద్దలు కొడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నాయి. తెనాలిలో తూర్పు, నిజాంపట్నం కాల్వల మధ్య నుంచి పెదరావూరు-నందివెలుగు రోడ్డు గతంలో సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ కష్టాలకు ముగింపు పలికేలా గతంలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర శాసన సభకు సభాపతిగా ఉన్న మనోహర్ ఈ రోడ్డును విస్తరించారు. ఈ క్రమంలో రోడ్డుకు రెండు వైపులా కాల్వల అంచుల వెంట గోడల నిర్మాణం చేపట్టి పెదరావూరు-ఆటోనగర్ మధ్య నాలుగు వరుసల రహదారి నిర్మించారు. అయితే రోడ్డుపై పడిన వర్షపు నీరు రెండు పక్కల ఉన్న కాల్వల్లోకి వెళ్లిపోయేలా పైపులు ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో అవి మట్టితో పూడిపోయి రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రోడ్డు దెబ్బతిన్నది. కూటమి ప్రభుత్వం వచ్చాక అతుకులు వేశారు. అయితే రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోడలపై మర్రి, రావి చెట్లు మొలకెత్తి అవికాస్తా మానులుగా మారాయి. ఇరువైపులా గోడలపై పెరిగిన చెట్లు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి. వారి నిర్లక్ష్యంతో గోడలను బద్దలుకొట్టి, రోడ్డును దెబ్బతీసేటంతగా ఆ చెట్లు వేళ్లూనుకుపోయాయి. రెండు పక్కల కాల్వలు ఉండటంతో ఈ నాలుగుల లైన్ల రహదారికి ఈ గోడలే ఆధారం. ఇవే దెబ్బతినిపోతే రోడ్డు దెబ్బతినడంతోపాటు, రోడ్డుకూడా విరిగిపడి, మట్టి కాల్వలను పూడ్చేసే ప్రమాదమూ ఉంది. మంత్రి మనోహర్ అయినా చొరవ చూపి, ఆ చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటే మరికొంత కాలం ఆ రోడ్డు పదిలంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



గోడలో చొచ్చుకుపోయిన చెట్లు



నిజాంపట్నం కాల్వవైపు రోడ్డు గోడపై పెరిగిన చెట్లు


**బస్సుల్లో పెరగనున్న..స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు**

- మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం
- పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు



6

**మిర్చి కాటా వేయగానే రైతు ఫోన్‌కి ఎస్ఎంఎస్**

- మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత






## స్వర్ణ తెర

యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సినీ థియేటర్లు

8

తెలుగు సినిమా స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు. చిత్ర ప్రదర్శనలో బ్లాక్ అండ్ వైట్ నుంచి.. అత్యాధునిక సాంకేతికత చూసిన థియేటర్లు. రీల్ ప్రొజెక్టర్..డాల్బీ అట్మాస్ వరకు ఆధునిక హంగులు అద్దుకుని కొనసాగుతున్న మహాళ్లు..పిక్చర్ ప్యాలెస్‌లు.. టాకీస్‌లు.. పైరసీలను, ఓటీటీ ప్లాట్‌ఫాంలను.. తట్టుకుని నేటికీ సింగిల్‌గా నిలబడిన సినిమా హాళ్లు. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు..) పూర్తి చేసుకుని శతమానం భవతి అంటూ సినీ ప్రియులను అలరిస్తున్న.. చరిత్రకు ఆనవాళ్లు.. ఎన్నో జ్ఞాపకాలు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ థియేటర్లపై ప్రత్యేక కథనం.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

- తెలుగు చిత్ర పరిశ్రమ గమనానికి ఆనవాళ్లు
- శతమానం భవతి అంటూ.. ఆధునిక హంగులు
- ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని సింగిల్‌గా నిలబడిన థియేటర్లు

## ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేస్తాం

● డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల అదనపు ఉపాధ్యాయులను సత్వరం సర్దుబాటు చేస్తామని డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సర్దుబాటు ఎప్పుడో కథనంపై ఆమె స్పందించారు. ఎంఈఓల ద్వారా అదనపు ఉపాధ్యాయులను గుర్తించి, అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామన్నారు.

## గోడు విన్నారు.. ఇంటి స్థల పట్టాను అందించారు

● మంత్రి మనోహర్ సత్వర సాయం



పట్టా అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు చేసిన పర్యటనలో బాధితుని గోడు విన్న మంత్రి నాదెండ్ల మనోహర్ సత్వర సాయం అందించడం పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూరల్ మండలం కొలకలూరు గతవారం పర్యటించిన ఆయన దృష్టికి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న జంపని నాగార్జునరావు పరిస్థితి తెలుసుకున్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను ఆదేశించి ఇళ్ల స్థల పట్టా సిద్ధం చేయాలని చెప్పారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇంటి పట్టా అందించారు. కనీసం స్థలం, ఇల్లు లేక బాధపడుతున్న కుటుంబాన్ని వెంటనే ఆదుకోవడం పట్ల గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# నాకు మాటిచ్చి.. వేరే వారికి అమ్మారు

● అడ్వాన్స్‌గా రూపాయి తీసుకోలేదు
● అందుకే వెంచర్‌లో సగం వాటా డిమాండ్ చేశా
● ఇందులో ఎమ్మెల్యే నరేంద్ర పాత్ర లేదు
● ఆయన అనుచరుడు మేడికొండూరు నరేష్



మాట్లాడుతున్న నరేష్

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ఈ నెల 3న ప్రచురితమైన 'వామ్మో.. ఆ ఎమ్మెల్యే.. దందాలతో దడ' వార్తలో భాగంగా సొంత పార్టీ ఎమ్మెల్యేకు సైతం తప్పని తిప్పలు అనే వార్తపై అనుచరుడు మేడికొండూరు నరేష్ యదార్థ సంఘటనలను చెబుతూ గురువారం వివరణ ఇచ్చారు. మద్దాళి రవి కిరణ్ కి చెందిన చేబ్రోలు మండలం, గ్రామంలోని 9 ఎకరాల 34 సెంట్లు మామిడి తోటను అమ్మకానికి పెట్టగా దాని గురించి తెలిసిన మధ్య వర్తి ద్వారా తాను కొనుగోలు చేసేందుకు సిద్ధపడి ఎకరం రూ.65 లక్షలు చొప్పున 75 రోజుల గడువు అడిగినట్లు తెలిపారు. దీంతో రవి కిరణ్ త్వరగా చేయించుకోవాలని, తనకు చాలా అవసరం ఉందని చెప్పగా.. గడువు 75 రోజులు పెట్టండి.. 40 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోగలనని తాను రవికిరణ్‌కి చెప్పినట్లు నరేష్ పేర్కొన్నాడు. అందుకు అతను అంగీకరించాడని, రవి కిరణ్‌కి అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇవ్వడానికి సిద్ధం కాగా తీసుకోలేదని, రిజిస్ట్రేషన్ రోజునే మొత్తం చెల్లించండని చెప్పారని తెలిపాడు. అగ్రిమెంట్ రాసుకుందామని తాను అడగ్గా.. తాను మాట మీద నిలబడే వ్యక్తిని అంటూ.. అగ్రిమెంట్ రాయలేదని నరేష్ తెలిపాడు. తాను కొన్ని రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ కోసం వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా అందుబాటులోకి రాలేదని వివరించాడు. ఆ సమయంలో తాను బయట నుంచి అధిక వడ్డీలకు డబ్బులు సమకూర్చుకుని, వారిని కలిసేందుకు ప్రయత్నించామని చెప్పాడు. రవికిరణ్ ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో మధ్యవర్తి ద్వారా మిల్లు వద్దకు వెళ్లగా.. తన మిత్రుడు తాత మరణించాడని, అక్కడ ఉండడటంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదంటూ సమాధానం ఇచ్చాడని చెప్పారు. రెండు రోజుల తర్వాత కలుద్దామని చెప్పి.. వారం రోజుల తర్వాత ఫోన్ చేయగా ఆ భూమిని గళ్ళా రామచంద్రరావుకు అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకున్నానని చెప్పినట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం కరెక్ట్ కాదని చెప్పినా వినిపించుకోలేదని, తాను కలిసిన విషయాన్ని రవికిరణ్ గళ్ళా రామచంద్రరావుకు తెలియజేయగా ఆయన ఎమ్మెల్యే నరేంద్ర దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. తాను ఆ భూమిని కొన్న విషయాన్ని తెలపగా... ఆ భూమిని నరేష్ కొనుగోలు చేస్తున్నట్లు గతంలో తనకు చెప్పాడని నరేంద్ర చెప్పినట్లు తెలిపాడు. అతను కూడా మన పార్టీ వ్యక్తే.. రామచంద్రరావు వద్దకు పంపుతానిని.. ఇద్దరూ కలిసి మాట్లాడుకోండి అని నరేంద్ర చెప్పటం జరిగిందని వివరించారు. ఆ తరువాత ఎమ్మెల్యే నరేంద్ర తనను గళ్ళా రామచంద్రరావును కలవమని చెప్పి, పార్టీ పరంగా తమ రిలేషన్ చెడకుండా వ్యాపార పరంగా విషయం సెటిల్ చేసుకోవాలని ఆయన సూచించినట్లు చెప్పాడు. తాను తరువాత ఎమ్మెల్యే మాధవి భర్త గళ్ళా రామచంద్రరావును కలవగా అయన మాట్లాడుతూ ఈ పొలానికి మొత్తం పెట్టుబడి నువ్వు పెడితే తాను.. తన కంపెనీ పేరు మీద మార్కెటింగ్ చేస్తానని, తనకు 50 శాతం ఇస్తాను.. లేకపోతే తాను 50 శాతం పెట్టుబడి పెడితే.. 20 శాతం లాభాలలో వాటా ఇస్తాను అని చెప్పారని తెలిపారు. ఇందుకు తాను అంగీకరించలేదని చెప్పాడు. ఇద్దరం చెరిసగం పెట్టుబడి పెట్టి లాభాలు సమానంగా పంచుకుందామని రామచంద్రరావుకు చెప్పానని, అందుకు రామచంద్రరావు అంగీకరించలేదని తెలిపాడు. ఆ తరువాత తనకు తెలియకుండా భూ యజమాని ద్వారా రామచంద్రరావు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నాడని చెప్పారు. తమ మధ్య నెలకొన్న ఈ వివాదాన్ని ఎమ్మెల్యే నరేంద్రకు అంటగట్టి బదనాం చేయడం తగదని నరేష్ పేర్కొన్నాడు.

### సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 588.50 అడుగులు ఉంది. ఇది 307.57 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5088, ఎడమ కాలువ ద్వారా 8541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 , ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,149 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,930 క్యూసెక్కుల చేరుతోంది.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 106, 114, 125 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 204.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 214.00 |

## విత్తన దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

● రూ.7.79 లక్షల వరి విత్తనాలు సీజ్

గుంటూరు సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లోని పొన్నూరు, తెనాలి విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ డి.సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాలతో జరిగిన ఈ దాడుల్లో రూ. 7.79 లక్షలు విలువ చేసే వరి విత్తనాలను సీజ్ చేశారు. తెనాలి పట్టణంలోని గాంధీనగర్, నందుల పేట, కవిరాజా పార్క్ సమీపంలోని వినాయక ఎంటర్‌ప్రైజెస్ విత్తన విక్రయ దుకాణంలో మొదటగా విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పలు లోపాలను గుర్తించారు. రాష్ట్రంలోని ప్రముఖ విత్తన సంస్థకు సంబంధించిన పేరుతో... తెలంగాణ నుంచి అనుమతులు లేకుండా తీసుకు వచ్చిన వరి విత్తనాలను గుర్తించారు. వాటి అమ్మకాలకు సరైన అనుమతులు లేవని ధ్రువీకరించి సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. పొన్నూరు పట్టణంలోని ఈనాడు సీడ్స్, శ్రీనివాస ట్రేడర్స్ విత్తనాల దుకాణాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించి అవే విత్తనాలను గుర్తించి సీజ్ చేశారు. విత్తనాల షాపుల యజమానులపై 6ఏ కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో గుంటూరు విజిలెన్స్ విభాగం నుంచి వ్యవసాయ అధికారి సి.హెచ్ ఆదినారాయణ, సీఐ లు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పి. శివాజీ, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన వ్యక్తికి..

## రూ. కోటి పరిహారం

● ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా ఫోరం ఆదేశం

గుంటూరు(లీగల్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడటం తో రెండు కాళ్లు కోల్పోయిన వ్యక్తికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ కింద కోటి రూపాయలు ప్రమాదం జరిగిన నాటి నుంచి 7 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, క్లెయిమ్ చెల్లించకుండా అతనికి కలిగించిన మానసిక వేదనకు నష్టపరిహారం కింద రూ.10 వేలు, కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.3వేలు అదనంగా చెల్లించాలని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీని జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం ఆదేశించింది. కమిషన్ చైర్మన్ కె. విజయలక్ష్మి, సభ్యుడు జి .పున్నారెడ్డి ఈ మేరకు తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే వినుకొండ విష్ణుకుండి నగర్‌కు చెందిన దేసు సీతారామాంజనేయులు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ. 37,772 చెల్లించి 2021 సెప్టెంబర్ 3న ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఈ పాలసీ 2022 సెప్టెంబర్ 2 వరకు అమలులో ఉంది. దీనికి ముందు కూడా అతను ఇదే విధమైన పాలసీ తీసుకున్నారు. 2021 అక్టోబర్ 5న రైలు ప్రమాదంలో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. గుంటూరులోని ఓ హాస్పిటల్ చికిత్స పొందిన అనంతరం సీతారామాంజనేయులు తన రెండు పాలసీల క్లెయిమ్ కోసం అర్జీ దాఖలు చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీ ముందు తీసుకున్న పాలసీకి మాత్రమే రూ. 74 లక్షలు చెల్లించింది. మొదటి పాలసీ విషయాన్ని దాచాడని చెప్పి రెండో పాలసీ మొత్తాన్ని చెల్లించేందుకు నిరాకరించింది. దీంతో సీతారామాంజనేయులు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశాడు.

## చేనేతకు.. చేయూత

(5వ పేజీ తరువాయి)

కొనుగోళ్లు ఆపేశారని, ముడి సరుకులపై సబ్సిడీని నిలిపివేశారన్నారు. తాము వాటన్నింటినీ పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ ఏడాది చేనేత పరిశ్రమ రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించిందని, చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందన్నారు. అయితే అది సరిపోదని ఆధునిక మార్కెట్‌ను సొంతం చేసుకునేలా నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. వినూత్న రీతుల్లో ఉత్పత్తులు తయారు చేయడం, మార్కెట్ సదుపాయాన్ని కల్పించడంపై చేనత సలహాదారుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. లోకేశ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న మంగళగిరిలో 'వీవర్‌శాల' ప్రయోగాత్మక నమూనా అన్నారు. టాటా, బిర్లా వంటి ప్రముఖ సంస్థలతో అనుసంధానం చేసుకుని చేనేత మార్కెట్ అవకాశాలను పెంచుకునే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, రాష్ట్రమంతటా అమలు చేస్తామన్నారు. వన్ ప్రాజెక్ట్ వన్ డిస్ట్రిక్ట్ పథకంలో రాష్ట్రానికి తొమ్మిది అవార్డులు వస్తే అందులో 3 అవార్డులు చేనేతకే రావడం చేనేతకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. అలాంటి చేనేతను సంరక్షించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామని తెలిపారు. చేనేత వస్త్ర ఉత్పత్తులను ఈ కామర్స్ పద్ధతిలో ఓఎన్‌డీసీ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు 2వేల రకాల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీ రిజిస్టర్ అయ్యాయని చెప్పారు. మంత్రి లోకేశ్ కోరినవిధంగా మంగళగిరిలో ప్రగడ కోటయ్య పార్కును ఏర్పాటు చేసి, అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ప్రగడ కోటయ్య పేరుతో వెంకటగిరిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ సంస్థకు ఆయన పేర నామకరణం చేశామన్నారు. రాష్ట్రంలోని 93 వేల చేనేత కుటుంబాల సంక్షేమానికి యాక్షన్‌ప్లాన్ తయారుచేసి దానిని త్రికరణశుద్ధిగా అమలుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

### అన్నింటా ఒక అడుగు ముందున్న లోకేశ్..

మంగళగిరి నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణతోపాటు, 2 వేల పనులు పూర్తి చేసిన లోకేశ్ అందరికంటే ఒక అడుగు ముందున్నారని సీఎం కొనియాడారు. 5 వేల ఓట్లతో ఓడిన చోటే.. తిరిగి 91 వేల ఓట్లతో గెలిచారన్నారు. తనను గెలిపించిన ప్రజల జీవితాల మెరుగుదలకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మంగళగిరిని నెంబర్ వన్‌గా చేయాలన్న ఆయన సంకల్పం కచ్చితంగా నెరవేరుతుందన్నారు.

### అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు, 5వ లైన్‌లో కొలువైన కోదండ రామాలయంలో శ్రావణ మాసోత్సవాలు సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం ఉన్న క్రీడలను కెరీర్‌గా మార్చుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. పోలీస్ పెరేడ్స్ గ్రౌండ్లో గురువారం నిర్వహించిన ఫ్రెండ్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల వైపు మొగ్గు చూపాలని సూచించారు. పదకొండేళ్లుగా ఫ్రెండ్స్ ప్రీమియర్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తోన్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను కేవలం చదువుల వైపే కాకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించాలని చెప్పారు.


నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

## బీపీ మండల్ ఆశయసాధన కోసం కృషి చేయాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల ఆశయ సాధన కోసం కృషి చేసిన బీపీ మండల్ ఆశయ సాధనకోసం బీసీ వర్గాల నాయకులు కృషి చేయాలని బీసీ సంఘాల నాయకులు బీఆర్ భగత్‌సింగ్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద గురువారం బీపీ మండల్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల్ చేసిన 40 సిఫార్సుల్లో వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యమాలు చేయకపోయినా ఓబీసీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు సిహెచ్ వాసు, ఉగ్గం సాంబశివరావు, దాసరి శివకుమార్, నరసింహారావు, నీదా సత్యనారాయణ, జూపూడి శ్రీనివాసరావు, విప్పర్ల ముత్తయ్య, రామారావు, జయసుధ, దండా వెంకటేశ్వర్లు, ఎన్ నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ గ్రీన్‌లో హోం కంపోస్ట్ తయారీని ప్రోత్సహిస్తాం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ప్రతి ఇంటిలో, అపార్ట్‌మెంట్లలో హోమ్ కంపోస్ట్, క్లస్టర్ కంపోస్ట్ తయారీ ప్రోత్సహిస్తామని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ప్రతినిధులతో మిషన్ గ్రీన్ గుంటూరుపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ హిత గుంటూరే లక్ష్యంగా గుంటూరు నగరపాలక సంస్థ మిషన్ గ్రీన్ గుంటూరు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో దశలవా


మిషన్ గ్రీన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

రీగా 5 లక్షల మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం పెంపు, పారిశుధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు తీసుకొబోతున్నామని తెలిపారు. గత ఏడాది కాలంలో పారిశుధ్య మెరుగుదలకు తీసుకున్న చర్యలు, ప్రజలు సహకరించినందు వలన గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ నగరాల సరసన నిలిచిందన్నారు. అపార్ట్‌మెంట్లలో ప్రధానంగా హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీ, మొక్కల పెంపకానికి ముందుకు రావాలని, అందుకు ఐటీసీ సహకారంతో తగిన అవగాహన కల్పిస్తామని తెలిపారు. కంపోస్ట్ తయారీ చేసే వారి ఆస్తి పన్నులో రాయితీని అందించడానికి ప్రభుత్వంలో ప్రతిపాదన ఉందన్నారు. సమావేశంలో ఐటీసీ ఫినిష్ మేనేజర్ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా సంబరాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు, డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వి కృష్ణవేణి మాట్లాడుతూ ఆగస్టు 15 వ తేదీ వరకు తిరంగా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం లక్ష్మీపురం ప్రధానదార్లో విద్యార్థులు తిరంగాను ప్రదర్శిస్తూ ప్రతి ఇంటికి జెండాను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 18 తేదీల్లో గుంటూరులో జరిగే సీపీఐ జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో గోడపత్రికలను ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. 17న మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి కొత్తపేట, విజయా టాకీస్ వరకు భారీ ర్యాలీ, అనంతరం అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న మల్లయ్య లింగం భవన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు, నూతలపాటి చిన్నా, చల్లా మరియదాసు, లక్ష్మి, దూపాటి రత్నం పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా జావలిన్ త్రో మీట్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ జావలిన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బీఆర్ స్టేడియంలో గురువారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జరిగిన జావలిన్ త్రో మీట్ ఉత్సాహభరితంగా సాగింది. పోటీలను అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిలేషయ్య ప్రారంభించారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో జరిగిన పోటీలకు జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు సర్టిఫికెట్స్, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రవి, కే రాజు, సుబ్రహ్మణ్యం, చిన్నారావు పాల్గొన్నారు. విజేతల వివరాలు.. అండర్ 14 విభాగంలో... మహబూబ్ బాషా, అబ్దుల్ మునిఫ్, దీపక్, ఎండి కరిష్మా, కే సౌమ్య, ఆర్ సారిక అంజలి. అండర్-16 విభాగంలో.. హరి వెంకటఅఖిల్, ఎస్ కే ముజ్బర్ ఉస్మాన్, శ్రీనివాస్, శోభిత, నాగచైత్ర, నమ్రత. అండర్-18 విభాగంలో.. కే వెంకట వసంత చరణ్, ఎస్ అంజి బాబు, సిహెచ్ షణ్ముఖ, రావులిక పాత్ర, ఎండి ఆసియా. అండర్ 20 విభాగంలో.. జి.భూపతి, ఎస్.మంజునాథ్, రాఘవేంద్ర, డి.బోలానాథ్, ఎస్కే షాజహాన్, బీఎం నేహా, జీ శైలజ. పారా విభాగంలో: పి.తన్మైశ్రీ గెలుపొందారు.


సర్టిఫికెట్స్, పతకాలతో క్రీడాకారులు, కోచ్‌లు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కామేశ్వరశాస్త్రి తదితరులు

### జిల్లా స్థాయి పోటీలకు
## టీజేపీఎస్ విద్యార్థులు ఎంపిక

గుంటూరు(విద్య),ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజేపీఎస్ కళాశాలలో గురువారం నిర్వహించిన అండర్ 22 పురుషులు, మహిళలకు నిర్వహించిన జిల్లా స్థాయి ఖో ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కామేశ్వర శాస్త్రి తెలిపారు. ఖో ఖో క్రీడలో బీ వెంకట రామయ్య, బీ నరేంద్ర, తేజ, వాలీబాల్‌లో కౌషిక్, రాకేష్, శివగోపి, కార్తికేయ, ఇసాక్, ఎస్కే పర్వీన్, అథ్లెటిక్స్‌లో జీవీవీ నాని జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు శ్యాం సుందర్, కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఏ భానుమురళి, వ్యాయామ అధ్యాపకులు టి.వాసుదేవరావు, ఇంటర్మీడియట్ ఇన్‌చార్జ్ జి సురేష్ కుమార్, గుంటూరు జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ సుధీర్ కుమార్, కోచ్ ఆర్ శివాజి అభినందించారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా ఆటోనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని లారీ స్టాండ్, ఎస్‌వీఆర్ కంపెనీ వాటర్ వర్క్స్ ఏరియాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.




విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

### విద్యార్థులు కష్టపడి చదివి
## ఉన్నత స్థాయికి చేరాలి

● ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ సూచించారు. ఈ మేరకు గురువారం పవర్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో "పిల్లలు-సెల్‌ఫోన్ ప్రభావం.. మత్తు పదార్థాలకు దూరంగా.." అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. లాలాపేట ఎస్సై షేక్ హసీమ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. మహిళా ఎస్సై ప్రవీణా మాట్లాడుతూ జీవితంలో చెడు అనుభవాల వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్ రామకృష్ణ, అయూబ్, టీచర్ల బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### 7 కోట్లు కొల్లగొట్టా..
## రూ.4.5 కోట్లతో అప్పులు తీర్చా

● పోలీస్ కస్టడీలో సైబర్ నిందితుడు సూర్యప్రకాష్‌రెడ్డి

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల ద్వారా సంపాదించింది ఏడు కోట్లేనని అందులో రూ.4.5 కోట్లతో అప్పులు తీర్చానని సైబర్ కేసులో అరెస్టు అయిన ప్రధాన నిందితుడు సూర్యప్రకాష్‌రెడ్డి పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. సైబర్ కేసులో అరెస్ట్ చేసిన నిందితులను అరండల్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. వారి కస్టడీ గురువారంతో ముగిసింది. అయితే నిందితుడైన నల్లచెరువుకు చెందిన సూర్యప్రకాష్‌రెడ్డి పదో తరగతి వరకు మాత్రమే చదివినా సైబర్ నేరాల్లో ఆరితేరాడు. ఈ కేసులో మిగిలిన నిందితులైన విష్ణువర్దన్, సుధాకర్ అనే ఇరువురు ద్వారా అమాయకులతో బ్యాంక్ ఖాతాలు తెరిపించి వాటి ద్వారా దుబాయ్ కేంద్రంగా సైబర్ మోసాలకు తెరలేపాడు. ప్రజలకు వివిధ రకాలుగా ఆశచూపి కాజేసిన నగదును తాను సేకరించిన అమాయకుల ఖాతాలకు మళ్లించి ఆ తర్వాత తనకు సంబంధించిన ఖాతాలకు డబ్బు బదిలీ చేసి విత్‌డ్రా చేసుకునేవాడు. ఇలా సూర్యప్రకాష్‌రెడ్డి రూ.కోట్లలో కొల్లగొట్టి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళదాస్‌నగర్‌కు చెందిన విష్ణువర్థన్ గతంలో మొబైల్‌షాపులో పని చేసేవాడని, మరో నిందితుడైన నల్లచెరువుకు చెందిన సుధాకర్ మొదటి నుంచి సూర్యప్రకాష్‌రెడ్డితో సన్నిహితంగా ఉంటుండేవాడు. సూర్యప్రకాష్‌రెడ్డి పూర్తి వివరాలు చెప్పలేదని, ఇంకా లోతుగా విచారించాల్సి ఉందని మరోసారి కస్టడీకి తీసుకోవాల్సి ఉంటుందని పోలీసులు అంటున్నారు. ఈ కేసులో మరో నిందితుడైన నేపాల్‌కు చెందిన విశాల్ గేమింగ్ యాప్ సృష్టించి పెద్ద మొత్తంలో నగదు కాజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ యాప్ చైనాతో లింక్ ఉన్నట్లు పోలీసులు అంటున్నారు. ఈ ముఠా వెనుక ఎవరైనా ప్రముఖుల పాత్ర ఉండవచ్చనే అనుమానాలు బలంగా వస్తున్నాయి.

## సెంట్రల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌కం టాక్స్ కార్యాలయానికి సంబంధించిన అపార్ట్‌మెంట్‌లో సెంట్రల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కామర్తి శ్రీధర్ (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ నజీర్‌బేగ్ కథనం మేరకు.. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన శ్రీధర్ నగరంపాలెం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రీజనల్ ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్యతో కలసి గోరంట్లలో ఉంటున్నాడు. శ్రీధర్ గురువారం బ్యాంక్‌కు వచ్చాడు. బ్యాంక్ ఎదురుగా ఉన్న ఇన్‌కంటాక్స్ ఆఫీసుకు చెందిన రిక్రియేషన్ హాల్లో ఒక గదిలోకి వెళ్ళి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. భార్య ఫిర్యాదుమేరకు నగరంపాలెం ఎస్సై ప్రసన్నకుమార్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.

## కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు తులసీ సీడ్స్ చేయూత



క్రీడా పరికరాలు అందజేస్తున్న తులసీ రామచంద్రప్రభు, మనవడు ఆదిత్య చంద్ర తదితరులు

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు తులసీ గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు చేయూతనందించారు. తులసీ రామచంద్రప్రభు, మనుమడు ఆదిత్యచంద్ర కలసి రూ.70వేల విలువైన బాక్సింగ్ కిట్స్ గురువారం అరండల్‌పేటలోని కార్యాలయంలో అందజేశారు. విశాఖపట్నంలో ఈనెల 10న జరగబోయే ఆంధ్ర రాష్ట్ర కిక్ బాక్సింగ్ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు ఈ క్రీడా పరికరాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కిక్ బాక్సింగ్ కోసం బాగా కష్టపడి, ఉన్నతమైన శిక్షణ తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని తులసీ రామచంద్రప్రభు కోరారు. తనకు కూడా టెన్నిస్, కబడ్డీ, ఖోఖో ఆటలలో ప్రావీణ్యం ఉన్నదని తెలియజేశారు. అనంతరం ఏషియన్ కిక్ బాక్సింగ్ స్పోర్ట్స్ క్లబ్ - గుంటూరు కోచ్, అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ రిఫరీ చెన్న పవన్‌కుమార్‌కి కిట్స్ మొత్తాన్ని అందజేశారు. ఈ కిట్స్ అందుకున్న వారందరూ నిత్యం కూలి పని చేసుకునే పేదవారని, అందువలననే తులసి సీడ్స్ ఈ ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్‌లో గుంటూరు జిల్లాకే కాకుండా దేశానికి కూడా మంచి పేరు ప్రతిష్టలు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి రమేష్, ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్ యాసం కోటి నాగబాబు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హరిత విప్లవ మార్గదర్శి ఎంఎస్ స్వామినాథన్


స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశ వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మక మలుపు తిప్పిన దార్శనికుడు ఎంఎస్ స్వామినాథన్ అని జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మన్నె సుబ్బారావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పద్మావతి కళ్యాణవేదికపై గురువారం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన్నె సుబ్బారావు ప్రసంగిస్తూ హరిత విప్లవంపై ప్రణాళికలు, కృషి క్షేత్రాన్ని ఆధునికీకరించడంలో స్వామినాథన్ మహత్వపూర్ణ పాత్రను ప్రదర్శించారన్నారు. తొలుత ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు.

## ఆర్‌పీఎఫ్ ఏఎస్‌సీ శైలేష్‌కుమార్‌కు రాష్ట్ర చిహ్నం


ఆర్‌పీఎఫ్ ఏఎస్‌సీ శైలేష్‌కుమార్‌కు రాష్ట్ర చిహ్నం ధరింపచేస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షక దళం(ఆర్‌పీఎఫ్)లో ఎనిమది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొన్న అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బీ శైలేష్‌కుమార్‌కు రాష్ట్ర చిహ్నం ధరించేందుకు అర్హత లభించింది. దీంతో గురువారం డీఆర్‌ఎం సుధేష్ణ సేన్, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మధుసూదనరావు పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో శైలేష్ కుమార్‌కు రాష్ట్ర చిహ్నం(అశోకన్ కేపిటల్)ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మాట్లాడుతూ ఈ చిహ్నం విధి నిర్వహణల్లో అంకితభావం, సేవని ప్రతిబింబిస్తుందన్నారు. శైలేష్ కుమార్‌కు సర్వీసులో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు.

## చదవడం ఇష్టంలేక డిప్లొమో విద్యార్థి అదృశ్యం

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చదవడం ఇష్టం లేక డిప్లొమో చదువుతోన్న సంజీవయ్య నగర్ రెండోలైన్‌కు చెందిన కొదమల మనోజ్‌బాబు (16) అదృశ్యమయ్యాడు. వడ్లమూడిలోని లారా ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమో చదువుతున్న మనోజ్ తనకు చదువుసరిగా రావడంలేదని కొంత కాలంగా బాధపడుతుండేవాడు. గురువారం మనోజ్‌ను కాలేజి బస్సు ఎక్కించేందుకు తండ్రి రాజేంద్రప్రసాద్ కొత్తపేటలోని భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ వద్ద దించగా ఆ తరువాత మనోజ్ ఎటో వెళ్ళిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మనోజ్ ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట సీఐ వీరయ్య చౌదరికి 8688831320లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## వృద్ధురాలి మృతి కేసులో నిందితురాలి అరెస్ట్

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మృతికి కారణమైన కేసులో నిందితురాలైన త్రివేణిని గురువారం పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేసారు. రెండురోజుల క్రితం గుజ్జనగుండ్లకు చెందిన ఆకుల అంజమ్మ ను కొట్టడంతో ఆమె మృతి చెందారు. ఈ కేసులో నిందితురాలైన త్రివేణిని గురువారం అరెస్ట్ చేసినట్లు పట్టాభిపురం పోలీసులు తెలిపారు.

## ఆర్వోబీలు, రైల్వేగేటు నిర్మాణాలతో ట్రాఫిక్ సమస్యకు చెక్

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్


ట్రాఫిక్ సమస్యలను అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో వరద ముంపు, ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన రైల్వే, మునిసిపల్ అధికారులతో కలిసి సంజీవయ్యనగర్, నెహ్రూనగర్, మొండిగేటు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్వోబీలు, డబల్ గేటు నిర్మాణం, రైల్వేగేటు ఎక్స్‌టెన్షన్ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. స్థానిక పరిస్థితులను అంచనావేసి ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సంజీవయ్య నగర్ రైల్వేగేటు ఆర్వోబీ మంజూరైన నేపథ్యంలో నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెహ్రూనగర్ రైల్వే గేటు డబుల్ లైనుగా విస్తరించాలని రైల్వే అధికారులను కోరారు. అనంతరం సీతానగర్ గేటు ఎక్స్ టెన్షన్ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మొండిగేటు వద్ద అదనపు వెంట్ వే నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి సైమన్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు స్పందించే ముందు ఆలోచించాలి

● సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ


మాట్లాడుతున్న డీఎస్పీ భానోదయ

వట్టిచెరుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దురాశ దుఃఖానికి చేటంటారు. రోజురోజుకు సైబర్ నేరగాళ్ళు పలు రకాల ఆశలు చూపే, చేసే మెసేజ్‌లపై ప్రతి ఒక్కరు ప్రశాంతంగా ఆలోచిస్తే సైబర్ నేరగాళ్ళ బారినపడకుండా మనల్ని మనం రక్షించుకోగలుగుతామని సౌత్‌జోన్ డీఎస్పీ భానోదయ సూచించారు. మండలంలోని వింజనంపాడు కిట్స్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైబర్‌క్రైమ్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన ద్వారానే సైబర్ మోసగాళ్ళ బారినపడకుండా ఉంటారన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అకారణంగా ఏ బ్యాంకు కార్డులు బ్లాక్ చేయదని, ఎవరైనా కార్డు వివరాలు అడిగితే అది నకిలీ కాల్ అని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, కార్యదర్శి కోయ శేఖర్, ప్రిన్సిపాల్ బాబు, అకడమిక్ డైరెక్టర్ హరిబాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శిశువు ఎదుగుదలకు, ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. గురువారం పెదపలకలూరు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ వరప్రసాదు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ పుట్టిన గంటలోపు పట్టించాలన్నారు. ఐటిసి అధికారి పి.శైలజ మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించాలంటే తల్లులు ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, బాలింతలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

### రామ ప్రతిష్ఠతో... మురిసిన ప్రపంచం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామప్రతిష్ఠకు ప్రపంచమంతా మురిసిందని డాక్టర్ డీఎన్ దీక్షిత్ అన్నారు. స్థానిక ఏటీ అగ్రహారం, గాయత్రీ మాతా మందిరంలో సంస్కృత సప్తాహం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్కృత భారతీ నగర అధ్యక్షుడు కిడాంబి దేవరాజన్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా రామాయణం-ప్రజాపాలనపై దీక్షిత్ ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ జన్నాభట్ల ఉమా, సంస్కృత భారతీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్వర్ణ తెర

అలంకార్ టాకీస్, సురేష్ మహల్, బాలాజీ పిక్చర్స్, స్వరాజ్ థియేటర్.. తెలుగు చిత్ర పరిశ్రమ స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు ఇవి. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు) పూర్తి చేసుకుని..శతమానం భవతి అంటూ కొనసాగుతున్న సింగిల్ థియేటర్లు. కొండవీటి సింహం నుంచి దేవర వరకు.. ప్రేమాభిషేకం నుంచి తండేల్ వరకు.. పసివాడి ప్రాణం నుంచి..గేమ్ ఛేంజర్ వరకు హీరో తెరమీద కనపడగానే.. ప్రేక్షకులు వేసిన విజిల్స్, చప్పట్లు ఇంకా ఇక్కడ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. నేల టిక్కెట్ నుంచి సోఫా సీటు వరకు.. రీల్ ప్రాజెక్టర్ నుంచి శాటిలైట్ డిజిటల్ ప్రాజెక్టర్ వరకు.. తెలుగు సినిమా గమనానికి ఇవి నిదర్శనం. కాలానుగుణంగా ఆధునిక హంగులు అద్దుకుంటూ సినీ ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. ఒక్కో సినిమా హాలుది ఒక్కో చరిత్ర, జ్ఞాపకం. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నవీ ఉన్నాయి. పైరసీల బెడద.. మల్టీప్లెక్స్‌ల పోటీ తట్టుకుని నిలబడి సింగిల్ థియేటర్లకు ఆనవాళ్లుగా కొన్ని మిగిలిపోతే.. కాల గర్భంలో కలిసి పోయినవి మరెన్నో. తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు కళ్లు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రాలను నేల టిక్కెట్‌పై చూసిన వాళ్లు.. జూ.ఎన్టీఆర్, నాగచైతన్య సినిమాలను అత్యాధునిక సాకర్యాలతో.. ఇవే థియేటర్లలో చూశారు.

- 50 ఏళ్లు దాటిన సిల్వర్ స్క్రీన్ థియేటర్లు
- తెలుగు సినిమా గమనానికి ఆనవాళ్లు..
- రీల్స్ నుంచి శాటిలైట్ ప్రదర్శన వరకు..
- నేల టిక్కెట్ నుంచి..ఆధునిక హంగులద్దుకుని..
- సినీ ప్రియులకు ఎన్నో జ్ఞాపకాలు

## ఎనిమిది దశాబ్దాలు.. 14న కూలీతో పునః ప్రారంభం

గుంటూరు మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఎనిమిది దశాబ్దాలుగా అలరిస్తోంది శ్రీ సరస్వతి పిక్చర్ ప్యాలెస్. స్వాతంత్ర్యం పొందిన మూడేళ్లకు.. 1950లో వాసిరెడ్డి పార్థసారథి ప్రసాద్ ఈ థియేటర్‌ను నిర్మించారు. 1989లో డాక్టర్ త్రిపురనేని రాధాకృష్ణ ఈ థియేటర్ కొనుగోలు చేశారు. ఇటీవల జిల్లాలో మొట్ట మొదటిసారిగా లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఈ థియేటర్‌ను ఆధునీకరించారు. 385 సీట్ల కెపాసిటీ గల ఈ థియేటర్‌ను ఈ నెల 14న రజనీకాంత్ నటించిన కూలీ సినిమాతో పునఃప్రారంభిస్తున్నారు. ప్రేమ్ నగర్ సినిమా అద్భుతమైన కలెక్షన్లతో 175 రోజుల పాటు ఇక్కడ ప్రదర్శితం కావడంతో దివంగత నిర్మాత డి.రామానాయుడుకి ఈ హాలు అంటే ప్రత్యేక అభిమానం. దాదాపు 18 ఏళ్లపాటు సురేష్ ప్రొడక్షన్స్ ఈ హాలును లీజుకు తీసుకుంది.

## చరిత్రకు సాక్ష్యం నాజ్

గుంటూరు (తూర్పు) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాజ్ థియేటర్లు ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతం.. నాజ్ సెంటర్‌గా మారింది. 1958 జనవరి 11న జమున, షైనావతి, శివాజీ గణేషన్ నటించిన బొమ్మల పెళ్లి చిత్రంతో ఈ థియేటర్ల ప్రస్థానం మొదలైంది. నాటి ఎంపీ కొత్త రఘురామయ్య దీనిని ప్రారంభించారు. 1,547 సీటింగ్ సామర్థ్యం తో రూ.25 పైసల టికెట్ తో ప్రారంభమైంది. 1965లో నాజ్ థియేటర్ పై నాజ్ లిటిల్ బిగ్ పేరుతో రాష్ట్రంలోని తొలి ఏసీ సౌకర్యంతో మరో థియేటర్‌ను నిర్మించారు. నాజ్ లిటిల్ బిగ్ ఆ తర్వాత నాజ్ అప్సరగా మార్చారు. సురేష్ ప్రొడక్షన్ తొలి సినిమా అనురాగం ఈ థియేటర్లోనే ప్రదర్శించారు. వీటితోపాటు ఎన్టీ రామారావు నటించిన రాముడు భీముడు, కోడలు దిద్దిన కాపురం, దానవీరశూరకర్ణతో పాటు అనేక మహత్తర దృశ్య కావ్యాలకు ఈ థియేటర్ సాక్షిగా నిలిచింది. 1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. అప్పటి మంత్రి చేబ్రోలు హనుమయ్యతో కలిసి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేగాక షూటింగ్ నిమిత్తం వచ్చే నటి, నటులకు ఈ థియేటర్లోనే బస ఏర్పాటు చేసేవారు. చాలా మంది సినీ ప్రముఖులు ఇక్కడ చిత్రాలను వీక్షించారు. దానవీరశూరకర్ణ సినిమాని రోజుకు ఆరు షోలను ప్రదర్శించారు. ప్రస్తుతం 700 సీట్లతో ఆధునికీకరించి.. టిక్కెట్ ధర ప్రస్తుతం రూ.250కు చేరింది. ఇప్పటివరకు నాజ్ థియేటర్లో చిరంజీవి నటించిన ఇంద్ర సినిమా, నాజ్ అప్సరలో టీకృష్ణ దర్శకత్వం వహించిన నేటి భారతం 175 రోజులు ప్రదర్శించారు. 2018 తర్వాత ఏ ఒక్క సినిమా కూడా 100 రోజులు ఆడలేదని యాజమాన్యం చెబుతోంది.



నాజ్ థియేటర్

## ● సరికొత్తగా..

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని శ్రీనివాస మహల్‌కు 45 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఈ థియేటర్‌లో వంద రోజులు ఆడిన సినిమాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కాలక్రమేణ నూతన హంగులను సంతరించ కుంది. కానీ, ఈ థియేటర్ పక్కనే ఉన్న అలంకార్, అన్నపూర్ణ థియేటర్లు శిథిలావస్థకు చేరి మూతపడ్డాయి.



## ● ఐదు దశాబ్దాల ఆనవాళ్లు..

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె పట్టణంలో ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన కృష్ణా టాకీస్, రాజ్యలక్ష్మీ థియేటర్లు.. ఐదేళ్ల క్రితం.. డీటీఎస్, ఏసీ సౌకర్యాలు పొందాయి. నేల, బెంచి, కుర్చీ, బాల్కని నాలుగు కేటగిరిలుగా ఉన్న ఇవి.. రెండు విభాగాలు మార్చి ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. కృష్ణా టాకీస్ థియేటర్ ఉన్న ప్రాంతం.. కృష్ణాటాకీస్ సెంటర్‌గా స్థిరపడింది. ఒకప్పుడు ఈ థియేటర్లలో.. వందల సినిమాలు వంద రోజులు ఆడాయి.


కృష్ణా థియేటర్



రాజ్యలక్ష్మీథియేటర్

## ● 60 ఏళ్ల నుంచి బొమ్మ పడుతోంది

తెనాలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్యారిస్ తెనాలి.. కళలకు పుట్టినిల్లు. సూపర్ స్టార్ కృష్ణ నుంచి ఎంతో మంది సినీ స్టార్లు ఇక్కడి నుంచి పుట్టుకొచ్చినవారే. వారు నటించిన సినిమాలు అండించేందుకు థియేటర్లకూ ఇక్కడ కొదవ లేదు. తెనాలిలో గెయిటీ, అలంకార్, స్వరాజ్, వీనస్, వెంకటేశ్వర, పెమ్మసాని, లక్ష్మి, శ్రీలక్ష్మి, ఆషా, ప్రియ, శ్రీప్రియ, సంగమేశ్వర, మినీ సంగమేస్వర వంటి థియేటర్‌లు గత 80 ఏళ్లగా కొనసాగుతూ వచ్చాయి. డిజిటల్ యుగంలో.. పైరసీలతో విసిగిపోయి, లాభాలు లేక కొన్ని థియేటర్లు కనుమరుగయ్యాయి. స్వరాజ్, వేద, వీనస్, వెంకటేశ్వర, రత్న థియేటర్‌లు వాణిజ్య కేంద్రాలుగా మారిపోయాయి. రత్న, వెంకటేశ్వర థియేటర్‌లు స్వాతంత్ర్యానికి ముందే ప్రారంభమైతే.., స్వరాజ్ మాత్రం 1948లో ప్రారంభించారు. స్వాతంత్ర్యం రావడంతో ఈ థియేటర్‌కు స్వరాజ్ అని పేరుపెట్టారు. ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ పేరుపై అప్పట్లో నిర్మించిన రామకృష్ణ థియేటర్‌ను ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తండ్రి కొనుగోలు చేసి, దానికి పెమ్మసాని థియేటర్‌గా పేరు మార్చారు.

### అలంకార్, గెయిటీ

అలంకార్, గెయిటీ థియేటర్లు.. ఎన్టీఆర్, ఏఎన్నార్ సినిమాలకు ప్రత్యేకం. అలంకార్ థియేటర్‌ను 1964లో బండ్ల పుల్లయ్య నిర్మించారు. భక్తకన్నప్ప, కృష్ణవేణి, చిక్కడు దొరకడు, ఎన్టీఆర్ కథా నాయకుడు, పరమానందయ్య శిష్యుల కథ వంటి పాత చిత్రాల నుంచి భైరవద్వీపం, పసివాడి ప్రాణం, యమలీల, సంఘర్షణ వంటి చిత్రాలు శత దినోత్సవాలు జరుపుకున్నాయి. గెయిటీ థియేటర్‌ను 1965లో ప్రారంభించారు. సుబ్బారావు, రంగారావు అనే సోదరులు దీనిని నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం వీరయ్యచౌదరి దీని నిర్వహణ చూస్తున్నారు. ఎన్టీఆర్, బాలకృష్ణ సినిమాలు ఎక్కువగా ఆడేవని వివరించారు. సమరసింహారెడ్డి 180 రోజులు అడితే, నరసింహనాయుడు సినిమా 175 రోజులు ఆడింది. పెద్దన్నయ్య, వేటగాడు, వంటి సినిమాలు 100 రోజులు ఆడాయి.


గెయిటీ థియేటర్

## ● స్వాతంత్ర్యం గుర్తులు..

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో 1947లో గ్రామానికి చెందిన మజ్జి కోటయ్య జైహింద్ టాకీస్ ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం.. ఈ స్థలంలో స్వాతంత్ర సమర యోధులు సమావేశమయ్యేవారని.. దానికి గుర్తుగా ఈ థియేటర్‌కు జైహిందు అని పెట్టారు. చుట్టు పక్కల మండలాలకు అప్పట్లో ఇదొక్కటే థియేటర్. సీనియర్ ఎన్టీఆర్ నటించిన కొండ వీటి సింహం 100 షోలు పూర్తిచేసుకుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు 60 షోలు, అక్కినేని నాగేశ్వరరావు నటించిన ప్రేమాభిషేకం 50 షోలు ప్రదర్శింపబడ్డాయి. ఇప్పుడు డాల్బీ అట్మాస్‌గా అప్డేట్ అయ్యింది. గుళ్ళపల్లి గ్రామంలో తాతా నారాయణమూర్తి, గుర్రం కుటుంబరావు, కాటూరి నాగమల్లేశ్వరరావు, పువ్వాడ వీరకుమారి భాగస్వామ్యంతో 1972లో బాలాజీ పిక్చర్ ప్యాలెస్‌ను ప్రారంభించారు. ఎన్టీఆర్ శ్రీకృష్ణ సత్య తులాభారం.. 50 రోజులు ప్రదర్శింపబడింది. మెగాస్టార్ చిరంజీవి ఇంద్ర సినిమా 60 రోజులు ప్రదర్శింపబడింది. ఏసీ థియేటర్‌గా దీనిని మార్చారు.



జైహింద్‌టాకీస్

## ● 60 ఏళ్ల నుంచి..అధునాత హంగులతో..

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చీరాల్లో పదికి పైగా సినిమా థియేటర్స్ ఉండేవి. ప్రస్తుతం నాలుగు థియేటర్లు మాత్రమే నడుస్తున్నాయి. వీటిల్లో మోహన్ థియేటర్ 1956లో ప్రారంభమైంది. ఇందులో అక్కినేని నాగేశ్వరరావు రోజులు మారాయి చిత్రం అత్యధికంగా 156 రోజులు ఆడిన మొట్ట మొదటి చిత్రంగా చరిత్ర సృష్టించింది. అనంతరం ముత్యాల ముగ్గు, నాగార్జున నటించిన హలో బ్రదర్, అర్జున్ నటించిన ఒకే ఒక్కడు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి ప్రేక్షాదరణ పొందాయి. అలాగే చీరాల్లో శాంతి థియేటర్ 1967లో ప్రారంభమై దేవుడు చేసిన మనుషులు, నువ్వు నాకు నచ్చావ్, లక్ష్మీనరసింహా, దేశముదురు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి అందరినీ అలరించాయి. టెక్నాలజీని అందిపుచ్చుకుని నేటికీ నూతన హంగులతో ప్రేక్షకులతో ఈ థియేటర్లు సందడి చేస్తున్నాయి.



శాంతి థియేటర్

## ● సినీ వైభవానికి మహళ్లు..

వినుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న అరుణ హాలు 64 ఏళ్లు పూర్తి చేసుకుంది. నూతన హంగులతో సినీ ప్రేక్షకులను ఇప్పటికీ అలరిస్తోంది. ఈ థియేటర్‌లో నర్తనశాల 50, ప్రేమాభిషేకం 50 రోజులు రెగ్యులర్ షోస్.. నూన్ షోస్‌తో 100 రోజులు పూర్తి చేసుకున్నాయి. అలాగే పట్టణంలోని సురేష్ మహల్ 1975లో సోగ్గాడు సినిమాతో ప్రారంభమైంది. 50 ఏళ్ల క్రితం తెర బొమ్మలతో మొదలై 70ఎంఎం రీల్స్, నేడు యూఎఫ్‌వో, క్యూబ్ (శాటిలైట్) ద్వారా సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. ఈ రెండు థియేటర్లలో.. డీటీఎస్‌తో నేటి యువత విజిల్స్ వేసేలా సినిమాలు ఆడుతున్నాయి.



అరుణ హాల్

---

బస్సుల్లో పెరగనున్న..

మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం

# స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు


ఫుట్ బోర్డు పనులు ,


ఫుట్ బోర్డు మధ్యలో ఐరన్ పైపులు


అత్యవసర ద్వారం


హ్యాండిల్ స్లింగ్స్

- పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు
- బస్టాండ్లలోనూ.. అదనపు హంగులు.
- మహిళల రద్దీకి అనుగుణంగా చర్యలు

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని స్త్రీ శక్తి పథకం పేరుతో.. ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా ఆర్టీసీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ముఖ్యంగా ఉచిత ప్రయాణంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నగరంలోని మెట్రో, ఆర్డినరీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించింది. మరో వారం రోజుల్లో స్వాతంత్ర దినోత్సవం రోజు నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు.. సంబంధించి ఇప్పటికే నెల్లూరు జోన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ, జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి గుంటూరులో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పథకం ప్రారంభ దశలో మహిళలు పెద్ద ఎత్తున బస్టాండ్‌లకు చేరుకుంటారని, బస్సుల్లో రాకపోకలకు కూడా ఇప్పుడున్న రద్దీకి 20 నుంచి 30 శాతం అదనంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోలలో 403 సర్వీసులుండగా ఇందులో 275 పల్లె వెలుగు సర్వీసుంటాయని ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ఇప్పటికే 80 రూట్లలో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా రాకపోకలు సాగిస్తుండగా ఇకపై కళాశాలల విద్యార్థునుల కోసం కూడా అదనపు ట్రిప్పులను నడుపుతామన్నారు. అలానే బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి డిపోల్లోనూ 253 సర్వీసుల్లో 212 పల్లె వెలుగు సర్వీసులు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. మహిళల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న సామ్రాజ్యం గుంటూరు ఇన్‌చార్జి డీపీటీవో కూడా కావటంతో ఆమె రెండు జిల్లాల్లోనూ ఆపరేషన్ వ్యవహారాలను పర్యవేక్షించడం తలకుమించిన భారంగా మారిందన్న వాదన వినిపిస్తోంది.

### పల్లె వెలుగు బస్సులకు అదనపు ఏర్పాట్లు

ముఖ్యంగా పల్లెవెలుగు బస్సుల్లో మహిళల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సు ఫుట్ బోర్డును విస్తరించి , మెట్లు జారకుండా గ్రిప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కే సమయంలో చేతులు పట్టుకునేలా మెట్ల మధ్యలో రాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలానే బస్సులో మహిళలు నిల్చొని పట్టుకునేలా హ్యాండ్ స్లింగ్స్ అందుబాటులోకి తెస్తున్నారు. మరో వైపు విపత్కర పరిస్థితుల్లో ప్రమాదం నుంచి బయటపడేలా ఎమర్జెన్సీ డోర్‌లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఈ డోర్‌కు హ్యాండ్‌లాక్, రైల్వే లాక్, టవర్ బోల్ట్ అమర్చుతున్నారు. ఈ మేరకు పల్లె వెలుగు బస్సులకు ఆర్టీసీ గ్యారేజ్‌లలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

### బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు

అలానే బస్టాండ్‌లలో కూడా ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా సీట్లను పెంచుతున్నట్లు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ప్రస్తుతమున్నవాటి కంటే అదనంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు డీపీటీవో పేర్కొన్నారు.

### ఉచిత ప్రయాణానికి ఐడీ కార్డు చూపాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం అమలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. బస్సులలో ఉచిత ప్రయాణానికి మహిళలు ఆధార్ వంటి ఏదో ఒక ఐడీ కార్డు తప్పనిసరిగా సిబ్బందికి చూపించాలని పేర్కొన్నారు.

# కిరాయి లొల్లి..మళ్లీ!

● నేడు సమావేశానికి రావాలని యజమానులకు ఎస్‌ఎంఎస్‌లు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు గుంటూరు నగరం నుంచి మిర్చిని రవాణ చేసే లారీల కిరాయి పెంచేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గతేడాది ఒక అసోసియేషన్ కనుసన్నల్లో భారీగా కిరాయి పెంచి ఇక్కడి వ్యాపారం అంతా వేరే ప్రాంతాలకు వెళ్లేలా చేయడంతో.. ఎక్స్‌పోర్టర్లు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అసోసియేషన్‌తో సంబంధం లేకుండా ఎగుమతిదారులు ఇష్టమొచ్చిన లారీ యజమాని ద్వారా సరుకు రవాణ చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అడ్డు పడితే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖని ఆదేశించారు. దాంతో అసోసియేషన్ ప్రమేయం పూర్తిగా తొలగిపోయింది. అప్పటి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రూ.1.20 లక్షలకే లారీ యజమానులు మిర్చిని రవాణా చేస్తున్నాయి. దీంతో మార్కెట్ కొంతమేరకు మళ్లీ ఇక్కడ పుంజుకొంది.

### గతంలో వైసీపీ కనుసన్నల్లో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు ఒక అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి.. ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయిని వారి.. కనుసన్నల్లోనే జరిగేలా వ్యవస్థని నెలకొల్పారు. దీంతో కిరాయి రూ.1.50 లక్షల నుంచి రూ. 1.70 లక్షలు లారీకి వసూలు చేసేవారు. అది చాలక ఇంకా పెంచాలని డిమాండ్ కూడా చేశారు. అంతకంటే ఎవరైనా లారీ ఓనరు తక్కువ కిరాయికి ఒప్పందం చేసుకొంటే ఆ లారీకి అడ్డు పడి నానా యాగీ చేసేవాళ్లు. టైర్లు కోసేయడం, లారీ యజమానిపై దాడి చేయడం వంటివి చేసేవారు. దీంతో ఎగుమతి వ్యాపారులు బెంబేలెత్తిపోయేవారు. మరోవైపు ఖమ్మంలో అప్పట్లో రూ.1.20 లక్షలకే లారీలు కిరాయికి పెట్టేవాళ్లు. ఈ కారణంగా చాలా వరకు వ్యాపారం అక్కడికి తరలిపోయింది.

కాగా ఇప్పుడు మళ్లీ ఈశాన్య రాష్ట్రాలకు కిరాయి పెంచేందుకు నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులంతా సమావేశానికి రావాలని గురువారం కొంతమంది ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్లాయి. బుడంపాడు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఈ సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాలు వివరాలు సేకరిస్తున్నాయి. లారీ ఓనర్లు వాళ్ల సమస్యలపై చర్చించుకొంటే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, అలా కాకుండా గతంలో మాదిరి కిరాయి పెంచుతామంటే ఇక్కడి మార్కెట్ నష్టపోతుందని ఎగుమతి వ్యాపారులు తెలిపారు.

స్వయం సహాయక బృందాల పనితీరుపై..

# కేంద్ర బృందం పరిశీలన


మిల్లును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గుంటూరు సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం సహాయక బృందాల పనితీరును జాతీయ బృందం గురువారం పరిశీలించింది. గురువారం గుంటూరు మిర్చి యార్డు, వ్యవసాయ కమిషనరేట్‌తో పాటు, పలు సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను సందర్శించిన బృంద సభ్యులు వివరాలు సేకరించారు. అనంతరం వివిధ మండలా నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ భేటీ లో పచ్చళ్లు, కారప్పొడుల ఉత్పత్తిదారుల అనుభవాలు, ఔత్సాహికుల వివరాలను తెలుసుకున్నారు. అరవింద్ పాటిధర్, జనార్దన్‌రౌట్, గోపాల కృష్ణ, శివ శంకర్ ప్రసాద్, రాజశ్రీ, పీడీ టీవీ విజయలక్ష్మి, ఎన్.కిరణ్ కుమార్, టి. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# ఆర్‌వీఆర్ జేసీ స్నాతకోత్సవం రేపు

● హాజరుకానున్న సుప్రీం కోర్టు మాజీ సీజే ఎన్.వి.రమణ


సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధు మూర్తి

గుంటూరు విద్య ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చోడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 10వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాల కృష్ణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. 2021 - 25 విద్యా సంవత్సరం, 37వ బ్యాచ్ బీటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 1,023 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, 153 మందికి పీజీ పట్టాలు పొందనున్నారని పేర్కొన్నారు. గోల్డ్ మెడల్స్ ప్రదానం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్.ఎస్.వి. శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించారు.


మిర్చి కాటా వేయగానే..

# రైతు ఫోన్‌కి ఎస్‌ఎంఎస్ వెళ్లాలి

● మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత


గుంటూరు ఏఎంసీ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ విజయ సునీత, జేడీలు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో రైతులు తీసుకొచ్చిన టిక్కీలు అమ్మకం పూర్తి అయ్యి.. కాటా వేయగానే ఆటోమేటిక్‌గా స్లిప్పు జనరేట్ కావాలని, సంబంధిత రైతు మొబైల్ నంబరుకు ఎస్‌ఎంఎస్ ద్వారా చేరేలా చూడాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. గురువారం సాయంత్రం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ.. ఈనామ్‌లో ఇంకా ఏమైనా లోటుపాట్లు ఉంటే వచ్చే సీజన్ నాటికి సవరించి 100 శాతం పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. మచ్చు కాయలు, జీరో, కటింగ్, బిల్ టూ బిల్ బిజినెస్‌ల రూపు మాపాలని స్పష్టం చేశారు. గత సీజన్‌లో దాదాపుగా మార్కెట్ ఫీజు రూ.10 కోట్ల మేరకు తగ్గిందని, దానిని రాబోయే రోజుల్లో భర్తీ చేయాలన్నారు. మిర్చి మార్కెట్ పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే సీజన్‌ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు విశ్రాంతి గదులు, లైటింగ్ వంటి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రత్తిపాడు ఏఎంసీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న లైసెన్సులను ఆ కమిటీకి బదిలీ చేసే విషయంపై ప్రతిపాదనలు పంపించాలన్నారు. మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక, డీడీ దివాకర్, ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఎస్ఈ శేషగిరిరావు, యార్డు ఇన్‌ఛార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పర్వదినం

# సకల సంపత్కర వ్రతం



**సృష్టిలో ఉన్న ఐశ్వర్యాలన్నీ లక్ష్మీ స్వరూపాలే. అవి అనంతాలు. ఆమె కృప కలిగినవారికి మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు పుష్కలంగా లభిస్తుంది. సద్గుణాలు మానసికమైనవైతే, సంపదలు భౌతికమైనవి. పరాశక్తిని శ్రీమహాలక్ష్మిగా ఆరాధించి... ఆమె అనుగ్రహంతో లౌకిక, పారలౌకిక ప్రయోజనాలు ఎలా సాధించుకోవాలో మంత్రశాస్త్రాలు, వివిధ గ్రంథాలు విస్తారంగా తెలియజేశాయి. ఆ తల్లిని శ్రావణ మాసంలో 'వరలక్ష్మీ దేవి'గా పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.**

నేడు వరలక్ష్మీ శుక్రవారం

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని 'వరలక్ష్మీ శుక్రవారం' అంటారు. ఈ రోజున వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారు. జగత్తులోని సకల ప్రాణులకు బతుకుతెరువు కల్పించేది శ్రీమహాలక్ష్మి. సకల సంపదలకు ఆమె అధిష్టాన దేవత. శ్రీహరికి ఆమె ప్రాణసమానురాలు. ఆమెను హృదయంలో ప్రతిష్ఠించుకున్నాడు. సస్య స్వరూపిణి అయిన ధాన్యలక్ష్మిగా, వైకుంఠంలో స్వర్గలక్ష్మిగా, గృహాలలో గృహలక్ష్మిగా, అలాగే జితేంద్రియగా, శాంతస్వరూపిణిగా, అరిషడ్వర్గాలనుంచి విముక్తి కలిగించే జ్ఞానప్రదాయినిగా ఆమెను పురాణాలు కీర్తించాయి. అయితే... అష్టైశ్వర్యాల కోసం అష్ట లక్ష్మీ రూపాలలోనే ఆమెను ఎక్కువగా భావన చేయడం, పూజించడం పరిపాటి. కాగా... 'సిద్ధలక్ష్మి, మోక్ష లక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి' అంటూ ఆరు రూపాలలో ఆమెను 'శ్రీసూక్తం' వర్ణించింది. సమస్త ఐశ్వర్యాలను, జయాన్ని, జ్ఞానాన్ని, ఐహిక-ఆముష్మిక సంపదలను వర్షించేది కాబట్టే ఆమెను వరలక్ష్మిగా ఆరాధిస్తున్నాం.

### చారుమతిలా...

వరలక్ష్మీ వ్రతం గురించి పార్వతికి స్కందుని సమక్షంలో చెప్పినట్టు 'స్కాంద పురాణం'లో కథ ఉంది. స్కందుని ద్వారా సూతుడికి తెలిసిన ఈ కథ... ఆయన ద్వారా భూలోకంలో ప్రాచుర్యం పొందింది. 'వర' అంటే శ్రేష్ఠమైనది. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనుకూలమైన భర్త లభిస్తాడని, గృహిణులు సకల సౌభాగ్యాలతో తులతూగుతారని నమ్మకం ఉంది. వరలక్ష్మీ వ్రత కథలో ప్రధాన పాత్ర చారుమతి అనే గృహిణి. ఆ వ్రతాన్ని ఆచరించిన ఆమె లక్ష్మీ అనుగ్రహాన్ని పొందింది. 'చారుమతి' అంటే 'చక్కని బుద్ధి' అని అర్థం. 'ఈ వ్రత విధానాన్ని అనుసరించి పూజలు చేసి, వ్రతకథను చెప్పుకొని లేదా విని... చారుమతి మాదిరిగా జీవితాలను తీర్చిదిద్దుకున్నవారు సర్వ సంపదలు, పొందుతారు, సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభిస్తుంది, కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యం కలుగుతాయి, జీవితాంతం ఆ వరలక్ష్మీదేవి ఆలంబన లభిస్తుంది' అనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

సహజయోగ

# ఆ బంధం... ఒక పవిత్ర శక్తి

**"ఆధ్యాత్మిక ప్రయాణంలో మానవ సంబంధాలు అతి ముఖ్యమైనవి. మానవ సమాజాన్ని పూర్తిగా విడిచిపెట్టి, అడవులలోకి వెళ్ళి, ఏదో ఒక మంత్రాన్ని నిరంతరం జపిస్తే భగవంతుడి సాక్షాత్కారం లభిస్తుందని చాలామంది అనుకుంటూ ఉంటారు. కానీ సంఘంలో అందరితో కలిసి జీవిస్తూ, పవిత్రమైన మానవ సంబంధాలను ఆనందించినప్పుడే ఆత్మసాక్షాత్కారం త్వరగా, మరింత సులభంగా లభిస్తుందంటారు" శ్రీమాతాజీ నిర్మలాదేవి.**



రేపు శ్రావణ పౌర్ణమి

**రాఖీ...** చూడడానికి కేవలం ఒక దారపుపోగే కానీ... దాని విలువ వెలకట్టలేని మమతల పెన్నిధి. పవిత్రమైన సోదరీ సోదర బంధానికి అది ప్రతీక. మహాభారతంలో ద్రౌపది, శ్రీకృష్ణుల అనుబంధం ఈ బంధం గొప్పతనాన్ని చాటిచెబుతుంది. నిండు సభలో... దుర్యోధనుడి ప్రోద్బలంతో ద్రౌపదీ వస్త్రాపహరణానికి దుశ్శాసనుడు ప్రయత్నించినప్పుడు... ద్రౌపది చేసిన ఆర్తనాదానికి... ఎక్కడో ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడు వచ్చి, ఆమె మర్యాదను కాపాడిన కథ ప్రసిద్ధమైనది. ద్రౌపదిపై శ్రీకృష్ణుడికి ఉన్న సోదరీ ప్రేమకు ఇది నిదర్శనం. అలాగే... చరిత్రలో మరో ఉదంతం ఉంది. భారతదేశంపై దండెత్తి వచ్చిన అలెగ్జాండర్‌ను పురుషోత్తముడనే రాజు బంధిస్తాడు. భారతీయ సంప్రదాయాల గురించి తెలిసిన అలెగ్జాండర్ భార్య ఒక రాఖీని పురుషోత్తముడికి బహుమతిగా పంపిస్తుంది. వెంటనే అలెగ్జాండర్‌ను పురుషోత్తముడు చెర నుంచి విడుదల చేస్తాడు. పురుషోత్తమునిలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పునకు కారణం... తన భార్య పంపిన రాఖీ అని తెలుసుకున్న అలెగ్జాండర్ ఆశ్చర్యపోతాడు. సంస్కృతి సంప్రదాయాలకు, సోదర సోదరీ బంధానికి భారతీయులు ఇచ్చే విలువను గ్రహిస్తాడు. రక్షాబంధన్ ప్రాశస్త్యం గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి వివరించిన మరో సంఘటన ఛత్రపతి శివాజీ జీవితానికి సంబంధించినది.



### తానాజీ వీరత్వం...

సింహగఢ్ రాజకుమారి కమలకుమారి నుంచి శివాజీ తల్లి జిజియాబాయికి ఒక లేఖ అందుతుంది. శివాజీని తన సోదరుడిగా కమలకుమారి సంబోధిస్తూ... తను ఆపదలో ఉన్నానని, తనను రక్షించాలని కోరుతుంది. మరునాటి సూర్యోదయం లోపున తనను కాపాడకపోతే... శత్రువుల వల్ల తన మానప్రాణాలకు ప్రమాదం అని తెలుపుతూ... ఒక రాఖీని కూడా పంపుతుంది. వెంటనే శివాజీని తన వద్దకు పిలిపించుకున్న జిజియాబాయి... మరునాడు ఉదయం లోపల సింహగఢ్ కోటను జయించాలని ఆదేశిస్తుంది. ఆ బాధ్యతను తన సైన్యంలో ప్రముఖుడైన తానాజీకి శివాజీ అప్పగిస్తాడు. కమలకుమారి పంపిన రాఖీ గురించి విన్న తానాజీ ఒక్క రాత్రిలో ఆ కోటను జయిస్తాడు. అయితే యుద్ధం ముగిసేసరికి వీరమరణం పొందుతాడు. రాఖీకి విలువను ఇచ్చి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన తానాజీ వీరత్వం భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమయింది.

> **మానవుల సంఘ జీవితాన్ని వారి సూక్ష్మ శరీరంలోని విశుద్ధ చక్రం నిర్దేశిస్తుంది. అందరితో పవిత్రమైన సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండి, వాటిని ఆనందించేవారిలో ఈ చక్రం ఆరోగ్యంగా ఉంటుంది. దీనివల్ల మనిషి తన జీవితంలో ఎదురయ్యే రకరకాల ఒడుదొడుకులను తట్టుకొని నిలిచే స్థితప్రజ్ఞత పొందుతాడు.**

### ఎన్నో సమస్యలకు పరిష్కారం...

మానవుల సంఘ జీవితాన్ని వారి సూక్ష్మ శరీరంలోని విశుద్ధ చక్రం నిర్దేశిస్తుంది. అందరితో పవిత్రమైన సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండి, వాటిని ఆనందించేవారిలో ఈ చక్రం ఆరోగ్యంగా ఉంటుంది. దీనివల్ల మనిషి తన జీవితంలో ఎదురయ్యే రకరకాల ఒడుదొడుకులను తట్టుకొని నిలిచే స్థితప్రజ్ఞత పొందుతాడు. "ఈ స్థితికి చేరాలంటే... స్త్రీ పురుషులు తమ జీవిత భాగస్వాములను తప్ప మిగిలినవారి పట్ల సోదర-సోదరీభావం కలిగి ఉండాలి. అటువంటి పవిత్రమైన మానవ సంబంధాలు స్థిరపడినప్పుడే నేటి సమాజంలో మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని వెల్లడించారు శ్రీ మాతాజీ. మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలోని విశుద్ధ చక్రంలో ఎడమవైపున.. సోదరి తత్త్వానికి ప్రతీకగా శ్రీవిష్ణుమాయ నెలకొని ఉంటుంది. అందుకే సహజయోగ ధ్యాన సాధన చేస్తున్న ప్రతిఒక్కరూ ఈ సోదర, సోదరీ బంధాన్ని పవిత్ర శక్తిగా భావిస్తారు. తమ దైనందిన జీవితంలో దానికి అనుగుణంగా నడుచుకుంటారు. రాఖీ పండుగను ప్రపంచవ్యాప్తంగా... సామూహికంగా జరుపుకొంటారు.

**డాక్టర్ పి. రాకేష్,** 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



విశేషం

**మన దేశంలో సజ్జనులను ఉద్ధరించడానికి అనేకమంది మహనీయులు అవతరించారు. వారిని గురువులుగా... పూజ్యభావంతో మనం ఆరాధిస్తాం. అటువంటి గురువులలో శ్రేష్ఠుడు మంత్రాలయ ప్రభువైన శ్రీ రాఘవేంద్రస్వామి. స్వార్థ చింతన లేకుండా, సజ్జనులను సరైన మార్గంలో నడిపించడానికి, భగవంతుడిపై భక్తి భావాన్ని పెంపొందించడానికి భగవంతుడు పంపించిన దూత ఆయన. నేటి నుంచి ఈ నెల 12వతేదీ వరకూ 'శ్రీరాఘవేంద్రస్వాముల సప్తరాత్రోత్సవాలు' (ఆరాధనోత్సవాలు) మంత్రాలయంలో జరుగుతాయి.**

# సత్య ధర్మ స్వరూపుడు... శ్రీరాఘవేంద్రుడు

శ్రీరాఘవేంద్రస్వామివారి ఇంటి దైవం లక్ష్మీ వేంకటేశ్వరుడు. సంస్థాన పూజ చేసేది శ్రీరాముడికి. అయినప్పటికీ ఆయనకు శ్రీకృష్ణుడు అంటే అమితమైన ప్రీతి, భక్తి. ఒకసారి సంచారంలో భాగంగా ఆయన ఉడుపికి వెళ్ళారు. అక్కడ శ్రీమధ్వాచార్యులు స్థాపించిన శ్రీకృష్ణ విగ్రహం ముగ్ధ మోహన రూపాన్ని చూసి సంతోష పరవశులయ్యారు. ఉడుపిలోనే కొన్ని రోజులు ఉన్నారు. శ్రీకృష్ణుడి సన్నిధిలో (బ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానంగా) 'తంత్రదీపిక', 'న్యాయముక్తావళి' అనే గ్రంథాలను రాశారు. 'చంద్రికా ప్రకాశ' అనే అద్భుతమైన టిప్పణి వ్రాశారు. అంతేకాదు.. ద్వైత సిద్ధాంత వాఙ్మయంలో మేరుకృతి అనిపించుకున్న, శ్రీ మధ్వాచార్యుల వ్యాఖ్యానానికి టీకగా శ్రీజయతీర్థులు రచించిన 'శ్రీమన్న్యాయసుధ'కు 'పరిమళ' అనే టిప్పణిని రచించి, శ్రీకృష్ణునికి సమర్పించారు.

### స్వామి కీర్తనకు శ్రీకృష్ణ నర్తనం


ఒకరోజు మధ్యాహ్నం ఉడుపిలోని శ్రీకృష్ణుని గుడిలో శ్రీరాఘవేంద్రులు ధ్యానంలో మునిగి ఉన్నారు. ఉన్నట్టుండి గర్భగుడిలో అపూర్వమైన కాంతి కనిపించింది. మంజులమైన గజ్జెల శబ్దం వినిపించింది. శ్రీకృష్ణపరమాత్మ తనకు దర్శనం ఇవ్వబోతున్నారని శ్రీరాఘవేంద్రులకు అనిపించింది. ఆయన తన పక్కనే ఉన్న వీణను తీసుకొని శ్రావ్యంగా మీటసాగారు. అప్పుడు ఆయన నోటి నుంచి "ఇందు ఎనగె గోవిందా, నిన్నయ పాదారవిందవ తోరో ముకుంద ఇందిరా రమణ" (ఈ రోజు నాకు నీ పాదారవిందములను చూపించు ఇందిరా రమణా, ముకుందా) అనే అద్భుతమైన కృతి వెలువడింది. శ్రీ రాఘవేంద్రులు ఆనందంతో పాడుతూ, మధురంగా వీణ వాయిస్తూ ఉంటే... జగన్మోహనాకారుడైన బాలకృష్ణుడు ఆయనకు తన దివ్య మంగళరూపాన్ని అనుగ్రహించాడు. తను వేణుగానం చేస్తూ, బుడిబుడి అడుగులతో చుట్టూ నర్తించాడు. అనంతరం శ్రీరాఘవేంద్రులకు అభయప్రదానం చేసి అదృశ్యుడయ్యాడు. భగవంతుని దర్శనంతో పులకించిపోయిన ఆయన ఆనందబాష్పాలు రాలుస్తూ... దేవుణ్ణి పలు విధాలుగా స్తుతించారు.

### భజతాం కల్పవృక్షాయ... నమతాం కామధేనువే

"నిస్వార్థమైన జీవనం మానవులను గొప్పవారిగా నిలబెడుతుంది. శ్రీరాఘవేంద్రస్వామిలో ఎటువంటి స్వార్థమూ లేదు. అందుకే వారిని 'భజతాం కల్పవృక్షాయ' అని స్తుతిస్తాం" అని చెప్పారు శ్రీసువిద్యేంద్రతీర్థులు. ఒక వృక్షం రుచికరమైన ఫలాలను ఇతరులకు అందిస్తుంది కానీ తాను వాటిని తినదు. నదిలోని నీరు ఏ విధమైన భేదభావం లేకుండా అన్ని ప్రాణులకూ దాహార్తిని తీరుస్తుంది. అదే విధంగా శ్రీరాఘవేంద్రులు ఎలాంటి ఫలాపేక్ష, ఎటువంటి భేదభావం లేకుండా సకల సజ్జనులను కరుణిస్తారు. ఆవు నీరు, గడ్డి మాత్రమే స్వీకరించి, మనకు అమృతంలాంటి పాలను అందిస్తుంది. మనిషి ఒక వయసు వచ్చాక తల్లి పాలు తీసుకోవడం మానేస్తాడు. కానీ పశువులు ఇచ్చే పాలను జీవితాంతం స్వీకరిస్తూనే ఉంటాడు. శ్రీరాఘవేంద్రులు కూడా ఆయన పట్ల మనం చూపించే భక్తి విశ్వాసాలకు బదులుగా మనల్ని కరుణిస్తారు" అంటారు 'హరికథామృతసారం'లో జగన్నాథదాసులు. అందుకే భక్తుల కష్టాలను కడతేర్చి, సన్మార్గం వైపు నడిపించే కల్పవృక్షంగా, కామధేనువుగా శ్రీరాఘవేంద్రులు పేరు పొందారు.

### మహిమల పరమార్థం

చదువురాని వెంకన్న ఆదోని సంస్థానం దివాన్ అయ్యాడన్నా, పెద్ద గంగాళంలోని మామిడి పండ్ల రసంలో పడి మరణించిన శిశువు బ్రతికిందన్నా, స్వగ్రామానికి బయలుదేరిన ఒక శిష్యుడు కేవలం శ్రీరాఘవేంద్రులు ఇచ్చిన మృత్తికతో ఒక పిశాచాన్ని సంహరించి సంపన్నుడయ్యాడన్నా... ఇలాంటి అనేక మహిమల వెనుక స్వామివారి ముఖ్యోద్దేశం.... భగవంతుడి ఉనికిని, గొప్పతనాన్ని జనులకు తెలియపరచడం. "అంతా సర్వోత్తముడైన శ్రీహరి సంకల్పానుసారమే జరుగుతుంది తప్ప నాకు ఎలాంటి మహిమ లేదు" అని చెప్పిన నిరాడంబరులైన భాగవతోత్తములు శ్రీ రాఘవేంద్రులు. తత్త్వజ్ఞానం, హరిభక్తి, పరిశ్రమ, పరోపకారబుద్ధి... ఇలాంటివన్నీ మనం కూడా అలవరచుకోవాలనేది ఆయన ఆశయం.



> **ఒక వృక్షం రుచికరమైన ఫలాలను ఇతరులకు అందిస్తుంది కానీ తాను వాటిని తినదు. నదిలోని నీరు ఏ విధమైన భేద భావం లేకుండా అన్ని ప్రాణులకూ దాహార్తిని తీరుస్తుంది. అదే విధంగా శ్రీరాఘవేంద్రులు ఎలాంటి ఫలాపేక్ష, ఎటువంటి భేదభావం లేకుండా సకల సజ్జనులను కరుణిస్తారు.**

• శ్రీ మధ్వ ప్రచార పరిషత్

# నిజమైన స్వాతంత్ర్యం కోసం...

"మనిషికి అతని చైతన్యం మీద ఉండే ప్రభావాలు మాయమైతేనే అతనికి నిజమైన స్వాతంత్ర్యం వస్తుంది. సత్యాన్ని గ్రహించే శక్తి కలుగుతుంది. ఆధ్యాత్మిక ప్రపంచ ద్వారం తెరుచుకుంటుంది" అంటారు జిడ్డు కృష్ణమూర్తి. పెంపకం, సమాజం, చరిత్ర లాంటి ఎన్నో ప్రభావాలు మనమీద ఉంటాయి. శ్రమపడి వాటిని వదిలించుకోవచ్చు. అయితే అవి మనల్ని పూర్తిగా వదిలిపెట్టవు. మన చైతన్యంలోని గాఢమైన లోతుల్లో... మనం సులువుగా గుర్తించలేని, ఘనీభవించిన మూడు ప్రభావాలు ఉంటాయి, అవి: ఆలోచనా ప్రక్రియ, కాలం, అహంకారం. ఇవి కూడా మనల్ని వదిలినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుంది.

### ఆలోచన...

మనం నిరంతరం ఆలోచిస్తూ ఉంటాం. నిద్రలో కూడా ఆలోచనలను కలల రూపంలో కొనసాగిస్తాం. వాటిని అరికట్టాలనే నిర్ణయం తీసుకుంటే... దానిలోంచే రకరకాల ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఇది మన అదుపులో లేని నిరంతర కార్యక్రమం. దీనికి కారణం ఏమిటి? ఒక ఉదాహరణకు... నిన్న సాయంత్రం రమ్యమైన సూర్యాస్తమయాన్ని ఆనందించాను. ఆ ఆనందాన్ని కొనసాగించాలనే ధ్యేయంతో, వీలైతే ఆ ఆనందం మరోసారి అనుభవించాలనే కోరికతో నేను ఆ సూర్యాస్తమయం గురించి ఆలోచిస్తూ ఉంటాను. ఆలోచన సుఖ సూత్రంతో (ప్లెజర్ ప్రిన్సిపల్) ముడిపడి ఉంటుంది. అలాగే "మనం కష్టాలను, దుఃఖాలను తప్పించుకోవాలని అనుకుంటాం. అందువల్ల కూడా మనం ఆలోచిస్తూ ఉంటాం. ఆ ఆలోచనల్లో కాలం, అహంకారం పుడతాయి" అని చెబుతారు జిడ్డు కృష్ణమూర్తి.

### కాలం...

సూర్యాస్తమయాన్ని చూస్తున్నప్పుడు... చైతన్యంలో ఆ అనుభవం మాత్రమే ఉంటుంది, కాలం ఉండదు. ఆ తరువాత దాని గురించి ఆలోచిస్తున్నప్పుడు... "నిన్న సాయంత్రం సూర్యాస్తమయాన్ని అనుభూతి చెందాను. వచ్చే ఆదివారం మళ్ళీ అది అనుభవించాలి" అనే ఆలోచనలతో... గతం, భవిష్యత్తు- అంటే కాలం పుడుతుంది.

### అహం...

ఒక ప్రబలమైన అనుభవంలో నిజానికి 'నేను' లేదా 'అహం' అనే స్ఫురణ ఉండదు. ఉత్త అనుభవం మాత్రమే ఉంటుంది.

చింతన



దాని గురించే ఆలోచిస్తూ ఉన్నప్పుడు 'అహం' పుడుతుంది. 'సూర్యాస్తయమాన్ని నిన్న సాయంత్రం అనుభవించాను, వచ్చే ఆదివారం మళ్ళీ అనుభవించాలి' అని బయలుదేరే ఆలోచనల్లో అహం పుట్టి, అది ఒక కేంద్రంగా మారుతుంది. ఈ సత్యాన్ని ప్రప్రథమంగా చెప్పినవారు జిడ్డు కృష్ణమూర్తి. అలా పుట్టిన అహం... చైతన్యాన్ని కేంద్రం, పరిధులుగా విభజిస్తుంది. అన్ని అనుభవాలు కాలంతో కలిసి, జ్ఞాపకాలుగా మారి అహాన్ని పెనవేసుకుంటాయి. ప్రభావాలను సంపూర్ణంగా వదిలించుకోవాలంటే... ఆలోచనలను, కాలాన్ని, 'నేను' అనే భావాన్ని నిర్మూలించాలి. ఇదే జిడ్డు కృష్ణమూర్తి చెప్పే డీకండిషనింగ్. మంత్రోపదేశాలతో, దీక్షలతో, దీర్ఘమైన తపస్సులతో, కఠోరమైన వ్రతాలతో ఇది వీలుకాదనే విషయాన్ని ఆయన విశ్లేషించి చూపారు. శాస్త్రాల మార్గం అహంతో ముడిపడి ఉంటుంది. "పక్షమో, ఆరు నెలలో సాధన చేస్తే ఫలితం భవిష్యత్తులో కనిపిస్తుంది" అంటుంది సంప్రదాయం. "సాధన వల్ల సాధకుడిలో క్రమంగా కుండలినీ శక్తి మేలుకొని, షట్చక్రాలను ఛేదిస్తూ... సహస్రారాన్ని చేరినప్పుడు చైతన్య విస్తరణ జరుగుతుంది" అంటుంది శాస్త్రం. అంటే ఈ సాధన ఆలోచన, కాలం పరిధులలో ఉంటుంది. కానీ "ఈ కుండలినీ శక్తి కాలానికి, ఆలోచనలకు, అహంకారానికి అతీతమైనది" అని ఆ శాస్త్రమే చెబుతుంది. అంటే శాస్త్రం తనను తానే ఖండించుకుంటోంది. ఇదే జిడ్డు కృష్ణమూర్తి చేసిన విమర్శ "సంప్రదాయ మార్గం నిరర్థకం. ఆ ప్రభావాలన్నింటినీ ఒక్క క్షణంలో ధ్వంసం చేయాలి. అహంకారం బాంబులా పేలి, రెప్పపాటులో మాయమైపోవాలి" అంటారాయన.


### అది ఎలా సాధ్యం?

సూర్యాస్తమయాన్ని చూస్తున్న క్షణంలో... ఆలోచనలు మాయమైపోతాయి, కాలం, అహం తాలూకు స్పృహ ఉండదు. సూర్యుడు, చైతన్యం ఒక్కటైపోతాయి. ఆ అనుభవాన్ని అక్కడితో పరిసమాప్తి చేయాలి. లేకుంటే... దానినుంచి ఆలోచనాపరంగా దూరమవుతున్నప్పుడు... కాలం, అహం తలెత్తుతాయి. చైతన్యాన్ని కబ్జా చేస్తాయి. కాగా... 'తీవ్రమైన అనుభవం కావాలి' అనే ఉద్దేశంతో... ఒక కొండ మీద కూర్చొని, సూర్యాస్తమయం కోసం ఎదురు చూడడం కూడా నిరర్థకమే. ఆ ఉద్దేశం... కాలంతో, అహంతో ముడిపడిన ఆలోచనే కదా! ఆనందకరమైన అనుభవాల విషయంలోనే కాదు... ప్రతి అనుభవ స్వరూపమూ ఇంతే. క్రోధంలో క్రోధం ఒక్కటే ఉంటుంది. ఆలోచన, కాలం, అహం మాయమైపోతాయి. అసూయ, ద్వేషం, దుఃఖం లాంటి అనుభవాలు కూడా ఇంతే. 'మంచి అనుభవం, చెడ్డ అనుభవం' అనే భేదం ఉండదు. మనకు తారసిల్లే అనుభవాలకు మనం నిష్పాక్షికంగా లొంగిపోయి, వాటిలో లీనమైపోవాలి. అలా లీనమైన క్షణంలోనే ఆధ్యాత్మిక రహస్యాలన్నీ దాక్కొని ఉన్నాయి. ఆ క్షణంలోనే నిజమైన డీకండిషనింగ్ జరుగుతుంది, సంపూర్ణ స్వాతంత్ర్యం దొరుకుతుంది.

• గుంటూరు వనమాలి (www.gunturu.de)

జెన్ కథ

# గురువు చూపిన దారి




ప్రతి గురువు తనకు తెలిసిన సాధనా పద్ధతులను శిష్యులకు బోధిస్తాడు. శిష్యులలో కొందరు వాటిని తీవ్రంగా సాధన చేస్తారు. కఠోరమైన తపస్సు చేసిన వారి చుట్టూ పుట్టలు పెరగడం, చుట్టూ జంతువులు, పక్షులు సంచరించడం లాంటి కథలు కూడా ఉన్నాయి. అలాంటి ఒక శిష్యుడి కథ ఇది.

ఒక జెన్ గురువు ఆశ్రమంలో ఎందరో శిష్యులు ఉండేవారు. వారందరూ గురువు సూచన మేరకు సాధన చేసేవారు. వారిలో ఒకరికి జిజ్ఞాస చాలా ఎక్కువగా ఉండేది. ఎంతో ఎక్కువ దీక్షతో తపస్సు, ధ్యానం చేసేవాడు. అతను రోజుల తరబడి కదలకుండా, మెదలకుండా ధ్యానంలో ఉండిపోవడంతో... గడ్డాలు, మీసాలు పెరిగిపోయాయి. జుట్టు బాగా పెరిగి జడలు కట్టింది. అతని దేహం మీద పురుగులు పారాడడం, పాములు ప్రాకడం మొదలుపెట్టాయి. రకరకాల జంతువులు అతనికి దగ్గరగా వచ్చి కూర్చొనేవి. అతని తలపై పక్షులు గూడు కట్టుకొని నిర్భయంగా నివసించసాగాయి. అతను మామూలు స్థితిలోకి వచ్చినప్పుడు... ఇదంతా మౌనంగా గమనించేవాడు తప్ప ఏ పక్షినీ, ఏ పురుగునూ ఏమీ అనేవాడు కాదు.

ఆ వైపు వచ్చీ పోయే జనం అతణ్ణి గొప్ప యోగిగా, తపస్విగా భావించి ఎంతో గౌరవించేవారు. బాగా పొగిడేవారు. క్రమంగా తాను చాలా గొప్పవాడిననే భావం అతనిలో పెరిగింది. దాంతో అతని ధ్యానంలో తీవ్రత క్రమంగా తగ్గిపోసాగింది. ఈ సంగతి గురువుకు తెలిసింది. రాబోయే ప్రమాదం ఏమిటో గ్రహించిన గురువు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదనుకున్నాడు. సరాసరి ఆ శిష్యుడు కూర్చున్న చోటికి వెళ్ళాడు. ఆ సమయంలో శిష్యుడు కళ్ళు మూసుకొని ధ్యానంలో ఉన్నాడు. అతని చుట్టూ జంతువులు తిరుగుతున్నాయి. తలపైన ఉన్న గూడులోని పక్షులు తలలు బయటకు పెట్టి తొంగి చూస్తున్నాయి. అప్పుడు ఆ గురువు... తన శిష్యుణ్ణి రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, బాగా కదిపాడు. గాఢ నిద్రలోంచి మేలుకొన్నవాడిలా శిష్యుడు గభాలున కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా కనిపించిన గురువుకు గౌరవంగా నమస్కరించబోయాడు. గురువు కోపంతో "ఏమిటి ఇదంతా? తలపై ఈ గూడు ఏమిటి?" అంటూ దాన్ని గట్టిగా లాగేశాడు. పక్షులు తుర్రున ఎగిరిపోయాయి. గురువు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

కొద్దికాలంగా జరుగుతున్న సంఘటనలన్నీ శిష్యుడి కళ్ళ ముందు మెదిలాయి. తాను కదలకుండా కూర్చొని ధ్యానం చేయడం, పశుపక్ష్యాదులు తన చెంత చేరడం, తను వాటిని మౌనంగా పెంచి పోషించడం, అందరూ తనను పొగడడం, పూజించడం, తనలో గొప్పవాణ్ణనే అహంకారం వృద్ధి చెందడం, అది తన ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకంగా నిలవడం... అన్నీ గుర్తుకువచ్చాయి. గురువు సరైన సమయంలో వచ్చి, మందలించడం వల్ల తనకు తప్పిన ప్రమాదం ఏమిటో, కలిగిన శ్రేయస్సు ఏమిటో. తనకు ఆయన చూపిన దారి ఏమిటో స్పష్టంగా బోధపడింది. కరుణామూర్తి అయిన గురువు నడిచి వెళ్ళిన దిశలో నేలను చూశాడు. కంటి నుంచి నీరు కారుతూ ఉండగా... గురువు పాదముద్రలను తన చేతులతో తాకి, ఆ చేతులను తన హృదయంపై ఆనించి... గురువుకు మనసులోనే కృతజ్ఞత తెలియజేశాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

# బిజినెస్

గుంటూరు ● శుక్రవారం 8 ఆగస్టు 2025

# ట్రంప్ సుంకాలతో ఆగమాగం

## 50-70 శాతం ఎగుమతులకు దెబ్బ: జీటీఆర్ఐ




న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల పోటుతో దేశీయ పరిశ్రమ గగ్గోలు పెడుతోంది. ఈ దెబ్బతో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే రొయ్యలు, దుస్తులు, ఆర్గానిక్ కెమికల్స్, మెషినరీ, మెకానికల్ అప్లయెన్సెస్, రత్నాభరణాల ఎగుమతులు 50 నుంచి 70 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) అనే మేధో సంస్థ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. చైనా, వియత్నాం, బ్రెజిల్ దేశాలతో పోల్చితే భారత్ మాత్రమే అధికంగా నష్టపోనుందని పేర్కొంది. రొయ్యలు, ఆర్గానిక్ కెమికల్స్, కార్పెట్స్, అల్లిన వస్త్రాలు (నిట్టెడ్ అండ్ వోవెన్ అపారెల్స్), వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఫర్నీచర్ వంటి ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 50-70 శాతం వరకు తగ్గిపోయే అవకాశం ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా స్టీల్, అల్యూమినియం, కాపర్, ఆటో విడిభాగాల ఎగుమతులు 30 నుంచి 50 శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా, స్మార్ట్‌ఫోన్స్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాల ప్రభావం చాలా తక్కువ ఉండనుందని శ్రీవాత్సవ పేర్కొన్నారు.

### వస్త్ర పరిశ్రమకు చావు దెబ్బే

వస్త్ర పరిశ్రమ మాత్రం ట్రంప్ తాజా సుంకాలను జీర్ణించుకోలేక పోతోంది. మన వస్త్ర ఎగుమతులపై ట్రంప్ సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచేశారు. ఇది ఎగుమతులపై ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన ఎంఎస్ఎంఈ సంస్థలకు చావు దెబ్బ అని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏపీఈసీ చైర్మన్ సుధీర్ సెఖ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆర్థికంగా పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మన దుస్తుల ఎగుమతిలో అమెరికాకు 33 శాతం వాటా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### ప్రభుత్వం చేయూత !

ప్రస్తుత పరిస్థితి నుంచి పరిశ్రమ వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్న ఎగుమతి ఆధారిత వస్త్ర, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, రసాయన కంపెనీల కోసం ప్రత్యేక రాయితీలు కల్పించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

### రత్నాభరణాలకూ ముప్పే

ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలపై దేశీయ రత్నాభరణాల పరిశ్రమ కూడా తీవ్ర ఆందోళనలో ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయట పడేందుకు విధానపరమైన సంస్కరణల ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. ఇదే సమయంలో అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణపైనా దృష్టి పెట్టాలని కోరింది. మన రత్నాభరణాలు, వజ్రాలు, వజ్రాభరణాల ఎగుమతులపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు కొనసాగితే అమెరికా మార్కెట్ మనకు శాశ్వతంగా మూసుకుపోయినట్టేనని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి.

### ఫార్మాకు ఊరట

సుంకాల విషయంలో ట్రంప్ చాలా తెలివిగానే వ్యవహరిస్తున్నారు. భారత వస్తు దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఫార్మా, ఐటీ సేవలను మాత్రం మినహాయించారు. మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అమెరికాలో ఔషధాల ధరలు మూడింతలు ఎక్కువ. దీనిపై అమెరికన్లు ఇప్పటికే గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారత్ నుంచి చౌకగా వచ్చే జెనరిక్ ఔషధాలపైనా 50 శాతం సుంకాలు విధిస్తే అమెరికన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయంతోనే ట్రంప్ భారత ఫార్మా దిగుమతులను సుంకాల నుంచి మినహాయించారని ఫార్మాగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో విక్రయించే జెనరిక్ ఔషధాల్లో 40% మన దేశం నుంచే ఎగుమతవుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సుంకాల మినహాయింపు తాత్కాలికమేనని ట్రంప్ స్పష్టంగా ప్రకటించారు. దీంతో కొన్ని ఫార్మా కంపెనీలు అమెరికాలోనే యూనిట్లు పెట్టి అక్కడే ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు యోచిస్తున్నట్టు సమాచారం.

### కొత్త మార్కెట్లను వెతుక్కోవాల్సిందే

ట్రంప్ సుంకాలపై ఆటోమొబైల్ విడి భాగాల తయారీ కంపెనీలూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ మార్కెట్లు వెతుక్కోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏసీఎంఏ జాతీయ అధ్యక్షురాలు శ్రద్ధా సూరి మార్వా తెలిపారు.

## బంగారం దూకుడు

**ఢిల్లీ మార్కెట్లో ఒక్కరోజే రూ.3,600 అప్**

- 10 గ్రాముల ధర రూ.1,02,620
- ఆల్ టైమ్ రికార్డు స్థాయికి చేరిక



న్యూఢిల్లీ: పసిడి ధర మరోసారి రికార్డు సృష్టించింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం గురువారం రూ.3,600 పెరిగి సరికొత్త రికార్డు స్థాయి రూ.1,02,620కి చేరింది. కిలో వెండి ధరా రూ.1,500 లాభంతో రూ.1.14 లక్షలకు చేరింది. మరోవైపు ఫ్యూచర్స్ మార్కెట్లోనూ పసిడి ధర రికార్డు సృష్టించింది. అక్టోబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాములు మేలిమి బంగారం ధర ఎంసీఎక్స్‌లో గురువారం రూ.893 లాభంతో రూ.1,02,155 స్థాయికి దూసుకుపోయింది. హైదరాబాద్‌లోనూ పసిడి ధర రూ.320 లాభంతో రూ.1,02,550కు చేరింది. కిలో వెండి ధర మాత్రం రూ.1,000 పెరిగి రూ.1.27లక్షల వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల భయంతో చాలా మంది మదుపరులు సురక్షిత పెట్టుబడిగా భావించే పసిడి కొనుగోళ్లకు దిగడం, డాలర్‌తో పడిపోతున్న రూపాయి మారకం రేటూ ఇందుకు దోహదం చేస్తున్నాయి.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 8వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445 | విజయవాడ | 490 |
| వరంగల్ | 447 | గోదావరి | 485 |
| చిత్తూరు | 513 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 90 | విజయవాడ | 99 |
| వరంగల్ | 90 | గుంటూరు | 104 |
| కరీంనగర్ | 90 | ఒంగోలు | 104 |
| మహబూబ్‌నగర్ | 90 | చిత్తూరు | 77 |
| కర్నూలు | 90 | నెల్లూరు | 82 |
| విశాఖపట్నం | 94 | అనంతపురం | 82 |
| గోదావరి | 99 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,02,550 ▲ | 94,000 ▲ | 1,27,000 ▲ |
| విజయవాడ | 1,03,550 ▼ | 97,500 ▲ | 1,18,500 ▲ |
| విశాఖపట్నం | 1,03,970 ▲ | 94,000 ▲ | 1,27,000 ▲ |
| రాజమండ్రి | 1,02,550 ▲ | 94,000 ▲ | 1,17,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,00,400 ▲ | 92,370 ▲ | 1,17,800 ▲ |
| ముంబై | 1,00,703 ▲ | 92,244 ▲ | 1,15,250 ▲ |

## ఎల్ఐసీ లాభం రూ.10,987 కోట్లు

న్యూఢిల్లీ: బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.10,987 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.10,461 కోట్లతో పోల్చితే లాభం 5% మాత్రమే పెరిగింది. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్ల నుంచి 2,22,864 కోట్లకు పెరిగింది. తొలి ప్రీమియం వసూళ్లు రూ.7,525 కోట్లుగాను, రెన్యువల్ ప్రీమియం వసూళ్లు రూ.59,885 కోట్లుగాను నమోదయ్యాయి. "మేం లాభదాయకత పెంచుకోవాలనుకుంటున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో రెండంకెల వృద్ధిని సాధించడం మా లక్ష్యం" అని ఎల్ఐసీ సీఈఓ ఆర్. దొరైస్వామి అన్నారు. తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో మార్కెట్ వాటా 63.51 శాతంగా ఉంది.

## విశాఖలో కార్గో టెర్మినల్, లాజిస్టిక్స్ పార్కు: స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా

న్యూఢిల్లీ: స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) వ్యాపార విస్తరణ చేపడుతోంది. ఇందులో భాగంగా విశాఖపట్నం వద్ద ఒక కార్గో టెర్మినల్, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం వైజాగ్ ప్రొఫైల్స్ లాజిస్టిక్స్ (వీపీఎల్), హింద్ టెర్మినల్స్ (హెచ్‌టీపీఎల్) సంస్థలతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు ప్రాజెక్టులతో విశాఖపట్నం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సరుకు రవాణ సమయాన్ని తగ్గించడంతో పాటు లాజిస్టిక్స్ సామర్థ్యాల పెంపు మెరుగుపడతాయని స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేస్తాయని కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బండి సురేశ్ కుమార్ తెలిపారు. వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్‌నకు చెందిన స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం వద్ద ఒక సమగ్ర స్టీల్, విద్యుత్ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది.

## కొత్త వ్యాపారాలే చోదక శక్తులు

**4 రంగాలపై రిలయన్స్ నజర్**

- 6జీ టెక్నాలజీ అభివృద్ధిలో జియో
- ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యాపార స్వరూపం మారిపోతోంది. ఇప్పటి వరకు పెట్రో కెమికల్స్, చమురు, గ్యాస్ ఉత్పత్తి, వాటి రిఫైనింగ్.. కంపెనీ వ్యాపారాలకు ప్రధాన ఆధారం. ముందు ముందు రిటైల్, డిజిటల్ సేవలు, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, కొత్త తరహా ఇంధన వ్యాపారాలు కంపెనీ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తులు కానున్నాయి. తాజా వార్షిక నివేదికలో వాటాదారులను ఉద్దేశించిన రాసిన ముందు మాటలో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. ఇదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్ఐఎల్ డీప్ టెక్ కంపెనీగా రూపాంతరం చెందుతుందన్నారు. ఇందుకోసం దాదాపు వెయ్యి మందికి పైగా శాస్త్రవేత్తలు కృత్రిమ మేధ (ఏఐ), పునరుత్పాదక ఇంధన వనరులు, అధునాతన లోహాల అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ కోసం పని చేస్తున్నట్టు వెల్లడించారు. వీరు అభివృద్ధి చేసిన ప్రతి టెక్నాలజీని ఆర్ఐఎల్‌కు చెందిన ప్రతి వ్యాపార విభాగంలో భాగం చేస్తామన్నారు. అంతర్జాతీయ టెలికాం రంగంలో ప్రధాన శక్తిగా ఎదిగేందుకు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఆరో తరం (6జీ) టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు అంబానీ కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించారు.. తమ చర్యలన్నీ భారత్‌ను తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. కొత్త వ్యాపారాలతో పాటు పాత వ్యాపారాలైన పెట్రో కెమికల్స్, రిఫైనింగ్ రంగాలపైనా తమ దృష్టి కొనసాగుతుందని అంబానీ తెలిపారు.

## మార్కెట్లో అద్భుత రికవరీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ గురువారం భారీ నష్టాల నుంచి అనూహ్యమైన పునరుజ్జీవం సాధించి లాభాలతో క్లోజైంది. ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో చివరి గంట కొనుగోళ్లు మార్కెట్‌కు ఊపిరులూదాయి. గురువారం ఆరంభం నుంచే నష్టాల్లోనే ట్రేడయిన మార్కెట్.. ఒక్కసారిగా చివరి గంటలో ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 79,811.29 నుంచి 926 పాయింట్ల మేర ఎగువకు దూసుకుపోయింది. చివరికి సెన్సెక్స్ 79.27 పాయింట్ల లాభంతో 80,623.26 వద్ద ముగిసింది. నిఫ్టీ 21.95 పాయింట్ల లాభంతో 24,596.15 వద్ద స్థిరపడింది. అమెరికా సుంకాల పోటు కారణంగా ఆరంభంలో భారీగా నష్టపోయినా డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శాంతి చర్చలు జరిగే అవకాశం ఉన్నదన్న వార్తలు మార్కెట్లను లాభాల బాటలోకి నడిపించాయి.

### ఎటర్నల్‌లో యాంట్‌ఫిన్ 1.46%వాటా విక్రయం

చైనా కుబేరుడు జాక్ మా నేతృత్వంలోని యాంట్ ఫైనాన్షియల్ గురువారం జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల మాతృ సంస్థ ఎటర్నల్‌లో 1.46 శాతం వాటాలను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా జరిగిన ఈ లావాదేవీ విలువ రూ.4,096.75 కోట్లు. ఒక్కో షేరు సగటు విక్రయ ధర రూ.289.91గా ఉంది. ఈ వాటాల విక్రయం అనంతరం ఎటర్నల్‌లో యాంట్‌ఫిన్ హోల్డింగ్ వాటా 1.95% నుంచి 0.49 శాతానికి తగ్గింది.

## రూ.150 కోట్లతో పిట్టీ ఇంజనీరింగ్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వృద్ధి అవకాశాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుతున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. రూ.150 కోట్ల పెట్టుబడితో పిట్టీ ఇంజనీరింగ్ ప్లాంట్ విస్తరణతో పాటు అనుబంధ సంస్థలైన పిట్టీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి కార్యకలాపాలు విస్తరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో ప్రస్తుతం 90,000 ఎంటీలుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,08,000 ఎంటీలకు పెంచటంతో పాటు ఫౌండ్రీ సామర్థ్యాలను 18,600 ఎంటీల నుంచి 24,000 ఎంటీలకు విస్తరించనున్నట్లు తెలిపింది. దశలవారీగా 18 నెలల్లో ఈ విస్తరణ కార్యకలాపాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.463.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.22.88 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

## గ్లోబల్ ఫౌండ్రీస్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ సేవల కోసం అమెరికాకు చెందిన చిప్ తయారీ సంస్థ గ్లోబల్ ఫౌండ్రీస్ (జీఎఫ్)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ ప్రకటించింది. ఒప్పందంలో భాగంగా జీఎఫ్ సెమీకండక్టర్ తయారీ సేవలు, టెక్నాలజీలకు సైయెంట్ సెమీకండక్టర్స్ అధీకృత విక్రేతగా వ్యవహరించనుంది. జీఎఫ్ భాగస్వామిగా సైయెంట్.. కంపెనీలకు ఫ్యాబ్రికేషన్ యాక్సెస్, టెక్నికల్ కన్సల్టేషన్, టెస్టింగ్, విలువ ఆధారిత సేవలను అందించనుంది.

# స్పోర్ట్స్


సచిన్




## సిరాజ్‌కు తగినంత గుర్తింపు దక్కలేదు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టూర్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతమని దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొనియాడాడు. అనూహ్య ప్రదర్శనతో అలరించిన పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. వాస్తవంగా అతడికి దక్కాల్సినంత గుర్తింపు దక్కలేదన్నాడు. 'మైదానంలో అతడి వ్యవహారశైలి నాకెంతో నచ్చుతుంది. ఎన్ని ఓవర్లు బౌల్ చేసినా అలుపనేదే కనపడదు. ఓ పేసర్ ఇంత ఉత్సాహంగా ఉండడం ఏ బ్యాటర్‌కూ నచ్చదు. చివరి రోజు వరకు సిరాజ్ అదే జోష్‌ను కొనసాగించాడు. సిరీస్‌లో వెయ్యి బంతులు వేసినా.. అతడు పేస్ తగ్గకుండా గంటకు 145 కి.మీ. వేగంతో బౌలింగ్ చేయగలడని కామెంటేటర్లు చెప్పడం విన్నా. అది అతడి పోరాట తత్వానికి నిదర్శనం. ఓవల్ టెస్ట్ చివరి రోజు సిరాజ్ ప్రదర్శనను ఎంత పొగిడినా తక్కువే' అని సచిన్ అన్నాడు. సిరాజ్ ఇప్పుడు రాణిస్తున్నట్టే ఇంతకుముందూ అద్భుతంగా బౌల్ చేస్తూనే ఉన్నాడని, అయితే అతని ప్రతిభకు తగిన గుర్తింపు మాత్రం లభించలేదని సచిన్ చెప్పాడు. ఇక ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కూడా పరిణతి చెందిన ఆటను ప్రదర్శించాడని ప్రశంసించాడు. చివరి టెస్ట్‌లో బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై సెంచరీ చేయడం అసాధారణమన్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎంతో ప్రశాంతంగా జట్టును నడిపించాడని సచిన్ కొనియాడాడు. భారత జట్టు గొప్ప ప్రదర్శనలో రాహుల్ కూడా కీలకపాత్ర పోషించాడని తెలిపాడు.

### రాజస్థాన్‌ను వీడనున్న శాంసన్?




న్యూఢిల్లీ: మేనేజ్‌మెంట్‌తో తీవ్ర విభేదాల నేపథ్యంలో కెప్టెన్ సంజూ శాంసన్.. రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడడానికి సిద్ధమయ్యాడని సమాచారం. తనను ట్రేడ్ లేదా వేలంలోపాల్గొనేందుకు రిలీజ్ చేయమని ఫ్రాంచైజీని సంజూ కోరాడట. అతడు రాజస్థాన్ జట్టులో కొనసాగడానికి ఇష్టపడడం లేదని శాంసన్ కుటుంబ సభ్యులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. 2025 మెగా వేలానికి ముందు శాంసన్‌ను రాజస్థాన్ రూ.18 కోట్లకు రిటైన్ చేసుకొంది. 2021 నుంచి ఐపీఎల్‌లో రాయల్స్ తరపున సంజూ 149 మ్యాచ్‌లు ఆడాడు. కాగా, ట్రేడింగ్‌లో శాంసన్‌ను తీసుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్ ప్రయత్నాలు చేస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి.

## అయ్యర్ ఆడేది ఖాయమే!

**కీపర్‌గా సంజూ శాంసన్**

**ఆసియాకప్‌లో భారత జట్టుపై అంచనాలు**


సూర్య



శ్రేయాస్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీస్‌తో ఆకట్టుకున్న టీమిండియా ఇప్పుడిక ఆసియాకప్‌పై దృష్టి సారించనుంది. అయితే ఇది టీ20 ఫార్మాట్‌లో జరగనుండడంతో జట్టు సభ్యులు కూడా మారనున్నారు. అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈలో ఈ టోర్నీ జరిగేలా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అదే నెల 14న ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించే భారత్-పాక్ పోరు కూడా జరుగుతుంది. 8 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో దుబాయ్, అబుధాబి వేదికలుగా మొత్తం 19 మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మరోవైపు ఆసియాకప్‌లో పాల్గొనే భారత జట్టు కూర్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈనెల మూడో వారంలో బీసీసీఐ తమ టీ20 జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అయితే మరో ఐదు నెలల్లోనే టీ20 వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆ మెగా టోర్నీని దృష్టిలో ఉంచుకుని కూడా తాజా జట్టును ఎంపిక చేయాల్సిన బాధ్యత సెలెక్టర్లపై ఉంది. అయితే టెస్టు, వన్డేల మాదిరి కాకుండా టీ20 జట్టులో స్థానం కోసం విపరీత పోటీ నెలకొని ఉంది. అంతేకాకుండా టెస్టు ఫార్మాట్‌లో మాదిరి జట్టు సంధి దశలో కూడా లేదు. మరోవైపు ఇంగ్లండ్‌లో పర్యటించిన జట్టు ఆటగాళ్లలో గిల్, బుమ్రా, రాహుల్, పంత్, సిరాజ్ ఆసియాకప్‌లో ఆడే అవకాశం లేదని సమాచారం.

**ఆసియాకప్ జట్టు (అంచనా):** సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, శాంసన్, తిలక్ వర్మ, శ్రేయాస్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రింకూ సింగ్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, వరుణ్, హర్షిత్, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, ఇషాన్.

**నెంబర్ 4లో శ్రేయాస్:** ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన ఆటగాళ్లంతా బెర్త్ కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా విశేష ప్రతిభ చూపి జట్టును రన్నరప్‌గా నిలిపిన శ్రేయాస్ అయ్యర్‌కు ఈసారి పిలుపు ఖాయమేనని అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో అతడిని టెస్టు, టీ20లకు పక్కనబెట్టి వన్డేల్లో ఆడిస్తున్నారు. కానీ ఐపీఎల్‌లో తను 17 మ్యాచ్‌ల్లో 604 పరుగులు చేసి బ్యాటర్‌గానూ సక్సెస్ అయ్యాడు. ఓవరాల్‌గా ఏడాది కాలంలో ఆడిన 25 ఇన్నింగ్స్‌లో 179.73 స్ట్రయిక్ రేట్‌తో 949 పరుగులు సాధించాడు. అందుకే పొట్టి ఫార్మాట్‌లో శ్రేయా‌స్‌ను ఎంపిక చేసేందుకు ఈ ప్రదర్శన సరిపోతుందని భావిస్తున్నారు. భారత్ తరపున అతడు 2023లో చివరి టీ20 ఆడాడు. రిషభ్ పంత్‌కు ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమైన నేపథ్యంలో కీపర్‌గా శాంసన్ ఎంపిక లాంఛనమే కానుంది. అయితే ఐపీఎల్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ సాధించిన విషయం తెలిసిందే. ఒకవేళ తన ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే శాంసన్‌ను మిడిలార్డర్‌లో ఆడించాల్సి ఉంటుంది. కెప్టెన్ సూర్యకుమార్‌కు ఈ ఏడాది ఆరంభంలో హెర్నియా సర్జరీ జరిగింది. దీంతో తను ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉన్నాడు. తన ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ తను కోలుకోలేకపోతే శ్రేయాస్‌కు పగ్గాలు అప్పగించినా ఆశ్చర్యం లేదు. ఫినిషర్లుగా ఆల్‌రౌండర్లు హార్దిక్, అక్షర్ కొనసాగనుండగా కుల్దీప్, వరుణ్ ప్రధాన స్పిన్నర్లు కానున్నారు. పేస్ విభాగంలో అర్ష్‌దీప్, హర్షిత్, ముకేశ్ ఉంటారు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లోనూ ప్రాతినిధ్యం వహించిన సిరాజ్‌కు విండీస్‌తో సిరీస్ కోసం తాజాగా ఉంచే అవకాశం ఉంది.

## 11 మంది రెజ్లర్లపై వేటు

- నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల గుట్టు రట్టు


న్యూఢిల్లీ : నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన 11 మంది రెజ్లర్లను..భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సస్పెండ్ చేసింది. రెజ్లింగ్ క్రీడకు హరియాణా ప్రసిద్ధి చెందినది. దాంతో ఆ రాష్ట్ర జట్టులో ఎంపికకు పోటీ తీవ్రంగా ఉండడంతో పలువురు ఢిల్లీ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఈక్రమంలో వారు ఢిల్లీలో జన్మించినట్టు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. వీటిపై అనుమానం వచ్చిన డబ్ల్యూఎఫ్ఐ విచారణ చేయాల్సిందిగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను కోరింది. దర్యాప్తు జరిపిన కార్పొరేషన్ 11 మంది రెజ్లర్ల జనన ధ్రువీకరణ పత్రాలు తాము జారీ చేయలేదని తేల్చింది. దాంతో సాక్షమ్, మనుజ్, కవిత, అన్ను, ఆరుష్ రాణా, శుభమ్, గౌతమ్, జగ్‌రూప్ ధన్కడ్, నకుల్, దుష్యంత్, సిద్ధార్థ బలియాన్ అనే రెజ్లర్లపై డబ్ల్యూఎఫ్ఐ వేటు వేసింది.



## అర్జున్ గెలుపు

- హారిక పరాజయం
- చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి శుభారంభం చేయగా.. ద్రోణవల్లి హారికకు షాక్ తగిలింది. గురువారం జరిగిన ఓపెన్ తొలి రౌండ్‌లో అమెరికా జీఎం అవోండర్ లియాంగ్‌పై అర్జున్ నెగ్గాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 48 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. సహచరులు ప్రణవ్-కార్తికేయన్ మురళీ మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో నిహాల్ సరీన్ పరాజయం పాలయ్యాడు. చాలెంజర్స్ విభాగం తొలి రౌండ్‌లో సహచర జీఎం దీప్తయాన్ ఘోష్ చేతిలో హారిక ఓడింది. ఇనియన్‌తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకొంది.




## ఏపీఎల్‌కు రంగం సిద్ధం

**నేటినుంచే లీగ్**


విశాఖపట్నం స్పోర్ట్సు (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీ ప్రారంభం కానున్నది. ఈ నెల 28 వరకు జరిగే ఈ టోర్నీకి సంబంధించిన ట్రోఫీ ఆవిష్కరణ గురువారం ఇక్కడి ఓ హోటల్‌లో జరిగింది. కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, కోశాధికారి దండమూడి శ్రీనివాసరావుతోపాటు టోర్నీలో ఆడుతున్న జట్ల సారథులు ఎం.హేమంత్‌రెడ్డి (భీమవరం బుల్స్), రికీ బుయ్ (సింహాద్రి వైజాగ్ లయన్స్), ఎస్‌కే రషీద్ (రాయల్స్ ఆఫ్ రాయలసీమ), కేఎస్ భరత్ (కాకినాడ కింగ్స్), కె.మహీప్‌కుమార్ (తుంగభద్ర వారియర్స్), హనుమ విహారి (అమరావతి రాయల్స్), కె.అశ్విన్ హెబ్బర్ (విజయవాడ సన్‌షైనర్స్) పాల్గొన్నారు. టోర్నీలో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి.

## భారత మహిళల ఓటమి

**ఆస్ట్రేలియా-ఎతో తొలి టీ 20**

మకే (ఆస్ట్రేలియా) : మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ఆస్ట్రేలియా-ఎ జట్టుతో జరిగిన మొదటి టీ20లో భారత్-ఎ 13 పరుగులతో పరాజయం చవిచూసింది. మూడు టీ20లు, మూడు వన్డేలతోపాటు ఒక అనధికార టెస్ట్ సిరీస్‌లో తలపడేందుకు ఆస్ట్రేలియాలో మన మహిళలు పర్యటిస్తున్నారు. గురువారం జరిగిన తొలి టీ20లో మొదట ఆస్ట్రేలియా-ఎ 20 ఓవర్లలో 137/6 స్కోరు చేసింది. అనికా (50 నాటౌట్), అలీసా హీలీ (27) రాణించారు. లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ (3/15) మూడు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్-ఎ 20 ఓవర్లలో 124/5 స్కోరుకే పరిమితమై ఓడింది. రాఘవీ బిస్త్ (33), ఉమా ఛెత్రి (31), కెప్టెన్ రాధా యాదవ్ (26 నాటౌట్) పోరాడారు. అమీ, సియాన చెరో రెండు వికెట్లు సాధించారు.

## గిల్‌కు 'నార్త్' పగ్గాలు



న్యూఢిల్లీ : సుదీర్ఘమైన ఇంగ్లండ్ పర్యటనను ముగించుకొని వచ్చినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దులీప్ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఈనెల 28 నుంచి జరిగే టోర్నీలో నార్త్‌జోన్ కెప్టెన్‌గా గిల్ వ్యవహరించనున్నాడు. తొలి మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్‌ను నార్త్‌జోన్ ఢీకొననుంది. గిల్‌తోపాటు పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్ నార్త్‌జోన్ జట్టులో ఉన్నారు.

## కుప్పకూలిన జింబాబ్వే

**న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్**


బ్రెండన్ టేలర్ (44)

బులవాయో : జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (44) రాణించాడు.. హెన్రీ ఐదు, జకారీ ఫోక్స్ నాలుగు వికెట్లతో చెలరేగారు. అనంతరం కివీస్ తొలిరోజు ఆటచివరికి 174/1 స్కోరుతో తిరుగులేని స్థితిలో నిలిచింది. 49 పరుగుల ఆధిక్యంలో ఉన్న న్యూజిలాండ్‌కు ఇంకా 9 వికెట్లు చేతిలో ఉన్నాయి.

**టేలర్ రికార్డు:** జింబాబ్వే బ్యాటర్ బ్రెండన్ టేలర్ అరుదైన రికార్డును అందుకున్నాడు. 21వ శతాబ్దంలో టెస్ట్‌ల్లో అరంగేట్రం చేసి ఎక్కువ సంవత్సరాలు (21 సంవత్సరాల 93 రోజులు) కెరీర్ కొనసాగించిన క్రికెటర్‌గా ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్ (21 సంవత్సరాల 51 రోజులు)ను అధిగమించాడు. 39 ఏళ్ల టేలర్ 2004లో శ్రీలంకపై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు.

## సెమీస్‌లో ఐదుగురు భారత బాక్సర్లు

**ఆసియా చాంపియన్‌షిప్స్**

బ్యాంకాక్: ఆసియా చాంపియన్‌షిప్స్ అండర్-19 విభాగంలో ఐదుగురు పురుష బాక్సర్లు సెమీస్‌లో ప్రవేశించి భారత్‌కు పతకాలు ఖాయం చేశారు. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌లో శివమ్ (55 కి.), మౌసమ్ సుహాగ్ (65 కి.), రాహుల్ కుందు (75 కి.), గౌరవ్ (85కి.), హేమంత్ సంగ్వాన్ (90 కి.) ప్రత్యర్థులపై విజయాలు సాధించారు. అండర్-19 మహిళల కేటగిరీలో ఏడుగురు భారత బాక్సర్లు ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టారు. దాంతో ఈ విభాగంలో మనకు 12పతకాలు ఖాయంగాలభించనున్నాయి.

## డాన్స్ వార్



హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కథనాయకులుగా రూపొందిన బాలీవుడ్ చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ నెల 14న తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. హృతిక్, ఎన్టీఆర్ ఇద్దరూ ప్రతిభావంతులైన డాన్సర్లే. 'వార్ 2' కోసం 'సలాం అనాలి' అంటూ సాగే గీతంలో వీరిద్దరూ పోటీపడుతూ స్టెప్పులేశారు. గురువారం మేకర్స్ ఈ పాట ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయిక.

## ఆబాల గోపాలాన్ని అలరించే చిత్రం



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న చిత్రం 'కిష్కిందపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో తొలి గీతాన్ని విడుదల చేసింది. ఈ రొమాంటిక్ డ్యూయెట్‌కు చైతన్ భరద్వాజ్ స్వరాలందించగా, పూర్ణాచారి సాహిత్యం అందించారు. జావేద్ అలీ ఆలపించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఆబాల గోపాలాన్ని అలరించే చిత్రమిది. ఈ హారర్ మిస్టరీ ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తుంది' అన్నారు. 'ఇది నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రం. కొన్ని ఘట్టాలు చాలాకాలం పాటు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి' అని అనుపమా తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని కౌశిక్ చెప్పారు.

## తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది



షనీల్ గౌతమ్ కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'సు ఫ్రం సో'. జేపీ తుమినాడ్ దర్శకత్వంలో శశిధర్ శెట్టి నిర్మించారు. కన్నడనాట ఘన విజయం అందుకున్న ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా నేడు తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "సు ఫ్రం సో" చిత్రం ప్రేక్షకులకు చక్కని వినోదం పంచుతుంది. తెలుగు ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుంది' అన్నారు. శశిధర్ రెడ్డి మాట్లాడుతూ 'రీమేక్ కన్నా ఒరిజినల్ వెర్షన్ అయితే బావుంటుందని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. తెలుగులో 'సు ఫ్రం సో' చాలా పెద్ద హిట్ అవుతుంది' అని చెప్పారు. థియేటర్స్‌లో ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయండి అని తుమినాడ్ ప్రేక్షకులను కోరారు.

## మవీర ఆగమనం



కన్నడ కథానాయకుడు ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావలి'. రాజ్ బి శెట్టి కీలకపాత్ర పోషించారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. పోరాటానికి సిద్ధమవుతున్నట్లుగా సీరియస్ లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రంలో అత్యంత కీలకమైన మవీర అనే పాత్రకు రాజ్ బి శెట్టి ప్రాణం పోశారని దర్శకుడు గురుదత్ గనిగ తెలిపారు.

## సినిమా షూటింగ్‌లకు గమ్యస్థానంగా తెలంగాణ

**జయేష్ రంజన్**



సింగిల్ విండో వ్యవస్థలో అన్ని సినిమా షూటింగ్ అవసరాల కోసం "ఫిల్మ్ ఇన్ తెలంగాణ" పోర్టల్ అభివృద్ధిని "వన్ స్టాప్ షాప్"గా అభివృద్ధి చేయడంతో సహా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు జయేష్ రంజన్ తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, యువజనాభివృద్ధి, పర్యాటక, సంస్కృతిక శాఖ, ముఖ్యమంత్రి కార్యాలయంలోని పరిశ్రమలు, పెట్టుబడుల సెల్ సీఈవో జయేష్ రంజన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంఐసీఈ అండ్ ఫిల్మ్ పర్యాటక రంగాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రోత్సహించడానికి స్టేక్ హోల్డర్ల సమావేశం గురువారం తాజ్‌కృష్ణలో నిర్వహించారు. పలు రంగాలకు చెందిన 40 మంది కీలక స్టేక్ హోల్డర్లు, పరిశ్రమల ప్రతినిధులు సమావేశమై రాష్ట్ర ఎంఐసీఈ పర్యాటక ప్రొఫైల్ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. సినిమా షూటింగ్‌లకు తెలంగాణను అత్యంత స్నేహపూర్వక, తక్కువ పెట్టుబడులతో అత్యంత లాభదాయకమైన గమ్యస్థానంగా మార్చే అవకాశాలపై ఇందులో చర్చించారు. దీనిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఆగస్టు చివరి నాటికి లేదా ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబర్ 27) నాటికి ప్రకటిస్తామని జయేష్ రంజన్ తెలిపారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఫిల్మ్ టూరిజం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)కు సంబంధించి స్టేక్ హోల్డర్ల సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ప్రభుత్వ విభాగాల నుండి దాదాపు ఇరవై మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

-హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## ప్రేమ గీతం



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే ప్రేమ కథా చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వంలో పప్పుల కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా నటించారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఎవరే నువ్వు' అంటూ సాగే గీతాన్ని నటుడు విజయ్‌సేతుపతి విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ "ప్రేమిస్తున్నా' కథ చాలా బావుందని విజయ్ సేతుపతి గారు మెచ్చుకున్నారు. ఇదొక కొత్త తరహా ప్రేమకథా చిత్రం. పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది" అని చెప్పారు.

## రాజాగాడి లవ్‌స్టోరీ



తన ప్రేమను సఫలం చేసుకునేందుకు ఓ యువకుడు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో రూపొందుతున్న ప్రేమకథా చిత్రం 'లిటిల్ హార్ట్స్'. మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా నటించారు. సాయిమార్తాండ్ దర్శకుడు. 'నైన్టీస్ మిడిల్ క్లాస్ బయోపిక్'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్'కు నిర్మాతగా వ్యవహరించారు. సెప్టెంబర్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. నిర్మాత బన్నీవాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం 'రాజా గాడికి...' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా సాయిమార్తాండ్ మాట్లాడుతూ 'మౌళీ, ఆదిత్య హాసన్‌కు కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని చెప్పారు. ఆదిత్య హాసన్ మాట్లాడుతూ 'నిర్మాతగా నాకు చాలా సంతృప్తినిచ్చిన చిత్రమిది. ప్రేక్షకులు ఆద్యంతం కథతో మమేకమవుతారు. సినిమా చూస్తున్నంతసేపు నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు. 'ఈ సినిమాను నేను బాగా ఎంజాయ్ చేశాను. సాయిమార్తాండ్ సహజంగా తెరకెక్కించాడు' అని బన్నీవాస్ ప్రశంసించారు. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది అని వంశీ నందిపాటి అన్నారు.

## నాలుగో రోజూ షూటింగ్స్ బంద్

ముప్పై శాతం వేతనాలు పెంచాలన్న తమ డిమాండ్ నెరవేరే వరకూ షూటింగ్స్‌లో పాల్గొనేది లేదంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బంద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సమ్మె ఫలితంగా నాలుగు రోజులుగా షూటింగ్స్ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఫెడరేషన్ ముందు నిర్మాతలు నాలుగు ప్రతిపాదనలు ఉంచారు. అవి..ఫ్లెక్సిబుల్ కాల్‌షీట్లు(ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు; ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు) కాల్షీట్లు కావాలి, ఇక్కడ సరైన నిపుణులు లేనప్పుడు నాన్ మెంబర్స్‌తో కూడా పనిచేయించుకునే వెసులుబాటు ఉండాలి, షూటింగ్ ఎక్కడ చేసినా ఎలాంటి పరిమితులు ఉండకూడదూ, రెండో ఆదివారం, పండుగ రోజుల్లో పనికి మాత్రమే డబుల్ కాల్ షీట్, మిగిలిన ఆదివారాల్లో సింగిల్ కాల్‌షీట్ విధానం... ఈ నాలుగు ప్రతిపాదనలపై ఫెడరేషన్ తమ అభిప్రాయం చెబితేనే వేతన పెంపుపై ఒక నిర్ణయం తీసుకుంటామని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం ఫెడరేషన్ నాయకుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ 'నిర్మాతల వైపు నుంచి అందిన నాలుగు ప్రతిపాదనలపైనే చర్చ జరిగింది. రెండింటిని అంగీకరించాము. మరో రెండు ప్రతిపాదనలపై యూనియన్‌లో చర్చ జరగాలి. ఈ సమస్యను ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లోనే పరిష్కరించుకుంటాం. రెండ్రోజుల్లో ఛాంబర్ మీటింగ్ ఉండొచ్చు. చిరంజీవి, బాలకృష్ణ అందరికీ న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. నిర్మాతల ప్రతిపాదనలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. దినసరి వేతనం తీసుకునే వారు ఎన్ని రోజులు పనిచేస్తారనేది ముఖ్యం. సాఫ్ట్‌వేర్ వాళ్లతో సినీ కార్మికులకు పోలిక అనవసరం. నిర్మాతలు, కార్మికులు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుంటారని నమ్ముతున్నాను' అని అన్నారు.

**చిన్న సినిమాలకు వేతనాల పెంపు వర్తించదు: సి.కల్యాణ్**

ఫెడరేషన్ నాయకులు - నిర్మాతల కోర్డినేషన్ మీటింగ్ జరుగుతుండగానే, చిన్న నిర్మాతలు నిర్మాత సి.కల్యాణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్మికుల డిమాండ్లపై చర్చించారు. సమావేశం అనంతరం సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'చిన్న చిత్రాలు లేకపోతే ఉపాధి లేదు. చిన్న నిర్మాతలు ఎవరితోనైనా పనిచేయించుకోవచ్చు. చిన్న సినిమాలకు వేతనాల పెంపు వర్తించదు. ఒక్క పైసా కూడా పెంచేందుకు వారు సిద్ధంగా లేరు. అలా అని కార్మికులను ఇబ్బంది పెట్టాలని ఏ నిర్మాత అనుకోరు' అని చెప్పారు.

**నా విమర్శలు వ్యవస్థపైనే: టీజీ విశ్వప్రసాద్**



సినిమా కార్మికులకు టాలెంట్ లేదంటూ అర్థం వచ్చేలా ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ వివరణ ఇచ్చారు. ఈమేరకు ఆయన ఒక లేఖ విడుదల చేశారు. 'హైదరాబాద్‌లో అపారమైన ప్రతిభ ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో పనిచేసే వారు సుమారు 60 శాతం నుంచి 70 శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తున్నారు. వీరి పాత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కీలకం. నేను హైదరాబాద్ టాలెంట్‌ను తక్కువగా అంచనా వేశానన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. నా విమర్శలు వ్యవస్థపై మాత్రమే, ప్రతిభపై కాదు. హైదరాబాద్‌లో టెక్నీషియన్లు, ఆర్టిస్టులు తెలుగు సినిమాకు ఎప్పటి నుంచో అండగా ఉన్నారు. వాళ్లను అడ్డుకునే వ్యవస్థల్ని తొలగించాలి. స్థానిక ప్రతిభకు అవకాశాలు కల్పించాలి' అని పేర్కొన్నారు.

**టెక్నీషియన్లు నైపుణ్యం పెంచుకోవాలి: బన్నీ వాస్**



తెలుగు సినిమా టెక్నీషియన్లకు సరైన నైపుణ్యాలు లేవని, అందుకే బయటి నుంచి నిపుణులను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ వస్తున్న కామెంట్లపై నిర్మాత బన్నీ వాస్ స్పందించారు. 'సినీ కార్మికుల వేతనాల పెంపు డిమాండ్ న్యాయమైనదే. వేతనాలు పెంచి మూడేళ్లు అవుతోంది. కార్మికులు ఇప్పుడు ఎక్కువ అడుగుతున్నారు. టాలీవుడ్ అంతర్జాతీయ స్థాయికెళ్లింది. కానీ, ఎన్ని సినిమాలు ఆ స్థాయిని అందుకుంటున్నాయనేది గుర్తించాలి. అలాంటి పది చిత్రాలను దృష్టిలో పెట్టుకొని లెక్కలేసుకోవడం సరైంది కాదు. ప్రస్తుతం ధరలు పెరిగాయి. ఎంత చిన్న సినిమా అయినా రూ.12 కోట్ల బడ్జెట్ అవుతోంది. బ్లాక్‌బస్టర్ హిట్ అయితే తప్ప నిర్మాతలకు లాభాలు రావడం లేదు. అలాంటి చిత్రాలు ఎన్ని తీయగలరు? తెలుగు సినిమా టెక్నీషియన్లు తమ నైపుణ్యాలను పెంచుకోవాలి. పూర్తిగా మనవాళ్లతో అంతర్జాతీయ స్థాయి సినిమా తీయలేం. అందుకే బయటి నుంచి టెక్నీషియన్లను తీసుకొస్తున్నాం. మనవాళ్లు ఆ స్థాయిని అందుకొనే వరకు బయటి వారి రాక తప్పదు' అని అన్నారు.

## మేఘం వర్షించదా



విజయ రామరాజు కథానాయకుడిగా రూపొందుతున్న క్రీడానేపథ్య చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం తొలి గీతాన్ని విడుదల చేసింది. 'మేఘం వర్షించదా' అంటూ సాగే ఈ పాటకు విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించారు. విఘ్నేశ్ భాస్కరన్ స్వరకల్పనలో కపిలన్ మీరా ప్రకాశ్, సుజిత్ శ్రీధర్ ఆలపించారు. స్పోర్ట్స్ డ్రామాతో పాటు హృదయాలకు హత్తుకునే ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు విక్రాంత్ రుద్ర చెప్పారు. అజయ్ ఘోష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జగదీశ్

## బనకచర్ల ప్రాజెక్ట్‌కన్నా ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్‌కు ప్రాధాన్యమివ్వండి

- ఈ విధానంతో ఏడాదికి మూడు పంటలకు నీళ్లివ్వొచ్చు
- సీఎం చంద్రబాబుకు మర్రి శశిధర్‌రెడ్డి లేఖ



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్ట్ కన్నా ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్ (ఎఫ్‌డబ్ల్యూసీ)కు ప్రాధాన్యమివ్వాలని ఏపీ సీఎం చంద్రబాబుకు మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి సూచించారు. ఈమేరకు ఆయనకు లేఖ రాశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులకు లేఖ రాశానని.. రేవంత్‌రెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేదని, చంద్రబాబు చర్చలకు పిలిస్తే ఈ విధానంపై వివరించడానికి సిద్ధంగా ఉన్నానని శశిధర్‌రెడ్డి చెప్పారు. ఎఫ్‌డబ్ల్యూసీ వల్ల ఏడాదిలో మూడు పంటలకు నీటిని అందించవచ్చన్నారు. తెలంగాణ, రాజస్థాన్‌లో ఈ విధానం వల్ల స్థిరమైన ఫలితాలు వచ్చాయన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో తెలంగాణకు అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఫోర్ వాటర్ కాన్సెప్ట్ విధానం దేశానికి గొప్ప వరం అవుతుందన్నారు.

## హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

| న్యాయవాది పేరు | స్టాండింగ్ కౌన్సిల్‌గా నియామకమైన విభాగం |
|---|---|
| వజ్రాల శ్రీనివాసుల రెడ్డి | ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ |
| బీ సుధాకర్ కుమార్ | కృష్ణా యూనివర్సిటీ, మచిలీపట్నం. |
| జంధ్యం సుబ్బారావు | శ్రీకాకుళం-బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ |
| చేజర్ల వెంకటేశ్వర్లు | కాపు సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ |
| సీహెచ్ ఎస్‌వీ సూరజ్ | జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ-కాకినాడ |
| బొర్రా శివశంకరరావు | నెల్లూరు జిల్లా సహా రాయలసీమ ప్రాంత మున్సిపాలిటీలు (సర్వీసెస్) |
| బీ రామశంకర్ రావు | జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ-గురజాడ, విజయనగరం |
| గుడి శ్రీనివాసు | ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ |

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థలు, యూనివర్సిటీల తరపున వాదనలు వినిపించేందుకు ఎనిమిది మంది న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీనికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించండి: హైకోర్టు



అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఉప ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడంతోపాటు ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పిటిషనర్ సమర్పించిన వినతిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే డీజీపీకి పంపించిందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని డిస్పోజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పోలీసు భద్రత కల్పించడంతో పాటు సీసీటీవీలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను వెబ్‌క్యాస్టింగ్ చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ వైసీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు స్వతంత్ర పర్యవేక్షకులను నియమించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా.. పిటిషనర్ తరపు న్యాయవాది వడ్లమూడి కిరణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

## సీఎంకు హజ్ యాత్రికుల కృతజ్ఞతలు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంచుకున్న 72 మంది హజ్ యాత్రికులకు రూ.లక్ష చొప్పున రాయితీని ప్రభుత్వం అందజేయడంపై వారంతా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, సీనియర్ ఇమాంలతో కలిసి వారంతా 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులు పట్టుకుని గురువారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిశారు.

## మెడ్‌టెక్ జోన్‌లో 3-డి ప్రింటింగ్ ఇంప్లాంట్ల తయారీ

విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ 3-డి ప్రింటింగ్ ఇంప్లాంట్ల తయారీకి రెండు సంస్థలతో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్థోపెడిక్ రంగంలో వినియోగించే ఈ ఇంప్లాంట్ల వల్ల సర్జరీ జరిగిన తర్వాత రోగి త్వరగా కోలుకుంటారని, తక్కువ వ్యవధిలోనే సాధారణ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని సీఈఓ జితేంద్ర శర్మ తెలిపారు. ఈ ఎంఓయూలో ఫ్రాన్స్‌కు చెందిన ఫైవ్స్ గ్రూపు అనుబంధ సంస్థ యాడ్‌అప్, అమెరికాకు చెందిన ఓఐసీ ఇంటర్నేషనల్ సంతకాలు చేశాయి.

## సీపీఎస్ ఉపాధ్యాయులపై కేసు కొట్టివేత

విజయవాడ లీగల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో 2019 జనవరి 31న నిర్వహించిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో పాల్గొన్న 17 మంది సీపీఎస్ ఉపాధ్యాయులపై నమోదైన కేసును మంగళగిరి కోర్టు గురువారం కొట్టేసింది. నిందితులపై నేరం రుజువుకాకపోవడంతో న్యాయాధికారి ఈమేరకు తీర్పును వెలువరించారు. ఈ కేసులో కర్నూలుకు చెందిన ఉపాధ్యాయులు ఏడుగురు, విజయనగరం జిల్లాకు చెందిన ఆరుగురు, అనంతపురానికి చెందిన ముగ్గురు ఉన్నారు.

## పీసీబీలో సీనియర్ ఇంజనీర్ల సర్వీసు సడలింపు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో పరిపాలనాపరమైన అవసరాలపై సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లకు అనుకూలంగా ఫీడర్ కేటగిరీలో కనీస సర్వీస్ నియమాలకు సడలింపు ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరు పదవికి పదోన్నతి కోసం సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరు కేడర్‌లో కనీస అవసరమైన సర్వీస్ సడలింపు కోసం ఏపీపీసీబీ సభ్య కార్యదర్శి ప్రతిపాదన చేశారు. 2025 జూన్ వరకు ఖాళీలను భర్తీ చేయడానికి ఆరుగురితో ప్యానల్ అవసరం ఉండగా, ప్యానల్ సంవత్సరంలో అర్హత కలిగిన అభ్యర్థులు లేనందున సీనియర్ ఇంజనీర్లకు అనుకూలంగా ప్రభుత్వం రెండేళ్ల కనీస సర్వీసును సడలించింది.

## పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ బాధ్యతల స్వీకారం

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, పశుపోషకులు, పశుసంవర్ధక రంగ అభివృద్ధికి కృషి చేస్తానని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు చెప్పారు. గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన ఆయన పునర్నియామకం ద్వారా గురువారం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు

## అసోం ఐపీఎస్ విభుకృష్ణ ఏపీ కేడర్‌కు..

అసోంలో పనిచేస్తున్న అగ్ముట్ కేడర్ ఐపీఎస్ అధికారి విభుకృష్ణ(2021) ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ అయ్యారు. ఏపీ కేడర్‌కు చెందిన సుస్మిత(2023)తో ఆయనకు వివాహం జరగడంతో కేంద్ర హోంశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. కేంద్రం గెజిట్ విడుదల చేయడంతో విభుకృష్ణ ఏపీ కేడర్‌కు రావడానికి మార్గం సుగమమైంది.

## ఏపీ ట్రైకార్‌కు ఇద్దరు సభ్యుల నియామకం

ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ట్రైకార్) బోర్డు సభ్యులుగా ఇద్దరిని నియమిస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పాడేరుకు చెందిన వంపూరు గంగులయ్య, పుంగనూరుకు చెందిన బూక్యా కృష్ణనాయక్‌ను ట్రైకార్ సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

# ఇంకెన్ని రోజులు పోరాడాలి?

- నేరస్థులంతా బయటే ఉన్నారు.. ఇది న్యాయమా?
- వివేకా కుమార్తె సునీతారెడ్డి ఆవేదన
- భర్తతో కలిసి కడప ఎస్పీతో భేటీ



కడప ఎస్పీ ఆఫీసు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

కడప, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'నాన్న హత్య కేసులో నేరస్థులంతా బయటే ఉన్నారు. తప్పు చేసిన వారికి శిక్షపడలేదు. ఇది న్యాయమా? ఇంకా ఎన్ని రోజులు పోరాడాలి' అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం తన భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కలిసి కడప ఎస్పీ అశోక్ కుమార్‌తో ఆమె భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మళ్లీ ఎవరికీ ఇలా అన్యాయం జరగకూడదనే న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాడుతున్నామన్నారు. 'నాన్న మళ్లీ రాడు.. మళ్లీ ఇలాంటివి జరుగకుండా ఉండాలంటే తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే. చిన్న అయినా.. పెద్ద అయినా.. ఎవరు తప్పు చేసినా శిక్ష పడాల్సిందే. ఇంతవరకు ఎవరికీ.. పోలీసుల దగ్గర, కోర్టులో.. శిక్షపడలేదు.. దీంతో వారు తప్పులు చేస్తూనే ఉన్నారు. నాన్నగారిని హత్య చేసినప్పటి సంఘటనలు కళ్లముందే కనిపిస్తున్నాయి. 2019 మార్చి 15న గొడ్డలితో నరికి బాడీ పడి ఉంటే మొదట హార్ట్ అటాక్ అని చెప్పారు. అక్కడున్న ముగ్గురు నలుగురు పోలీసులను బెదిరించి వాళ్ల ముందే ఆధారాలు లేకుండా చేశారు. ఫుట్ ప్రింట్స్, హ్యాండ్ ప్రింట్స్, క్లూస్ అన్నీ క్లీన్ చేసేశారు. ఈ హత్య ఆదినారాయణ రెడ్డి, సతీశ్‌రెడ్డి, బీటెక్ రవి చేయించారంటూ నా దగ్గరకు ఒక లెటర్ తీసుకొచ్చారు. సంతకం పెట్టమన్నారు. కానీ నేను పెట్టలేదు. మరుసటి రోజు చంద్రబాబుపై నారాసుర రక్తచరిత్ర అని పేపర్లో పెట్టారు. టీడీపీ వాళ్లే చేయించారని చెప్పారు. సాక్ష్యాలను చెరిపేందుకు నాడు వైఎస్ అవినాశ్‌రెడ్డి అనుచరులు ఎలాగైతే బెదిరించారో.. మళ్లీ ఇప్పుడు అదే చేస్తున్నారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న సురేశ్‌రెడ్డి(సైదాపురం చంటి)పై రెండ్రోజుల క్రితం ఎవరో చేశారు. ఆయనకు దెబ్బలు తగిలాయని అవినాశ్‌రెడ్డి బాధపడుతున్నారు. ఆయన్ను గంగిరెడ్డి ఆస్పత్రికి తీసుకుపోయి చికిత్స చేశారు. వైసీపీ నేతలు పరామర్శించారు. ఆ రోజు వివేకాను హత్య చేయించినట్లు ఈరోజు మీరే ఎందుకు సురేశ్‌రెడ్డిపై దాడి చేయించి ఉండకూడదు? రెండు సంఘటనలూ ఒకేలా ఉన్నట్లు అనిపిస్తోంది' అని చెప్పారు.

### అమ్మ రావొద్దంటోంది..

'పులివెందుల, కడపలో ఎలా ప్రశాంతంగా బతకాలి? రేపు (శుక్రవారం) వైఎస్ వివేకానందరెడ్డి జయంతి. పులివెందులకు వెళ్లాలి. అయితే ఈరోజు అమ్మ ఫోన్ చేసి భయపడుతోంది. ఇక్కడ గొడవలు జరుగుతున్నాయి.. నీకేమైనా జరుగుతుందేమోనని భయమేస్తోంది.. రావొద్దని అంటోంది. న్యాయం కోసం పోరాడుతుంటే భయపడాలా? తప్పుచేస్తే భయపడాలా? న్యాయం కోసం పోరాడే సమయంలో పక్కన సెక్యూరిటీ పెట్టుకోవాలా? తప్పు చేసిన వాళ్లు జైల్లో ఉంటే ఇలాంటి పరిస్థితి రాదు. సాక్షులను బెదిరిస్తున్నారు.. నామీదే కేసులు పెడుతున్నారు, మేమే చంపామని ప్రచారం చేస్తున్నారు. ఎంతకైనా దిగజారడమేనా? నాన్న హత్య కేసులో ఏదో ఒక రోజు కచ్చితంగా న్యాయం జరుగుతుందని నాకు నమ్మకముంది. మా తరపున విచారణ అయిపోయింది. కోర్టు ఆదేశాలు ఫాలో అవుతామని ఎస్పీ అన్నారు. బెదిరింపులపై యాక్షన్ తీసుకోవాలని ఆయన్ను కోరాం' అని సునీత చెప్పారు.

## విశాఖ భూ అక్రమాలపై విచారణ

- సీసీఎల్‌ఏను నివేదిక కోరిన రెవెన్యూ మంత్రి
- స్పీకర్ రాసిన లేఖ నేపథ్యంలో చర్యలు
- విచారణ కోరుతూ తాజాగా బొత్స ఎంట్రీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


విశాఖ భూముల వ్యవహారం మరోసారి రచ్చకెక్కుతోంది. మాజీ సైనికులు, డీ-పట్టా అసైన్డ్ భూముల ఆక్రమణ, నిరభ్యంతరపత్రాలు (ఎన్‌ఓసీ) అక్రమంగా జారీ, వీటి వెనుక రాజకీయ నేతలు, సీనియర్ ఐఏఎస్‌లు, రెవెన్యూ అధికారుల పాత్రపై గతంలో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖ భూములను కాపాడాలని, అక్రమాలపై విచారణ చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇటీవల రాసిన లేఖ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అక్రమాలు, ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)ను రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు, డీ-పట్టా భూముల ఆక్రమణలు, మాజీ సైనికుల భూములతో ప్రైవేటు ముఠాల ఒప్పందాలు, వాటి ఆధారంగా అధికారుల నుంచి ఎన్‌ఓసీలు తదితర అంశాలపై ఇప్పటికే విశాఖ జిల్లా కలెక్టర్ నుంచి రెవెన్యూశాఖ వాస్తవిక నివేదిక కోరినట్లు తెలిసింది. ప్రత్యేకించి జనసేన నేత మూర్తి యాదవ్ లేవనెత్తిన ఎండాడ మాజీ సైనికుడి భూమి 5.10 ఎకరాలు, ఈ భూమి విషయంలో ఎన్‌ఓసీ జారీ, దానిపై వచ్చిన ఆరోపణలపై నిగ్గుతేల్చాలంది. కలెక్టర్ నుంచి నివేదిక వచ్చిన తర్వాత ఈ అంశంపై సీసీఎల్‌ఏ పూర్తిస్థాయి పరిశీలన చేసి సర్కారుకు నివేదిక ఇవ్వనున్నారు.

### కూటమి నేతల నుంచి బొత్స వరకు..

విశాఖలో భూ అక్రమాలపై తొలుత కూటమి నేతల నుంచే విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ చేపట్టాల్సిందిగా మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖ కలెక్టర్‌కు జూన్ 16నే లేఖ రాశారు. మాజీ సైనికులు, డీ-పట్టా భూములపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాలను ఉటంకిస్తూ, అందులోని అంశాలపై నిజనిర్ధారణ జరగాల్సిన అవసరం ఉందని ఆ లేఖలో కోరారు. ఆ తర్వాత ఇదే అంశంపై జనసేన నేత మూర్తియాదవ్ స్పందించారు. విశాఖలోని భూ దందాల వెనుక పెద్దల అండదండలున్నాయని, ఉన్నతస్థాయి అధికారుల పాత్ర ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆయన సోదరుడి పేర్లు తెరపైకి వచ్చాయి. దీనిని స్పీకర్ ఖండించారు. తన పేరును లాగారు కాబట్టి, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చాలని రెవెన్యూ మంత్రిని కోరారు. ఆయన రాసిన లేఖ ఆధారంగా విచారణ చేయాలని ప్రభుత్వం సీసీఎల్‌ఏకు చెప్పింది. సరిగ్గా ఇదే సమయంలో వైసీపీ కూడా సీన్‌లోకి వచ్చింది. ఎండాడలోని మాజీ సైనికుల భూములకు ఎన్‌ఓసీ జారీ విషయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇద్దరూ విచారణ జరగాలని కోరుకుంటున్నారు కాబట్టి, నిష్పాక్షిక విచారణ చేసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని తాజాగా వైసీపీ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు.

# పుస్తకంలో పరీక్షలు!

**విడిగా పేపర్లపై రాసే విధానానికి స్వస్తి..11న ఎఫ్‌ఏ-1 నుంచి వినూత్న విధానం అమలు**



- ఒక్క బుక్‌లెట్‌లోనే అన్ని పరీక్షల సమాధానాలు
- సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వేర్వేరుగా..
- ఓఎంఆర్, గ్రాఫ్, మ్యాప్‌లూ ఆ బుక్‌లెట్లలోనే

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ తీసుకున్న 'స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్' అనే వినూత్న విధానం వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఎఫ్‌ఏ-1 నుంచి అమలు కానుంది. ఇప్పటి వరకూ పరీక్షలు అంటే ప్రతిసారీ పేపర్లపై సమాధానాలు రాయడం, వాటిని టీచర్లు దిద్ది మార్కులు వేసి విద్యార్థులకు ఇవ్వడం, ఆ తర్వాత వాటిని పక్కన పడేయడం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం దీనికి స్వస్తి పలుకుతూ.. ఒక విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను ప్రతి పరీక్షకు అంచనా వేయడంతో పాటు ఏడాదిలో ఎలాంటి మార్పు సాధించాడనేది విశ్లేషించాలనే ఉద్దేశంతో ఈ సరికొత్త విధానం తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1 నుంచి 10 తరగతుల్లోని ప్రతి విద్యార్థికి పుస్తకాల తరహాలోనే ఉండే బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో జరిగే మొత్తం పరీక్షలను విద్యార్థి ఆ ఒక్క బుక్‌లెట్‌లోనే రాయాలి. సబ్జెక్టుల వారీగా వేర్వేరుగా బుక్‌లెట్‌లు ఇస్తారు. ఉదాహరణకు తెలుగు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లోనే ఏడాదిలో జరిగే అన్ని తెలుగు పరీక్షల సమాధానాలను విద్యార్థి రాయాల్సి ఉంటుంది. సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ), రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ) పరీక్షలు ఉంటాయి. వాటిలో వ్యాసరూప, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. అలాగే సోషల్ పరీక్ష సమయంలో అవసరమయ్యే మ్యాప్‌లు, గణితం పరీక్ష గ్రాఫ్‌లు కూడా ఉన్నాయి. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సమాధానాలు రాసేందుకు ఓఎంఆర్ షీట్లు కూడా పెట్టారు. ఈ పుస్తకాల్లో పరీక్షలు రాయించడం మొదటిసారి కావడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు టీచర్లకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

**అప్పటికి... ఇప్పటికీ ఎంత తేడా?**

విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పరీక్షల కోసం ప్రత్యేకంగా బుక్‌లెట్‌లు రూపొందించింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ప్రశ్నపత్రాలు కూడా అందించకుండా ఇబ్బందులకు గురిచేసింది. సంవత్సరంలో రెండు పరీక్షలకు ప్రశ్నపత్రాలు సరఫరా చేయకుండా టీచర్లతో బోర్డులపై రాయించింది. నాలుగింటిలో రెండు ఎఫ్‌ఏ పరీక్షల ప్రశ్నపత్రాలను అధికారులు రోజూ ఉదయం ప్రధానోపాధ్యాయులకు పంపేవారు. వాటిని సంబంధిత సబ్జెక్టు టీచర్ ఉదయాన్నే పాఠశాలకు వచ్చి బోర్డుపై రాసేవారు. విద్యార్థులు ఆ బోర్డుపై ఉన్న ప్రశ్నలను చూస్తూ సమాధానాలు రాసిన దుస్థితి గత ప్రభుత్వంలో కనిపించింది.

### అభ్యసన సామర్థ్యం గుర్తింపు

ఈ బుక్‌లెట్ వల్ల విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను ట్రాకింగ్ చేయడం సులభం అవుతుంది. ఏడాది చివర్లో ప్రతి విద్యార్థి మొదటి నుంచి చివరి వరకు ఎలా మెరుగుపడ్డారనేది విశ్లేషించవచ్చు. ఎవరైనా విద్యార్థులు గతం కంటే ఇప్పుడు ఇంకా వెనకబడిపోతే.. వారిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవచ్చు. పరీక్ష జరిగే సమయంలోనే ఆ బుక్‌లెట్లను టీచర్లు విద్యార్థులకు ఇస్తారు. వాటిని మూల్యాంకనం చేసిన తర్వాత మార్కులు వేసినప్పుడు చూపిస్తారు. బుక్‌లెట్‌లను విద్యార్థులు ఇంటికి తీసుకెళ్లే అవకాశం ఉండదు.

# యూరియా ఎక్కడ?

- తగ్గిన సరఫరా.. పెరిగిన వినియోగం
- పక్క రాష్ట్రాలకూ తరలిపోతున్నట్టు అంచనా
- ఎరువుల రేటు పెంచేసిన డీలర్లు.. ఆందోళనలో రైతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

**ఎరువుల ధరలు (బస్తాకు రూ.ల్లో)**

| రకం | వాస్తవధర | సబ్సిడీ | ఎమ్మార్పీ |
|---|---|---|---|
| యూరియా | 2234 | 1967 | 266.50 |
| డీఏపీ | 2740 | 1390 | 1350 |
| 14:35:14 | 2881 | 1091 | 1800 |
| 20:20:0:13 | 2382 | 883 | 1500 |
| 28:29:0 | 3013 | 1033 | 1800 |

రాష్ట్రంలోని రైతులు అధికంగా వాడే యూరియాకు డిమాండ్ ఎక్కువై.. కొరత ఏర్పడింది. వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడటం, అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిపోవడం, రైతులు అవసరానికి మించి వినియోగించడమే ఇందుకు కారణమని రాష్ట్ర అధికారులు, కేంద్ర ప్రభుత్వం చెబుతున్నాయి. ఎరువుల కొరతపై గత నెలలో శ్రీకాకుళం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, తాజాగా నంద్యాల జిల్లాలో మంత్రి జనార్దన్‌రెడ్డి యూరియా సమస్యపై సమీక్ష జరపడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఎరువులకు డిమాండ్‌ను, రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బస్తాకు రూ.100 నుంచి రూ.300వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అదేమంటే.. కంపెనీలు లింక్ ప్రొడక్ట్స్ అంటగట్టడంతో నష్టాలు భరించలేక యూరియానే అమ్మలేమని ఎరువుల వ్యాపారుల సంఘం ప్రకటించింది. ఎరువులు పక్క రాష్ట్రాలకు తరలిపోవడం, వ్యవసాయేతర పరిశ్రమలకు, ఉత్పత్తుల తయారీకి యూరియా మళ్లిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అయితే పంటల సాగు పెరిగి యూరియాకు డిమాండ్ వచ్చిందని, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. యూరియా కోసం డీలర్లు, సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాల వద్దకు క్యూ కడుతున్నారు. జూలై నెలకు రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల్లో ఇంకా కొంత రావాల్సి ఉందని తెలిసింది. తెలంగాణలోని రామగుండం ఎన్‌ఎఫ్‌ఎల్ ప్లాంట్ నుంచి తగినంత ఎరువులు రాష్ట్రానికి రాకపోవడం, ఉత్తరాది రాష్ట్రాల ప్లాంట్ల నుంచీ పెద్దగా ఎరువులు కేటాయించకపోవడం,రాష్ట్రంలో విశాఖ, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులు, రైల్వే వ్యాగన్ ర్యాక్‌లు ఉన్నా.. తగినంతగా ఎరువులు సకాలంలో రాని పరిస్థితులున్నాయి.

### పక్కదారి పడుతున్న ఎరువులు

చైనా నుంచి ఎరువులు దిగుమతి కాకపోవడం, పలు దేశాల్లో యుద్ధ వాతావరణాల వల్ల ఎరువుల కొరత ఏర్పడుతోంది. దీంతో రాష్ట్రాలకు కేటాయించిన యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో నిరుడు ఇదే సమయానికి 3లక్షల టన్నుల యూరియా వినియోగించగా, ఈ ఏడాది ఇప్పటికే 3.88 లక్షల టన్నులు వాడినట్లు కేంద్రం గుర్తించింది. 88వేల టన్నులు అదనంగా వాడకంపై కేంద్ర అధికారులు ఆరా తీశారు. వివిధ రాష్ట్రాలు యూరియాను వ్యవసాయేతర పరిశ్రమల్లో వాడుతున్నారన్న అనుమానం వ్యక్తం చేస్తూ, దీనిపై నిఘా పెట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. యూరియాను పెయింట్లు, వార్నిష్, ప్లైవుడ్, సారా, బీరు, పాల ఉత్పత్తి, కోళ్ల దాణా, చేపలు, రొయ్యలకు ఉత్ప్రేరకంగా వాడుతున్నట్లు కేంద్రం గమనించినట్లు సమాచారం. దీంతో పాటు ఏపీ నుంచి పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశాకు యూరియా అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి కర్ణాటకకు, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి తమిళనాడుకు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఒడిశాకు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి తెలంగాణకు రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో యూరియా అధికంగా తెప్పిస్తున్న హోల్‌సేల్ వ్యాపారులు, ఎక్కువగా అమ్ముతున్న రిటైలర్లు, అత్యధికంగా కొనుగోలు చేస్తున్న వారి వివరాలను, గతేడాది కన్నా ఈ సీజన్‌లో ఎక్కువగా కొనుగోలు చేసిన వారి వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. పరిశ్రమలకు, ఇతర రాష్ట్రాలకు యూరియా తరలించకుండా, వ్యవసాయేతర పరిశ్రమల అవసరాలకు యూరియా వాడే వారిపై చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

**యూరియా నిల్వల పరిస్థితి ఇదీ..**

ఖరీఫ్ అవసరాలకు రాష్ట్రానికి కేంద్రం 6.22లక్షల టన్నుల యూరియా కేటాయించింది. జూలై వరకు 3,04,470 టన్నులు కేటాయించి, 2,75,774 టన్నులు సరఫరా చేసింది. అంటే అప్పటికి 28,696 టన్నుల కొరత ఉంది. ఆగస్టుకు 2లక్షల టన్నులు కావాలని వ్యవసాయ శాఖ కేంద్రాన్ని కోరగా.. 1.65లక్షల టన్నులే కేటాయించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఎకరాల్లో అరటి, ఆయిల్‌పామ్, ఇతర పండ్లతోటలు, కూరగాయ పంటలు సాగులో ఉండగా, ఖరీఫ్ పంటల సాగుతో కలిపి సుమారు 85.47లక్షల ఎకరాలకు చేరింది. అందువల్ల ఆగస్టు నెలకు అదనంగా 35వేల టన్నుల యూరియా కేటాయించాలని వ్యవసాయ శాఖ కేంద్రాన్ని కోరింది. అలాగే ప్రస్తుత సమస్య పరిష్కారానికి ఆగస్టు ప్రణాళిక ప్రకారం సీఐఎల్ ద్వారా 65,650 టన్నులు, ఐపీఎల్ ద్వారా 18,150 టన్నుల యూరియా పంపాలని కోరింది. కానీ ఎరువుల మంత్రిత్వ శాఖ నుంచి ఏ సమాచారం రాలేదని తెలిసింది. అయితే ఈ నెల కోటా పూర్తిగా వచ్చినా యూరియా కొరత తీరే పరిస్థితి లేదు. వాస్తవానికి ఆగస్టులో 2.30 లక్షల టన్నులు అవసరమవుతుందని అంచనా.

### అతిగా వాడొద్దు: వ్యవసాయ శాఖ

సరైన మోతాదులో ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు రైతులకు సూచించారు. అధిక మోతాదులో వాడకం వల్ల చీడపీడలు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని, రసాయన ఎరువులు 20-25% తగ్గించి, నానో, పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులు వాడాలన్నారు. 45 కిలోల యూరియా బస్తా రూ.2,234 అసలు ధర అయితే, 88% రాయితీతో రూ.266.50కే ఇస్తున్నారని, 50కిలోల డీఏపీ బస్తా అసలు ధర రూ.2,740 ఉంటే రూ.1,390రాయితీతో రూ.1,350కే ఇస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా రాష్ట్రంలో రైతుల కోసం ఎరువులపై కేంద్రం రూ.12,500కోట్లు భరిస్తున్నట్లు చెప్పారు.

**పెరిగిన సాగు.. దానితోపాటే డిమాండ్**

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ము ందే వచ్చినా.. జూన్, జూలై నెలల్లో పెద్దగా వర్షాలు కురవలేదు. జూలై రెండో పక్షంలో కోస్తాంధ్రలో ఎక్కువగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో కురిసిన వర్షాలతో 15 జిల్లాల్లో వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నా.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 24.8% వాన లోటు కొనసాగుతోంది. ముఖ్యంగా రాయలసీమలో వర్షా లు తక్కువగా పడ్డాయి. వర్షాలు కురిసిన జిల్లాల్లో వరి, పత్తి సాగు ముమ్మరంగా ఉంది. ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చిన వరదలతో కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు నిండటంతో కృష్ణా, గోదావరి బేసిన్లలో డెల్టా కాలువలకు నీరు విడుదల చేయడంతో వరి సాగు పుంజుకుంది. పత్తి సాగయ్యే మెట్ట ప్రాంతా ల్లో అడపాదడపా పడుతున్న వర్షాలతో చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజల పంటలు సాగులోకి వస్తున్నాయి. ఈ పంటలకు యూరియా అవసరం అవుతోంది. ముఖ్యంగా వరి, పత్తికి రైతులు తక్కువ ధరకు వచ్చే యూరియా ఎక్కువగా వాడుతున్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఫైర్ డీజీ వెంకటరమణకు అభినందనలు తెలుపుతున్న అగ్నిమాపకదళ సిబ్బంది

## త్వరలో 125 ఫైరింజన్లు కొనుగోలు

- సీఎం అంచనాలకు తగ్గట్టు పనిచేయాలి ఫైర్ డీజీ వెంకటరమణ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో 125ఫైరింజన్లు కొనుగోలు చేయనున్నట్లు అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న ఆయన్ను రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అగ్నిమాపక అధికారులు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా వెంకటరమణ వారితో మాట్లాడుతూ.. 'విజయవాడలో గత ఏడాది బుడమేరు పొంగినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలా పనిచేశారో మనందరం చూశాం.. గతంలో విశాఖపట్నంలో హుద్‌హుద్ ను ఎలా ఎదుర్కొన్నారో కూడా మనకు తెలుసు. ఇలాంటి ముఖ్యమంత్రి అంచనాలను అందుకునేలా మనం పని చేయాలి' అని దిశా నిర్దేశం చేశారు. కాగా, కాలం చెల్లిన ఫైరింజన్లు, ఫైర్ మెన్లకు సరైన రక్షణ పరికరాలు లేకుండా విపత్తులు అదుపు చేయడం ఎలా? అని సిబ్బంది ప్రశ్నించగా, త్వరలోనే 125ఫైరింజన్లు కొనుగోలు చేస్తామని, సిబ్బందికి రక్షణ సూట్లు, బూట్లు, బోట్లు సైతం కొనుగోలు చేసి అందిస్తామనడంతో పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వ అంచనాలకు తగ్గట్టు పని చేస్తామని, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు.

## నేడు సీమ, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు

- 14న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత రెండు రోజులు రాయలసీమ, కోస్తాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురువారం నెల్లూరు, కావలి, ఒంగోలులో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈనెల 14వ తేదీన ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. దాని ప్రభావంతో ఈనెల 14 నుంచి రెండు, మూడు రోజులు ఉత్తర కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయన్నారు. కాగా, ద్రోణి ప్రభావంతో శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

## యూఎస్ కౌన్సిల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతల స్వీకరణ



లారా విలియమ్స్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయంలో అమెరికా కౌన్సిల్ జనరల్‌గా లారా విలియమ్స్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత్ - అమెరికా సంబంధాల బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. యూఎస్ కాన్సులేట్ కార్యాలయంలో మరింత నాణ్యమైన సాంకేతిక సేవలు అందిస్తామన్నారు. తెలంగాణ, ఏపీతో పాటు ఒడిశా రాష్ట్రాల పరిధిలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం సేవలందిస్తోంది. ఇదివరకు కౌన్సిల్ జనరల్‌గా పనిచేసిన జెన్నిఫర్ లార్సన్ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో లారా విలియమ్స్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఆమె, యుఎస్‌లో డిప్యూటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా (ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్) పనిచేసి సాంకేతిక, దౌత్యరంగాల్లో విశేష అనుభవం గడించారు.



ఆధునిక స్టాండ్ మగ్గంపై నేత నేస్తూ కార్మికుడితో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# 'నేతన్న భరోసా' ఏడాదికి 25 వేలు

మొదటి నుంచీ చేనేత సంక్షేమానికి పాటుపడిన పార్టీ తెలుగుదేశం మాత్రమే. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చేనేతల సంక్షేమం కోసమే ఎక్కువగా పోరాడాను. ఎన్ని ఇబ్బందులు వచ్చినా చేనేత కార్మికులకు ఏ లోటూ రానివ్వను.

గత ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసింది. ఆప్కో ద్వారా కొనుగోళ్లను నిలిపివేశారు. నూలుపై సబ్సిడీ ఎత్తివేశారు. ఐదేళ్ల పాటు ఈ రంగం తీవ్ర సంక్షోభానికి గురైంది.

వీవర్ శాల పేరుతో ఓ వినూత్నమైన కార్యక్రమానికి లోకేశ్ శ్రీకారం చుట్టడం అభినందనీయం. ఈ మోడల్ విజయవంతమైతే రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రూ.5కోట్లు విడుదల చేస్తున్నాం. 5శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఇందుకయ్యే రూ.15కోట్లను ప్రభుత్వమే భరిస్తుంది" అంటూ సీఎం వరాల జల్లు కురిపించారు. 92,724మంది చేనేత కార్మికులకు రూ.546 కోట్లతో పింఛన్లను అందిస్తున్నామని తెలిపారు. చేనేతల సంక్షేమం కోసం త్వరలోనే యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, 93వేల చేనేత కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. చేనేత బాంధవుడు.. స్వర్గీయ ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

"భారతీయ శక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు శతాబ్దాల క్రితమే ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చింది మన చేనేత. నైపుణ్యం, సృజనాత్మక శక్తి కలబోత మన చేనేతలు. మన తెలుగు నేల చేనేత వైభవానికి పుట్టినిల్లు. మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి, ఉప్పాడ, పెడన, చీరాల, పొందూరు, మనదపల్లి, నందవరం, కొడుమూరు, ఎమ్మిగనూరు... ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్ర రాష్ట్రానికి చేనేత ఒక సంపద. పొందూరు ఖద్దరును మహాత్మగాంధీ మెచ్చారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించుకోవడానికి ఆ చరిత్రే కారణం."

## మంగళగిరి చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా: లోకేశ్

'వివాహాలు, ఇతర ఏ శుభకార్యాలకు వెళ్లినా వారికి మంగళగిరి చేనేత వస్త్రాలను బహుమతిగా ఇవ్వడాన్ని అలవాటుగా మార్చుకున్నా. మంగళగిరి చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా" అని మంత్రి లోకేశ్ తెలిపారు. మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించుకోవడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. చేనేత వృత్తిదారులను కార్మికులు అని సంబోధించడం కన్నా వారిని కళాకారులని చెప్పడమే సమంజసమని అన్నారు. మంగళగిరి చేనేతలంటే తనకెంతో ఇష్టమని తెలిపారు. చేనేతల ఆదాయాన్ని వందశాతం రెట్టింపు చేయాలన్నదే తన లక్ష్యంగా ప్రకటించారు. తన సతీమణి బ్రాహ్మిణి ధరించిన మంగళగిరి చేనేత చీర బాగా వైరల్ కావడంతో ఓ షాపులో అదే రకం చీరలు 98 వరకు విక్రయించారని తెలిసి చాలా ఆనందించానని పేర్కొన్నారు. మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందని, నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లోకేశ్ వివరించారు.

### టీడీపీకి, నేతన్నకు అవినాభావ సంబంధం

"తెలుగుదేశం పార్టీకి, నేతన్నకు అవినాభావ సంబంధం ఉంది. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే సగం ధరకే చీర, ధోవతి ఇచ్చి నేతన్నలకు ఉపాధి కల్పించారు. వ్యవసాయం తర్వాత ఎక్కువమంది ఆధారపడింది చేనేత పరిశ్రమపైనే. సుమారు 1,22,644 కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. 2014-19 మధ్య అధికారంలో ఉన్నపుడు చేనేతలకు అండగా నిలబడి వారి సంక్షేమానికి కృషి చేశాం. రూ.110 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేశాం. దీనికోసం ప్రతిపక్షాలతో పోరాడాం. చీరాలలో చేనేత రుణాల మాఫీ కోసం ధర్నా చేసిన చరిత్ర నాకుంది. 55,500 మంది చేనేత కార్మికులకు రూ.2లక్షల చొప్పున రూ.27 కోట్ల రుణాలు ఇచ్చాం. 90,765 కుటుంబాలకు 100 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం. చేనేత కార్మికులకు తొలిసారిగా 50ఏళ్లకే పింఛన్‌ను ఇవ్వాలని నిర్ణయించిన పార్టీ టీడీపీ."

### గత ఐదేళ్లలో కుదేలు..

"ఈ ఏడాది చేనేత పరిశ్రమ రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించింది. చేనేతల ఆదాయం 30 శాతం పెరిగింది. అయితే అది సరిపోదు. ఆధునిక మార్కెట్‌ను సొంతం చేసుకునేలా నూతన నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి. నూలుపోగు వడికే కార్మికుడి నుంచి వినియోగదారుడి వరకూ అనుసంధానించే ఎకో సిస్టమ్ రూపొందించాలి. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) కింద చేనేత ఉత్పత్తులను విస్తరించే ప్రణాళికకు శ్రీకారం చుడుతున్నాం. ఇప్పటికే 2వేల చేనేత ఉత్పత్తులు ఇందులో రిజిస్టర్ అయ్యాయి."

### రూ.74 కోట్లతో క్లస్టర్లు ఏర్పాటు

"వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలలో రూ.74కోట్లతో క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో 1,374 మంది పనిచేసే అవకాశం ఉంటుంది. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. గతంలో ఆదరణ పథకం కింద సుమారు రూ.964 కోట్లు ఖర్చుచేసి వివిధ వృత్తిదారులకు అండగా ఉన్నాం. మళ్లీ ఆదరణ-3 కింద ఆధునిక మరమగ్గాలు ఇస్తాం. చేనేత రంగంలో ఆధునికతను తీసుకొచ్చే బాధ్యతను స్వీకరిస్తున్నాం. నేత కార్మికులకు ఆధునిక ఉపకరణాలకు తోడు ముడిసరుకులు ఇప్పించి సొంతగా నేసేవిధంగా తోడ్పాటును అందిస్తాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచాం. సెలూన్లకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్ల ఉచిత కరెంటును ఇస్తున్నాం. గీత కార్మికులకు పదిశాతం మద్యం షాపులు 50 శాతం సబ్సిడీపై ఇచ్చాం. బార్లలో కూడా వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించాం. 259 మత్స్య కార్మికులకు కుటుంబాలకు రూ.21వేల వంతున ఆర్థిక సాయం అందించాం. జీవో 217 రద్దుచేశాం. సముద్రం పక్కన నాచు పెంచేందుకు మత్స్యకార మహిళలను భాగస్వాములను చేస్తున్నాం. వడ్డెరలకు పది శాతం క్వారీలను రిజర్వు చేస్తాం. యాదవులు, కురబలకు సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలుచేస్తాం."

### బీసీలను గుండెల్లో పెట్టుకుంటాం

"తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్ని ఆటుపోట్లు వచ్చినా పార్టీని వీడకుండా అంటిపెట్టుకుంది బీసీలే. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య, పల్నాడులో చంద్రయ్యలాంటి వారి త్యాగాలను మరువబోం. బీసీలను టీడీపీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుంది. చట్ట సభల్లో కూడా బీసీలకు 33శాతం రిజర్వేషన్లు రావాలి. అది సాకారమయ్యే వరకూ పోరాడతాం. బీసీలపై ఏటా రూ.40వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో 2లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాం. నామినేటెడ్ పదవుల్లో 30శాతం బీసీలకు ఇచ్చాం. చరిత్రలో ఎన్నడూ చూడనంత సంక్షేమాన్ని ఈ ఏడాదిలోనే చేసి చూపించాం. చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య గుంటూరు జిల్లా నిడుబ్రోలులో జన్మించడం మనందరి అదృష్టం. మీ మంత్రి లోకేశ్ సూచన మేరకు ఆయన జయంతిని అధికారికంగా జరిపిస్తాం."

### ఒక అడుగు ముందున్న లోకేశ్..

"2019లో లోకేశ్ ఇక్కడి నుంచి 5వేల ఓట్లతో ఓడిపోయారు. తాను ఓడిన చోటే మంచి మెజారిటీతో గెలవాలని పట్టుదలతో ముందుకొచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి లోకేశ్ 91 వేల మెజారిటీతో గెలవడం ఓ చరిత్ర. 20 మగ్గాలతో ఇక్కడో వీవర్ శాల పెట్టారు. అదో ప్రయోగం. 3 వేల కుటుంబాలకు దుస్తులు పెట్టి, పట్టాలు అందించారు. ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి ఉండాలన్నది లోకేశ్ సంకల్పం. ఎమ్మెల్యేలందరూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి. చేసిన పనులను గురించి ప్రజలకు ఎప్పకప్పుడు వివరించి చెప్పాలి. చాలామంది చేస్తున్నారు. వాళ్లందరి కన్నా లోకేశ్ ఒకడుగు ముందే ఉన్నారు. ఏమాత్రం అవకాశం కుదిరినా నియోజకవర్గ ప్రజల మధ్యనే గడుపుతున్నారు. ఇదొక మంచి సంప్రదాయం."

### నేత కార్మికులతో సీఎం ముఖాముఖి



**శ్రీలక్ష్మి:** సార్! చేనేత వృత్తిలో 20ఏళ్లుగా ఉన్నాం. నేను, మావారు రోజంతా పని చేసినా నెలకు రూ.12, 13వేలు రావడం లేదు. మాకు ఆధునిక డిజైన్లలో శిక్షణ ఇప్పిస్తారా?

**సీఎం:** మీకు కొత్తగా ఓ పథకాన్ని పెట్టించి ఆధునిక డిజైన్లలో శిక్షణను ఇప్పించడంతో పాటు మీరు తయారుచేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాన్ని కూడ కల్పించేలా చర్యలు తీసుకోవాలని చేనేత, జౌళి శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం.

**గుంటి కమల:** సార్! నేను 25 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నాను. ఉచిత కరెంటు ఇస్తామంటున్నారు. దానికి మేము దరఖాస్తు చేసుకోవాలా? దీనిపై మాకు అవగాహన కల్పించండి.



**సీఎం:** ఈ రోజు 11వ జాతీయ చేనేత దినోత్సవం. చేనేతలకు ఉచిత కరెంటు పథకం ఈ రోజు నుంచే మీకు వర్తిస్తుంది. రాబోయే నెలలో మీరు బిల్లు కట్టే పనుండదు. చేనేత కార్మికులకైతే 200 యూనిట్లు, అదే మరమగ్గం ఇంట్లో ఉంటే 500 యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. డిపార్టుమెంట్ వాళ్లు మీ ఇళ్లకు వచ్చి ఎన్యూమరేట్ చేసి పథకాన్ని మీకు ఈ రోజు నుంచే అమలుచేస్తారు.

## రప్పారప్పా అంటే పోలీసులు రఫ్ఫాడిస్తారు

» వైసీపీ నాయకులను ఉద్దేశించి మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నాయకుల బుద్ధి మారడం లేదంటూ మంత్రి లోకేశ్ విమర్శించారు. తిరుపతిలో దళిత యువకుడిపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దాడి చేయడంపై లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహం డోర్‌డెలివరీ వరకూ.. దళితులపై దమనకాండ జరిపిన వైసీపీ నాయకులు ఇప్పుడూ అదే పంథా కొనసాగిస్తున్నారు. తిరుపతిలో దళితు డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి దాడులకు ఏపీలో చోటులేదు. రప్పారప్పా అంటే ఏపీ పోలీసులు రఫ్ఫాడిస్తారు' అని ట్వీట్ చేశారు.

## స్థిరత్వానికి చిహ్నంగా ఏపీ

» 'గ్రీన్ ఆంధ్ర సమ్మిట్'లో మంత్రి నారాయణ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-2047' దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో ఏపీని స్థిరత్వానికి ప్రపంచ చిహ్నంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో నిర్వహించిన 'గ్రీన్ ఆంధ్ర సమ్మిట్-2025'లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులన్నింటికీ యూజీబీసీ గ్రీన్ బిల్డింగ్ రేటింగ్‌లను స్వీకరించడం ద్వారా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌరులు అందరూ గ్రీనర్, స్మార్టర్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్రంలో 612 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో 550కి పైగా గ్రీన్-సర్టిఫైడ్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, 20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అభివృద్ధి, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వంటి వాటితో 2040 నాటికి ఏపీని నెట్ జీరో స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు పునాదులు వేస్తున్నామని వివరించారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్లీన్ ఎనర్జీ, వాతావరణ స్థితిస్థాపకతతో అమరావతిని మోడల్ గ్రీన్ రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు, సీఐఐ-ఐజీబీసీ వైస్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, సీఐఐ ఏపీ వైస్‌చైర్మన్ నరేంద్రకుమార్, క్రెడాయ్ ఏపీ జనరల్ సెక్రటరీ డి.రాంబాబు, నరెడ్కో ఏపీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ పరుచూరి తదితరులు ఈ సమ్మిట్‌లో మాట్లాడారు.

## జస్టిస్ ఎన్వీ రమణకు తెలుగు వైభవ పురస్కారం

» 9న అవనిగడ్డలో ప్రదానం

అవనిగడ్డ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని అందజేయనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా క్విట్ ఇండియా దినోత్సవాన్ని స్మరించుకుంటూ ఈ నెల 9న పురస్కారం అందజేసి సత్కరిస్తామన్నారు. తెలుగు భాషా వికాసానికి విశేషంగా కృషిచేసిన జస్టిస్ ఎన్వీ రమణకు పురస్కారం అందిస్తున్నామన్నారు.

## అగ్రరాజ్యాల బెదిరింపులకు భారత్ బెదరదు

» ఉషారామా కళాశాల స్నాతకోత్సవ సభలో వెంకయ్య



ఉంగుటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యాల బెదిరింపులకు వెరవకుండా భారత్ మరింత శక్తిమంతంగా దూసుకుపోతుందన్న ప్రగాఢ విశ్వాసం తనకు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే (స్నాతకోత్సవం) ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు, కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్‌తో కలిసి డిగ్రీలు పూర్తిచేసిన 585మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ శక్తిమంతమైన కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత యువతరంపై ఉందని చెప్పారు.

## ఏసీబీ చరిత్రలోనే అవినీతి రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్ తన చాంబర్‌లో ఓ కాంట్రాక్టరు నుంచి ఈ మేరకు డబ్బులు తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ చరిత్రలో ఇదే అతిపెద్ద ట్రాప్. విశాఖకు చెందిన సబ్బవరపు శ్రీనివాస్ విజయవాడలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఈఎన్‌సీగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గిరిజన ప్రాంతాల్లో నిర్మించే ఏకలవ్య పాఠశాలల భవనాల కాంట్రాక్టును విశాఖపట్నానికి చెందిన శ్రీసత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ అధినేత సీహెచ్ కృష్ణంరాజు దక్కించుకున్నారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏకలవ్య పాఠశాల భవనాలను నిర్మించారు. ఒక్కో భవనం అంచనా వ్యయం రూ.12 కోట్లు కాగా, నిర్మాణం పూర్తయ్యేసరికి రూ.15 కోట్లకు చేరింది. ఈ భవనాలకు సంబంధించి కృష్ణంరాజుకు రూ.35.50 కోట్ల బిల్లులు రావాల్సి ఉన్నాయి. ఈ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా శ్రీనివాస్ ఏదో ఒకవిధంగా కొర్రీలు పెడుతున్నారు. చివరకు కొద్దిరోజుల క్రితం ఆయన తన మనసులోని మాటను బయటపెట్టారు. రూ.35.50 కోట్ల బిల్లులు చేయాలంటే రూ.5 కోట్లు లంచం ఇవ్వాలని పట్టుబట్టారు. ముందుగా రూ.25లక్షలు ఇవ్వాలని షరతు విధించారు. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కృష్ణంరాజు విశాఖపట్నం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో అటు విశాఖపట్నం, ఇటు విజయవాడ ఏసీబీ అధికారులు సంయుక్తంగా దాడి చేయాలని నిర్ణయించారు. ఏసీబీ డీజీ అతుల్ సింగ్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేరుగా ఆఫీసులోకి తీసుకొచ్చి లంచం ఇవ్వమని శ్రీనివాస్ ఫోన్‌లో బాధిత కాంట్రాక్టరుకు చెప్పారు. కృష్ణంరాజు తన స్నేహితుల వద్ద నుంచి రూ.25 లక్షలు తీసుకుని బ్యాగ్‌లో పెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. ఆయన ఈఎన్‌సీ చాంబర్‌లోకి వెళ్లిన కొద్ది నిమిషాలకు విజయవాడ ఏసీబీ డీఎస్పీ సుబ్బారావు, శ్రీకాకుళం డీఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు భాస్కరరావు, నాగరాజు శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీనివాస్‌ను ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టి జైలుకు తరలించారు. మరో మూడు వారాల్లో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

### ఆత్మహత్యే శరణ్యమన్నా..

కృష్ణంరాజును ఈఎన్‌సీ శ్రీనివాస్ వైసీపీ హయాం నుంచి లంచాల కోసం వేధిస్తున్నారు. డీవియేషన్ (అదనపు పని)కి అనుమతులు ఇవ్వడం కోసమే భారీగా డబ్బు డిమాండ్ చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని పనులు చేపట్టిన కృష్ణంరాజు.. అప్పులు చెల్లించకపోవడంతో బ్యాంకులు ఆస్తుల వేలానికి నోటీసులిచ్చాయి. తన పరిస్థితిని కృష్ణంరాజు ఈఎన్‌సీకి వివరించారు. బిల్లులు మంజూరు చేయకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి శ్రీనివాస్ స్పందిస్తూ.. 'చస్తే చావు' అని సమాధానం ఇచ్చారు. ఈఎన్‌సీ శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడటం ఇది మూడోసారి. 2001లో విశాఖపట్నం ఎస్‌ఈ కార్యాలయంలో ఏఈగా మొదటిసారి, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ 2014లో రెండో దఫా ఏసీబీకి పట్టుబడ్డారు. సబ్బవరపు శ్రీనివాస్ చీఫ్ ఇంజనీర్ పోస్టుకు అనర్హుడని గత ప్రభుత్వంలో విజిలెన్స్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే అప్పట్లో ఉత్తరాంధ్రకు చెందిన మంత్రుల ద్వారా వ్యవహారాలను చక్కబెట్టి ఆయన ఆ కుర్చీలో కూర్చున్నారు. ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తుండటంతో ఇంకా ఈ సీటులో కొనసాగడానికి ప్రయత్నాలు చేశారు.

### మరో కోటి డిమాండ్

కేంద్ర ప్రభుత్వం లంబసింగిలో రూ.35 కోట్లతో గిరిజన మ్యూజియం నిర్మించాలని నిర్ణయించింది. టెండర్ ప్రక్రియలో కృష్ణంరాజుకు కాంట్రాక్టు దక్కింది. మ్యూజియం సెంట్రింగ్ స్థాయికి వచ్చేసరికి ఇసుక కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. దీన్ని అవకాశంగా మార్చుకున్న ఈఎన్‌సీ శ్రీనివాస్ కృష్ణంరాజును తప్పించి, మరో కాంట్రాక్టరుకు పనులు అప్పగించారు. దీనిపై కృష్ణంరాజు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును అమలు చేయడానికి కృష్ణంరాజు నుంచి శ్రీనివాస్ రూ.కోటి లంచం డిమాండ్ చేశారు. ఈ పరిణామాలను కాంట్రాక్టరు మంత్రి లోకేశ్‌కు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఆ మర్నాడే లోకేశ్ కార్యాలయం నుంచి కృష్ణంరాజుకు ఫోన్ వెళ్లింది. మొత్తం ఆధారాలను పరిశీలించిన తర్వాత న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ రెడీ

» అదనపు బస్సులు, సిబ్బందిని సమకూర్చుకున్నాం
» కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణ వెల్లడి
» రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు
» త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు: ఎండీ
» విజయనగరం జోన్ అధికారులతో సమీక్ష




మహిళలకు బస్సుల్లో ఉచిత టికెట్ ఎలా ఇస్తారో వివరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ. చిత్రంలో ఎండీ ద్వారకా తిరుమలరావు, విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర, ఇతర ఉన్నతాధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమైందని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు. ఈ పథకం విధివిధానాలపై విజయనగరం జోన్ పరిధిలోని అన్ని జిల్లాల ఆర్టీసీ అధికారులతో గురువారం విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనుందని చెప్పారు. ఇందుకోసం అదనపు బస్సులను, సిబ్బందిని సమకూర్చుకున్నామన్నారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారై ఉండాలని.. ప్రభుత్వ గుర్తింపు కార్డులైన ఆధార్‌కార్డు, ఓటరు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ఆర్టీసీకి త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని.. డీజిల్ బస్సుల స్థానంలో క్రమేపీ ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. బస్సు ప్రయాణికుల్లో 76 శాతం మంది మహిళలేనని.. వారందరికీ ఉచిత ప్రయాణ పథకం ఉపయోగకరంగా ఉంటుందని ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్ను దొర అన్నారు. సమావేశంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం.అప్పలరాజు (ఆపరేషన్స్), టి.చెంగల్‌రెడ్డి (ఇంజనీరింగ్), విశాఖ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పీ4 సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో రియాద్ ప్రాంత ప్రతినిధులు







విజయవాడలో జరిగిన పీ-4 సమావేశానికి హాజరైన పారిశ్రామిక వేత్తలు, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

# సంపాదనతో కాదు.. సాయంతోనే తృప్తి!

» పీ4లో కో-స్పాన్సర్ విధానం: చంద్రబాబు
» బెజవాడలో పారిశ్రామికవేత్తలతో సమావేశం

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సంపాదనతో కలుగని సంతృప్తి.. సాయం చేస్తే కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పీ-4పై జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మార్గదర్శులుగా ఉండాలని వారిని కోరారు. 'పీ-4 గురించి తలచుకున్న ప్రతిసారీ కొత్త ఉత్సాహం వస్తోంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలం. నాది సుదీర్ఘ రాజకీయ జీవితం. ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత ఆంధ్రలో, జాతీయ స్థాయి రాజకీయాల్లో చాలా క్రియాశీలంగా పనిచేశాను. ఎన్నో సంస్కరణలు తెచ్చాను. కానీ ఎప్పుడూ కలుగని తృప్తి పీ-4 ద్వారా కలుగుతోంది. సంస్కరణల వల్ల సమాజంలో చాలామార్పు వచ్చింది. ఒకప్పుడు వందల కోట్ల పెట్టుబడులు పెడితే.. అవే అతి పెద్ద ప్రాజెక్టులుగా ఉండేవి. కానీ ఇప్పుడు రూ.లక్షల కోట్ల ప్రాజెక్టులు వస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల వల్లే ఇది సాధ్యమైంది. నాతో సహా ఈ సమావేశంలో ఉన్న చాలా మంది సాధారణ, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవారమే. నాడు సమాజం నుంచి ఎంతో సహకారాన్ని తీసుకుని ఉన్నత స్థితికి చేరాం. ఇప్పుడు అసమానతలు లేని సమాజం కోసం భాగస్వాములు కావలసిన అవసరముంది. ఉన్నత స్థానంలో ఉన్న వారు చేసేది చిన్న సాయమే కావొచ్చు.. పేదరికంలో ఉన్న వారికి అదే అతిపెద్ద ఆలంబన' అని చంద్రబాబు చెప్పారు. మాటల్లో చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో తాను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శిగా నిలిచానని తెలిపారు. 'బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు సహచర మార్గదర్శులతో పోటీపడతా. పేదరిక నిర్మూలన చేపట్టాలనే ఆలోచన నుంచి పీ4 పుట్టింది. సరైన సమయంలో గైడ్ చేయగలిగితే పేదరికంలో ఉన్న వాళ్లు కూడా మంచి స్థాయికి వెళ్లడానికి అవకాశం కల్పించినవారవుతారు. ప్రాధాన్య క్రమంలో బంగారు కుటుంబాలకున్న అవసరాలపై సర్వే చేయించాం. వారిని కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి' అని పారిశ్రామికవేత్తలను కోరారు.

ఎంత సంపాదించినా ఇక్కడే వదిలిపెట్టి వెళ్లాలి. అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే.. సమాజానికి మరింత మంచి చేసినవాళ్లవుతారు. పేదరికంలో ఉన్న వారికి చేయూతనివ్వాలి. వాళ్లకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి.

ప్రభుత్వపరంగా చేయాల్సినదంతా చేస్తున్నాం. ఉన్నత స్థాయిలో ఉన్న వారు కూడా బాధ్యత తీసుకుంటే.. దత్తత కుటుంబాల్లో స్కిల్స్ పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు.

- సీఎం చంద్రబాబు

### లక్ష్యంతో పనిచేస్తే ఏదైనా సాధ్యమే..

అవనిగడ్డలో ఓ పారిశుధ్య కార్మికురాలు మార్గదర్శిగా ఉండేందుకు ముందుకొచ్చిందని.. ఓ పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్ధమైందని సీఎం చెప్పారు. ఇటీవల కొందరు టీచర్లు ముందుకొచ్చారని, చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామని చెబుతున్నారని తెలిపారు. 'ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని కో-స్పాన్సర్ విధానం తెస్తున్నాం. ఆర్థిక సాయం చేసే వారు చేస్తారు. విజ్ఞానాన్ని అందించే వారు కూడా ఆ దిశగా కృషి చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు విజన్-2020 రూపకల్పన చేస్తే అప్పట్లో నన్ను విమర్శించారు. ఇప్పుడా విజన్ నిజమైంది. లక్ష్యంతో పనిచేస్తే ఏదైనా సాధ్యమే. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేస్తున్నాం' అని సీఎం వివరించారు.

### కుటుంబాల దత్తతకు పారిశ్రామికవేత్తలు సై

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పారిశ్రామికవేత్తలు, అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. చంద్రబాబు పిలుపుతో పీ4లో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చారు. ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్న కొందరు ఎన్నారైలు కూడా మార్గదర్శులుగా ఉంటామని ఆయనకు హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లాకు చెందిన మోహన్‌రెడ్డి అనే పారిశ్రామికవేత్త ఓ మండలంలో 729 కుటుంబాలను దత్తత తీసుకుంటానన్నారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన రాధాకృష్ణ, మహ్మద్ అరిఫ్, సుచరిత వంటి వారు 10 కుటుంబాలను దత్తత తీసుకుంటామని చెప్పారు. వరప్రసాద్ అనే పారిశ్రామికవేత్త తనతో పాటు ఇంకొందరు గ్రూపుగా ఏర్పడి బొమ్మనహాళ్ మండలాన్ని దత్తత తీసుకున్నామని, దీనికి సంబంధించి ఓ రిపోర్టు తయారుచేసి ఇస్తామని చెప్పారు. కూరపాటి అనే ఎన్నారై 160 స్కూళ్లను దత్తత తీసుకుంటామని, గొర్రెపాటి చందు అనే వ్యక్తి 10 కుటుంబాలు దత్తత తీసుకోవడంతో పాటు తన మిత్రులతో కలిసి మరో 100 కుటుంబాలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళూరి భాను అనే ఎన్నారై 20 కుటుంబాల్లోని పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అమెరికాకు చెందిన విశ్వప్రసాద్ 10 కుటుంబాలు, సింగపూర్‌కు చెందిన రాంబాబు అనే వ్యక్తి 2 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సంసిద్ధత తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, పీ-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, ఏపీఎన్‌ఆర్‌టీ చైర్మన్ వేమూరి రవి, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐని చంపేశాడు.. ఎన్‌కౌంటర్ అయ్యాడు



మణికంఠన్

- హత్యకు ఉపయోగించిన వేట కొడవలి స్వాధీనానికి వెళ్లిన పోలీసులు
- ఆ కొడవలితోనే పోలీసులపై మణికంఠన్ దాడి
- గాయపడిన ఎస్ఐ శరవణకుమార్
- ఆత్మరక్షణ కోసం సీఐ కాల్పులు.. మణికంఠన్ మృతి

చెన్నై, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా కుడిమంగళం స్పెషల్ సబ్‌ఇన్స్‌పెక్టర్ షణ్ముగవేల్ హత్యకేసు నిందితుడు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి తాగిన మత్తులో కూలీలు మూర్తి(60), ఆయన కుమారులు తంగపాండి(25), మణికంఠన్(30) ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై షణ్ముగవేల్.. తన డ్రైవర్‌తో వెళ్లి ఘర్షణను అడ్డుకున్నారు. ఈ సమయంలో ముగ్గురూ కలిసి ఎస్సైపై దాడి చేసి చంపేశారు. ఈ ముగ్గురూ పోలీసులకు లొంగిపోయినట్లు తొలుత ప్రచారం జరిగింది. మణికంఠన్‌ను ఉడుమలైపేటలో అరెస్టు చేసినట్లు ప్రకటించిన పోలీసులు.. షణ్ముగవేల్‌పై దాడికి ఉపయోగించిన వేటకొడవలిని స్వాధీనం చేసుకునేందుకు గురువారం వేకువజామున అతడిని తీసుకెళ్లారు. చిక్కానత్తు ఉప్పువాగు ఒడ్డున వేటకొడవలిని స్వాధీనం చేసుకుంటుండగా.. మణికంఠన్ పోలీసులపై అదే ఆయుధంతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఎస్సై శరవణకుమార్ కుడిచేతికి గాయమైంది. ఆత్మరక్షణ కోసం మణికంఠన్‌పై సీఐ కాల్పులు జరపగా.. అతడు గాయపడ్డాడు. ఉడుమలపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మణికంఠన్ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. ఎస్సై శరవణకుమార్‌కు అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## తండ్రి హత్య.. 17 ఏళ్లకు ప్రతీకారం

- రౌడీషీటర్‌ను చంపేసిన విద్యార్థి

చెన్నై, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అప్పుడు ఆ పిల్లాడి వయసు రెండేళ్లు. ఆ పిల్లాడి కళ్లెదుటే తండ్రిని పాశావికంగా నరికి చంపేశారు. అతడు పెరిగి పెద్దయ్యాడు. అతనితోపాటు తన తండ్రిని చంపిన వ్యక్తిపై పగా పెరుగుతూ వచ్చింది. అంతే కాదు.. ఆ చంపేసిన వ్యక్తి కనిపించినప్పుడల్లా... 'మీ నాన్నను నడిరోడ్డుపై చంపింది నేనేరా' అంటూ హేళన చేస్తున్నాడు. అంతే అతడిని చంపేయాలన్న నిర్ణయానికొచ్చాడు. నలుగురు స్నేహితులను వెంటబెట్టుకు వెళ్లి చంపేశాడు. ఇదేమీ సినిమా కథ కాదు. తమిళనాడు రాజధాని చెన్నైలో బుధవారం జరిగిన యథార్థ సంఘటన. ఆ కుర్రాడి పేరు యువనేష్. బీబీఏ చదువుతున్నాడు. అతడి చేతిలో హత్యకు గురయ్యింది రౌడీషీటర్ ఫుల్కాన్ రాజ్‌కుమార్ (42). ఈ రాజ్‌కుమార్ 2008లో చెన్నై శివారు ప్రాంతమైన టీపీ సత్రం వద్ద పేరుమోసిన రౌడీ సెంథిల్‌ను హత్య చేశాడు. తండ్రిని చంపేసిన రాజ్‌కుమార్‌పై కోపం పెంచుకున్న యువనేష్.. బుధవారం రాత్రి నలుగురు స్నేహితులతో వెళ్లి.. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న రాజ్‌కుమార్‌ను చంపేశాడు. ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు.. యువనేష్‌ను, అతడి ఇద్దరు స్నేహితులను గురువారం అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చనిపోయిన రాజ్‌కుమార్ ప్రస్తుతం పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. అన్నాడీఎంకే సభ్యుడిగా ఉన్నాడు.

## తురకా కిశోర్‌ను తక్షణమే విడుదల చేయండి

- తుది తీర్పునకు లోబడే ఈ ఉత్తర్వులు: హైకోర్టు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాచర్ల నేత తురకా కిశోర్ అరెస్టులో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించలేదని, రిమాండ్ విధించేటప్పుడు మేజిస్ట్రేట్ సైతం మైండ్ అప్లయ్ చేయలేదని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కిశోర్‌ను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. అయితే ఈ విడుదల ఉత్తర్వులు ప్రస్తుత వ్యాజ్యంలో తామిచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. కిశోర్ అరెస్టుతో రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ వేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇది విలక్షణమైన పోలీసు తరహా కేసుగా అభివర్ణించింది. గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన తన భర్త కిశోర్‌ను పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని.. కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తురకా సురేఖ బుధవారం హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం కిశోర్ అరెస్టుతో పాటు మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులను తప్పుపట్టింది. కిశోర్ అరెస్టు సమయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 47 ప్రకారం.. అరెస్టుకు గల కారణాలను, అందుకు దారితీసిన పరిస్థితులను రాతపూర్వకంగా అందజేయలేదని, కేవలం మౌఖికంగా తెలియపరచారని పేర్కొంది. ప్రస్తుత వ్యవహారం నిందితుడి స్వేచ్ఛతో ముడిపడి ఉన్న నేపథ్యంలో కిశోర్ రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతిస్తున్నట్లు పేర్కొంది. కిశోర్‌ను వెంటనే విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

## కేసు దర్యాప్తులో పురోగతి ఏమిటి?

- ప్రసన్నకుమార్‌రెడ్డి పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడికి సంబంధించి నమోదైన కేసు దర్యాప్తు పురోగతి వివరాలు తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అలాగే దాడికి పాల్పడిన వారిని నిందితులుగా చేర్చకపోవడంపై వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. కేసుపై తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. తన ఇంటిపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేయడంలో నెల్లూరు దర్గామిట్ట పోలీసులు విఫలమయ్యారని, తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ తాను ఫిర్యాదులో పేర్కొన్నవారి పేర్లను నిందితుల జాబితాలో చేర్చలేదంటూ ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది రూపేష్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. దాడికి పాల్పడినవారి ఫొటోలను, సీసీటీవీ ఫుటేజీని పోలీసులకు అందజేశామన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లను పేర్కొనలేదని, దాడికి ప్రేరేపించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై కేసు నమోదు చేయలేదని చెప్పారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ.. దాడిపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ప్రాథమిక విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. దాడికి పాల్పడినవారిని గుర్తించాల్సి ఉందని, దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేసు దర్యాప్తు పురోగతి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

## మళ్లీ రచ్చకెక్కిన 'శాతవాహన' వివాదం

- ఎమ్మెల్సీ ఆలపాటిపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఫిర్యాదు

విజయవాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాసరావు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివాదాన్ని రేపింది. తాను చెప్పినట్టుగా వినకపోతే తన అంతుచూస్తానని ఆలపాటి రాజేంద్రప్రసాద్ బెదిరిస్తున్నారని శ్రీనివాసరావు విజయవాడ పోలీసు కమిషనర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఆ ఆడియో రికార్డింగ్‌ను పోలీసులకు అందజేశారు. అనంతరం మీడియాకు విడుదల చేశారు. తనకు ఏం జరిగినా దానికి ఆలపాటే కారకుడని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాగా, దీనిపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పందించారు. శాతవాహన కళాశాల ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. అసలు శాతవాహన కళాశాలకు, వంకాయలపాటి శ్రీనివాసరావుకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఆయన తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా ఉంటూ రికార్డులను బయటికిచ్చారని ఆరోపించారు. పోలీసులు శ్రీనివాసరావును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఆడియోలో ఆలపాటి.. 'నేను నీ కుటుంబం జోలికి రాను. నీ జోలికే వస్తా. మా వైపునకు వచ్చి చిత్తశుద్ధితో ఉంటే నీ తప్పులన్నీ చెరిగిపోతాయి. నువ్వు చేసిన తప్పులకు శిక్ష వేయకపోతే నేను మనిషిని కాదు' అని అనడం సంచలనం రేపుతోంది.

## కిడ్నీలు అమ్మేసి..
# శవాన్ని పార్శిల్ చేస్తాం

**దళితుడిపై భూమన అనుచరుల పాశవిక దాడి.. గదిలో బంధించి.. ఫైబర్ లాఠీతో చిత్రహింసలు**



ఫైబర్ లాఠీతో పవన్‌కుమార్‌ను కొడుతున్న దినేశ్



భూమన కరుణాకరరెడ్డితో అనిల్‌రెడ్డి



బాధితుడు పవన్ కుమార్

తిరుపతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైసీపీ మూకలు మరోసారి రెచ్చిపోయాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి అనుచరులు... బైక్ అద్దె చెల్లించలేదన్న కోపంతో ఓ దళిత యువకుడిని బంధించి పాశవిక దాడికి పాల్పడ్డారు. ఆ వీడియోలను బాధతుడి తల్లిదండ్రులకు పంపి.. 'మీ కొడుకు మాకు బకాయిపడిన రూ.5 లక్షలు ఇవ్వకపోతే మీ అబ్బాయి కిడ్నీలు అమ్మేసుకుని.. శవాన్ని పార్శిల్ చేస్తాం..' అంటూ బెదిరించారు. సోషల్ మీడియాలో వైరలవుతున్న ఈ వీడియోల్లో చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవపాళెంకు చెందిన పవన్‌కుమార్ అనే దళిత యువకుడిని నగర వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, అతని స్నేహితులు విపరీతంగాకొడుతున్న దృశ్యాలు కనిపించాయి. తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని అనిల్‌రెడ్డికి సంబంధించిన గదిలోనే ఆ యువకుడిని బంధించి, ఫైబర్ లాఠీలతో కొడుతూ చిత్రహింసలకు గురిచేశారు. ఈ వీడియోలను పవన్ తల్లిదండ్రులకు పంపి, తమకు చెల్లించాల్సిన రూ.5 లక్షలు ఇవ్వకపోతే కిడ్నీలు అమ్మేసి శవాన్ని పార్సిల్ చేస్తామని బెదిరించారు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటిలో దాక్కున్న అనిల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. దినేశ్, జగ్గూలను కూడా అరెస్టు చేశారు. వీరిపై కిడ్నాప్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బాధిత యువకుడు పవన్‌కుమార్‌ను కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే...:** వైసీపీ సోషల్ మీడియా నగర అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి ఇటీవల తిరుపతిలో ఎస్వీపీ బైక్ రెంటల్స్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. అక్కడ పవన్ కుమార్ 30 రోజుల క్రితం ఓ బైక్‌ను అద్దెకు తీసుకున్నాడు. దాదాపు 20 రోజులుగా బైక్ అద్దె చెల్లించలేదు. బుధవారం స్విమ్స్ వద్ద స్నేహితులతో ఉన్న పవన్‌ను తీసుకురావాలని తన అనుచరుడు, మరో బైక్ రెంటల్ యజమాని జగదీశ్వరరెడ్డి అలియాస్ జగ్గూ, అతడి వద్ద పనిచేస్తున్న అజయ్‌కుమార్‌ను అనిల్ రెడ్డి పంపాడు. వారు పవన్‌ను తీసుకురాగా... అనిల్ కుమార్ రెడ్డి కార్యాలయంలో ఉంచి దాడి చేశారు.

**వైసీపీ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం: అనిత**

వైసీపీ రాక్షస మనస్తత్వానికి ఈ దాడులు నిదర్శనమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రౌడీ రాజకీయం చేస్తుంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, దీని వెనుక ఉన్న సూత్రధారులను కూడా వదిలేది లేదని హెచ్చరించారు. 'ఇప్పుడు దాడిచేసిన వారిని పరామర్శించేందుకు పులివెందుల ఎమ్మెల్యే తయారవుతాడా?' అని ప్రశ్నించారు. కాగా, తిరుపతిలో దళిత యువకుడిపై దాడి చేసిన నిందితుడికి మాజీ ఎమ్మెల్యే భూమన ఆశ్రయమిచ్చారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. దళితుడిపై దాడి చేసిన అనిల్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారని, వీరిలో అనిల్‌ను భూమన ఇంట్లో అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. నిందితుడికి ఆశ్రయమిచ్చిన భూమనపై కూడా కేసు పెడతామని స్పష్టం చేశారు.

## వాస్తవాలను వక్రీకరించడం తగదు

- జగన్ టీవీతో పాటు రెండు చానెళ్లకు పోలీసుల నోటీసులు
- పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో జారీ

కడప క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో బుధవారం నల్లగొండువారిపల్లెలో ఉద్రిక్త ఘటనపై కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ వివరణ ఇచ్చారని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వాస్తవాలను వక్రీకరించి మీడియా ప్రసారం చేయడం తగదని కడప జిల్లా పోలీసుశాఖ తెలిపింది. సీనియర్ పోలీసు అధికారులు ఇచ్చిన వివరణను యథాతథంగా కాకుండా, వీడియోను చిన్న చిన్న భాగాలుగా ఎడిట్ చేసి స్వప్రయోజనాలకు, ఒక పార్టీకి వత్తాసు పలికేలా వ్యాఖ్యానం చేస్తూ వార్తలుగా ప్రసారం చేయడాన్ని పోలీసుశాఖ తీవ్రంగా ఆక్షేపించింది. సంబంధిత వీడియో పూర్తిగా పోలీసుశాఖ వద్ద ఉందని తెలిపింది. కొద్దికొద్దిగా కట్, కాపీ, పేస్ట్ చేస్తూ వక్రబుద్ధితో, కుట్రపూరితంగా, వివాదాస్పద వ్యాఖ్యలు జోడించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని పేర్కొంది. అవాస్తవాలను వార్తల రూపంలో ప్రసారం చేయడం ద్వారా విద్వేషాలు పెరిగి శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపింది. నల్లగొండువారిపల్లె ఘటనపై కర్నూలు రేంజ్ డీఐజీ వ్యాఖ్యలను వక్రీకరించి ప్రసారం చేసిన మాజీ సీఎం జగన్‌కు చెందిన టీవీతో పాటు టీవీ9, ఎన్‌టీవీ చానెళ్ల ప్రతినిధులకు, యాజమాన్యాలకు పులివెందుల పోలీసు అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో వారిపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.

## చాణక్య బెయిల్ పిటిషన్ డిస్మిస్

- రెండోసారి చెవిరెడ్డి బెయిల్ పిటిషన్



విజయవాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో ఏ8గా ఉన్న బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం తీర్పు వెలువరించారు. అలాగే, విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెండోసారి బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు.

## జుట్టు మొలిపిస్తామని.. ముంచేశారు!

- కాకినాడలో ఓ సంస్థ మోసంపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- రూ.90 వేలు కట్టించుకోవడంతో పాటు టెస్టులతో తొమ్మిది నెలలుగా తాత్సారం
- ఉన్న జుట్టు కూడా కట్ చేయించిన వైనం

కాకినాడ క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'మీ తలపై జుట్టు లేదా.. అయితే మా దగ్గరకు రండి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి జుట్టు మొలిపిస్తాం..' అంటూ ఓ సంస్థ ప్రకటన చూసి మోసపోయాడో వ్యక్తి! ఈ ఘటనకు సంబంధించి కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాలిలా వున్నాయి... తలపై జుట్టు లేని చోట ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో జుట్టు రప్పిస్తామనే ఒక ప్రకటనను చూసిన కాకినాడకు చెందిన కె.సురేష్.. నగరంలోని శ్రీనగర్ సీతాపతి స్వప్నసౌధ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వీఆర్ఎస్ హెయిర్ క్రియేషన్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ నిర్వాహకులు తమవద్ద 9 నెలల ట్రీట్‌మెంట్ ఉంటుందని, రూ.98వేల ప్యాకేజీతో తలపై మెండుగా జుట్టు రప్పిస్తామని చెప్పారు. సురేష్ దగ్గర రూ.10వేలతో పాటు వారే రూ.80వేలు ప్రైవేటు ఫైనాన్స్ చేయించి సంస్థకు జమ చేయించారు. సుమారు 9నెలల నుంచి ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి, టెస్టులు చేయించుకుని రమ్మంటూ కాలయాపన చేశారని బాధితుడు పేర్కొన్నారు. వెళ్లిన ప్రతిసారీ టెస్టులకు రూ.3వేల నుంచి రూ.4వేల ఖర్చయ్యేదని తెలిపారు. ఈ నెల 5న ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి.. తలపై ఉన్న మొత్తం జుట్టును ఒడిసా నుంచి తీసుకొచ్చిన బార్బర్లతో తీయించాడని వాపోయాడు. ఇంటి నుంచి బయటకు రావడానికి మానసిక క్షోభ అనుభవిస్తున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ట్రీట్‌మెంట్ చేయకుండా షుగరు, బీపీ ఉందని తాత్సారం చేస్తుండడంతో గత్యంతరం లేక పోలీసులను ఆశ్రయించానన్నారు.



## లిక్కర్ స్కాంలో ఎంత పెద్దవాళ్లు ఉన్నా
# వదిలేది లేదు!



- నాసిరకం లిక్కర్‌తో ప్రజల జీవితాలతో చెలగాటం
- ఒంగోలులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో ఎంత పెద్దవాళ్లు ఉన్నా వదిలేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడటమే కాకుండా భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఒంగోలులో వచ్చిన మాధవ్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా.. ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పోలీసులు, అధికారుల అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో ఆయన కారు కింద ఒక దళితుడు పడి మృతి చెందినా పట్టించుకోలేదన్నారు. జగన్ ఇదేవిధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

**ఏడాదిలో రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలో రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మాధవ్ తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ట్రంప్ చర్యల వల్ల అమెరికాకే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మనకు తాత్కాలిక ఇబ్బంది కలిగినా మేకిన్ ఇండియాలో భాగంగా దేశం గొప్ప అభివృద్ధి సాధిస్తుందన్నారు. నాణ్యమైన పొగాకుకు ప్రకాశం జిల్లాకు పెట్టింది పేరు అని, అయితే మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపైనా దృష్టిసారించాలన్నారు. పొగాకు రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు అదనపు ఉత్పత్తిపై అపరాధ రుసుం తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. శనగల దిగుమతిపై నియంత్రణ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తాయన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా దామాషా ప్రకారం ఇస్తున్నారన్నారు. రాహుల్‌కు పరిపక్వత లేదు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు పూర్తి నిరాధారమని, ఆయనకు పరిపక్వత లేదని మాధవ్ విమర్శించారు. ఆయన వ్యాఖ్యలపై కర్ణాటక ఈసీ స్పందించి ఆధారాలు ఉంటే సమర్పించాలని, లేదంటే ఉపసంహరించుకోవాలని హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్య కళ్యాణ్‌చక్రవర్తి, మాజీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, యోగయ్య యాదవ్, ఈదర మోహన్‌బాబు, శిరసనగండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.